అనుదినం... జనస్వరం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
శనివారం 04-11-2023
సంపుటి : 9 సంచిక : 304 | Published from Hyderabad, Rangareddy, Khammam, Karimnagar | 10 పేజీలు + టాబ్లాయిడ్ 12 పేజీలు వెల : 6.50

కాళేశ్వరం కుంగుతోంది

నిర్మాణంలో వైఫల్యం..ప్లానింగ్, డిజైన్‌లో లోపాలు

- క్వాలిటీ కంట్రోల్,, ఆపరేషన్ మెయింటెనెన్స్ సరిగాలేవు..
- ఆందోళనకరంగానే అన్నారం, సుందిళ్ల బ్యారేజ్ లు
- రాష్ట్ర ప్రభుత్వానిది అసంపూర్తి సమాచారం
- మేడిగడ్డ బ్యారేజ్ పై డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక



కాళేశ్వరం ప్రాజెక్టులో కీలకమైన మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోవడంపై నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) నివేదిక విడుదల చేసింది. కమిటీ కోరిన మొత్తం డేటాను రాష్ట్ర ప్రభుత్వం అందించలేదని, మొత్తం 20 అంశాలపై రాష్ట్ర ప్రభుత్వాన్ని వివరణ కోరితే కేవలం 11 అంశాలపైనే వివరణ ఇచ్చిందని తెలిపింది. రాష్ట్ర ప్రభుత్వం అందించిన డేటా అసంపూర్తిగా ఉంది. ఇన్‌స్ట్రుమెంటేషన్, వర్షాకాలం ముందు తర్వాత ఇన్‌స్పెక్షన్ రిపోర్టులు, కంప్లేషన్ రిపోర్టులు, క్వాలిటీ రిపోర్టులు, థర్డ్ పార్టీ మానిటరింగ్ రిపోర్టులు, భౌగోళిక సమాచారం, వర్షాకాలం ముందు తర్వాత నది కొలతలను చూపించే ముఖ్యమైన స్ట్రక్చరల్ డ్రాయింగ్‌లపై తెలంగాణ సర్కార్ తమకు సమాచారం ఇవ్వలేదని తెలిపింది.

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

ఈ సమాచారానికి అవసరమైన పరీక్షలు, అధ్యయనాలను రాష్ట్రం నిర్వహించలేకపోయి ందని కమిటి నిర్ధారించింది. రాష్ట్ర ప్రభుత్వం తమ వద్ద ఉన్న సమాచారాన్ని ఇవ్వకున్నట్లయితే ఇది డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 ప్రకారం చట్టపరమైన చర్యలకు దారితీయవచ్చని కూడా తెలియచేసింది.

నాలుగు అంశాల్లో వైఫల్యం వల్లే....

ప్లానింగ్, డిజైన్, క్వాలిటీ కంట్రోల్, ఆపరేషన్ మెయింటెనెన్స్... మొత్తం ఈ నాలుగు విషయాల్లో వైఫల్యం చెందడంవల్లే మేడిగడ్డ బ్యారేజ్ కుంగిపోయిందని ఎన్డీఎస్ఏ స్పష్టం చేసింది. పిల్లర్లు కుంగిపోవడానికి బ్యారేజి పునాదులకింద ఇసుక కొట్టుకుపోవడమే కారణమని ఆ నివేదికలో పేర్కొంది. బ్యారేజీ పునాది కింద ఉన్న ఇసుక కొట్టుకుపోవడం వల్ల పిల్లర్స్ సపోర్ట్ బలహీనపడిందని,ఫౌండేషన్ మెటీరియల్ పటిష్టత, సామర్థ్యం తక్కువగా ఉందనితెలిపింది. బ్యారేజ్ లోడు వల్ల ఎక్కువగా ఎగువన ఉన్న సెకాంట్ పైల్స్ (కాంక్రీట్) కూడా వైఫల్యం చెందడంతో పిల్లర్లు మునిగిపోయాయని పేర్కొంది.

బ్యారేజీ ప్రణాళిక (ప్లానింగ్), రూపకల్పనలు (డిజైన్) సరిగా లేకపోవడం బ్యారేజీ వైఫల్యాన్ని స్పష్టంగా సూచిస్తోందని నివేదిక పేర్కొంది. బ్యారేజీకి ...6లో

కేసీఆర్ సర్కారుకు దెబ్బ

ఎన్ఎస్‌డీఏ రిపోర్టుతో సాగునీటిశాఖలో ఆందోళన

- ప్రాథమిక అంశాలను పట్టించుకోని గులాబీ ప్రభుత్వం

వివరాలు 6లో..

కుల గణనకు ఏపీ క్యాబినెట్ ఓకే

అమరావతి : రాష్ట్రంలో కుల గణన, సామాజిక, ఆర్థిక అంశాల గణన చేపట్టేందుకు ఏపీ క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది.ఏపీ ముఖ్యమంత్రి వైఎస్.జగన్ అధ్యక్షతన బుధవారం నిర్వహించిన సమావేశంలో ప్రభుత్వ శాఖలు సమర్పించిన 38 ప్రతిపాదనలపై చర్చించింది. పలు కీలక నిర్ణయాలకు మంత్రి వర్గం ఆమోదం తెలిపింది. రాష్ట్రంలో మరో కొత్త పథకానికి ఏపీ మంత్రివర్గం ఆమోదం తెలిపింది. జగనన్న సివిల్స్ సర్వీసెస్ ప్రోత్సాహకం పేరిట ఈ పథకాన్ని తీసుకురానున్నారు. సివిల్స్ ప్రిలిమ్స్ ఉత్తీర్ణులైనవారికి రూ.50వేలు, మెయిన్స్‌లో ఉత్తీర్ణులైతే రూ.లక్ష ఇవ్వాలని నిర్ణయించారు. రాష్ట్ర వ్యాప్తంగా 6,790 ఉన్నత పాఠశాలల్లో నైపుణ్యాభివృద్ధి కోసం కేంద్రాల ఏర్పాటుకు క్యాబినెట్ ఆమోదం తెలిపింది. జర్నలిస్టులకు ఇండ్ల స్థలాల కేటాయింపునకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. కర్నూలులో నేషనల్ లా వర్సిటీకి మరో 100 ఎకరాల భూ కేటాయింపునకు మంత్రివర్గం ఆమోదముద్ర వేసింది. పరిశ్రమలకు కొత్త భూ కేటాయింపు విధానం, ...9లో

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

మరింత కఠినంగా నియమావళి అమలు



- యువ ఓటర్లు 9,10,810 మంది
- 10వ తేదీలోపు తుది ఓటర్ల జాబితా
- ఆ తర్వాతే ఇంటింటికీ పోల్ స్లిప్‌ల పంపిణీ
- రైతుబంధుపై ప్రభుత్వం నుంచి ఎలాంటి ప్రతిపాదన రాలేదు : రాష్ట్ర సీఈఓ వికాస్‌రాజ్

వివరాలు 6లో..

మోడీ బొమ్మతో కష్టమే

కర్నాటక అసెంబ్లీ ఎన్నికలతో స్పష్టం



అసెంబ్లీ ఎన్నికల్లో భయపడుతున్న బీజేపీ రాష్ట్ర శాఖలు

- కేంద్రంపై వ్యతిరేకత కూడా ప్రభావం చూపే అవకాశం : రాజకీయ విశ్లేషకుల వెల్లడి

మోడీ, షా ల చేతిలో పార్టీ ఉన్నంత కాలం రాష్ట్రాల్లో ఆ పార్టీ నుంచి బలమైన నాయకులు వచ్చే అవకాశం ఉండదని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ప్రస్తుతం జరగబోయే ఐదు రాష్ట్రాల ఎన్నికలతో పాటు.. భవిష్యత్తులో జరగబోయే ఆయా ఎన్నికల్లో సైతం బీజేపీకి ఇది తీరని నష్టాన్ని చేకూరుస్తుందని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ప్రతిపక్ష నాయకులను కేంద్ర దర్యాప్తు సంస్థలతో కట్టడి చేసే ప్రయత్నాన్ని మానుకొని.. ప్రజల ఆశీర్వాదాన్ని పొందే ప్రయత్నాన్ని బీజేపీ చేయాలని వారు అంటున్నారు.

న్యూఢిల్లీ : తాము మిగతా పార్టీల కంటే భిన్నమనీ, తమ పార్టీకి ఒక సిద్ధాంతం ఉన్నదని బీజేపీ నాయకులు తరచూ చెప్పుకునే మాట. పార్టీలో రాజకీయాలు వ్యక్తుల చుట్టూ తిరగవని వారు అంటుంటారు. అయితే, ప్రస్తుత మోడీ-షా నేతృత్వంలోని పార్టీ అందుకు భిన్నంగా ఉన్నది. పార్టీలో మోడీ, షా లు ఇద్దరే అన్నీ తామైనట్టు వ్యవహరిస్తున్నారని రాజకీయ విశ్లేషకులు అంటున్నారు. ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో ఈ తీరు మరింత స్పష్టమవుతున్నది. రాష్ట్ర స్థాయి నాయకులను కాదనీ.. మోడీ, షాలు ఆయా రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలలో ప్రచారాలు, బహిరంగ సభలు పెడుతూ అంతా తామేనన్నట్టు వ్యవహరిస్తున్నారని విశ్లేషకులు గుర్తు చేస్తున్నారు. అయితే.. రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో మోడీ, షాల ప్రచారాలు ఏ మాత్రమూ పని చేయటం లేదనీ, పలు ఎన్నికల్లో ఇది స్పష్టమైందని తెలుపుతున్నారు. ఇందుకు ...9లో



మేడిగడ్డ కుంగింది...
పాపాల పుట్ట పగిలింది

కేసీఆర్ క్రిమినల్ పొలిటీషియన్

- ఒక వ్యక్తి పాదాల కింద తెలంగాణ సమాజం నలిగిపోతోంది
- నేను కందిపప్పు...కేటీఆర్ గన్నేరు పప్పు
- రైతు బంధు మాదే..కేసీఆర్ కాపీ కొట్టారు
- కమ్యూనిస్టులతో చర్చలు కొనసాగుతున్నాయి :'మీట్ ది ప్రెస్'లో టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి

వివరాలు 6లో..

రాజస్థాన్‌లో సీపీఐ (ఎం) అభ్యర్థుల నామినేషన్లు

భారీ ర్యాలీలు, సభలు వేలాదిగా తరలివచ్చిన జనం

- దత్తారంగఢ్ సభకు బృందాకరత్ హాజరు



జైపూర్ : రాజస్థాన్‌లోని పలు నియోజకవర్గాల్లో సీపీఐ(ఎం) అభ్యర్థులు శుక్రవారం తన నామినేషన్లను సమర్పించారు. నామినేషన్లు దాఖలు చేసే సందర్భంగా భారీ ర్యాలీలు, బహిరంగ సభలు ఏర్పాటు చేశారు. వీటికి వేలాదిమంది సీపీఐ(ఎం) కార్యకర్తలు, మద్దతుదారులు, ప్రజలు హాజరయ్యారు. దత్తారంగఢ్ నియోజకవర్గంలో పార్టీ పొలిట్‌బ్యూరో సభ్యులు బృందాకరత్ సమక్షంలో సీపీఐ(ఎం) అభ్యర్థిగా అమ్రారామ్ నామినేషన్ దాఖలు చేశారు. నామినేషన్‌కు ముందు భారీ ఊరేగింపు నిర్వహించారు. నామినేషన్ వేసిన తరువాత ...9లో

ఎంఐఎం తొలి జాబితా

తొమ్మిది స్థానాల్లో పోటీకి నిర్ణయం



- 6 స్థానాల్లో అభ్యర్థుల ప్రకటన
- ఇద్దరు సిట్టింగ్‌లకు మొండి చెయ్యి
- మిగతా స్థానాల్లో బీఆర్ఎస్‌కు మద్దతు : పార్టీ అధినేత అసదుద్దీన్ వెల్లడి

వివరాలు 6లో..

ఎన్నికల్లో పోటీ చేయం..

కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతు

- ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలొద్దనే.. ఈ నిర్ణయం
- పాలేరులో పోటీ చేయను : వైఎస్ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల



వివరాలు 6లో..

బీజేపీకి ఓట్లడిగే
అర్హతెక్కడిది..?

దళితుల గురించి కాంగ్రెస్ ఆమాత్రం ఆలోచించలేదు

- బీడీ కార్మికులకు పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ
- మాయ మాటలు నమ్మి ఆగం కావొద్దు
- అన్ని కులాలు, మతాలు కలిసి ముందుకు సాగాలి : ప్రజా ఆశీర్వాద సభల్లో ముఖ్యమంత్రి కేసీఆర్



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి/కోరుట్ల/ఆర్మూర్

మోడీ ప్రభుత్వం అన్నింటినీ ప్రయివేటు పరం చేస్తోందని, రాష్ట్రానికి రావాల్సిన రూ.25వేల కోట్ల నిధులు ఇవ్వలేదని, 33 జిల్లాల్లో ఒక్క మెడికల్ కళాశాల, నవోదయ స్కూల్ ఇవ్వలేదని, ఇక ఏం ముఖం పెట్టుకొని బీజేపీ ఓట్లు అడుగుతుందని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆ పార్టీకి రాష్ట్రంలో ఓట్లు అడిగే అర్హత లేదని వ్యాఖ్యానించారు. దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్ల పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ.. దళితుల అభివృద్ధి గురించి ఆలోచించి ఉంటే ...9లో

తొలి రోజు
వంద నామినేషన్లు

తుమ్మల, రేవంత్‌రెడ్డి సహా పలువురు దాఖలు

- స్వతంత్ర అభ్యర్థులే ఎక్కువ





నవతెలంగాణ- విలేకరులు

అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో మొదటి రోజు శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా వంద నామినేషన్లు దాఖలైనట్టు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి కార్యాలయం తెలిపింది. తొలిరోజు నామినేషన్లు వేసిన వారిలో కొడంగల్ నియోజకవర్గం నుంచి ...6లో

ఎన్నికల వేళ..కమిటీలు ఖాళీ

వివేక్ రాజీనామాతో పెండింగ్‌లో బీజేపీ మ్యానిఫెస్టో

- హ్యాండిచ్చిన స్క్రీనింగ్ కమిటీ చైర్మెన్ రాజగోపాల్ రెడ్డి
- ఎలక్షన్స్ ఇష్యూస్ కన్వీనరూ అదే పార్టీలోకి
- ప్రభావిత కమిటీ చైర్మెనే దిక్కులు చూస్తున్న వైనం
- గవర్నర్‌గా వెళ్లిపోయిన సమన్వయ కమిటీ చైర్మెన్

ఎన్నికల మేనేజ్‌మెంట్‌లో భాగంగా బీజేపీ వేసిన 14 కమిటీలు ఉత్సవ విగ్రహాలుగా మారుతున్నాయి. కమిటీల చైర్మెన్లు ఒక్కొక్కరుగా ఆ పార్టీకి రాంరాం చెప్పేస్తున్నారు. మ్యానిఫెస్టో, స్క్రీనింగ్ కమిటీల చైర్మెన్లు, ఎలక్షన్స్ ఇష్యూస్ కమిటీ కన్వీనర్ కాంగ్రెస్ గూటికి చేరిపోయారు. ప్రభుత్వ విధానాలను ఎత్తిచూపేందుకు వేసిన పోరాటాల కమిటీ చైర్మెన్ విజయశాంతి సొంత పార్టీపైనే బాణాలు ఎక్కుపెడుతున్నారు. నేడో, రేపో ఆమె కూడా హస్తం పార్టీ తీర్థం పుచ్చుకోనున్నట్టు చర్చ నడుస్తున్నది. ఇతర పార్టీల నేతలను ప్రభావితం చేసేందుకు వేసిన ప్రభావిత కమిటీ చైర్మెన్ కూడా పక్కపార్టీ వైపు చూస్తున్న పరిస్థితి నెలకొంది. పోల్ మేనేజ్‌మెంట్, ఎన్నికల వ్యూహాలు తెలిసిన కీలకమైన కమిటీల చైర్మెన్లంతా కాంగ్రెస్ గూటికి చేరుతుండటం ఇప్పుడు బీజేపీని కలవరపెడుతున్నది. అదే సమయంలో పార్టీలో నేతల మధ్య వైరుధ్యాలను తగ్గించడంలో భాగంగా వేసిన సమన్వయ కమిటీ చైర్మెన్ నల్లు ఇంద్రసేనారెడ్డి త్రిపుర గవర్నర్‌గా వెళ్లిపోయారు. దీంతో నేతల మధ్య సమన్వయమే కొరవడుతున్నది. చైర్మెన్లకు సపోర్టుగా వేసిన కో-కన్వీనర్లు తమ నియోజకవర్గాలకే పరిమితమై పనిచేసుకుంటున్న పరిస్థితి. దీనిని బట్టే ఎన్నికల ముందే బీజేపీ చేతులెత్తేసినట్టు కనిపిస్తున్నది.



నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

పార్టీ నుంచి ఆయా స్థానాల నుంచి అభ్యర్థిత్వాన్ని ఆశిస్తూ చేసుకున్న దరఖాస్తులను పరిశీలించి షార్ట్ లిస్టు తయారు చేయడంలో స్క్రీనింగ్ కమిటీది కీలక పాత్ర. అలాంటి ముఖ్యమైన బాధ్యతను బీజేపీ మాజీ ఎమ్మెల్యే రాజగోపాల్‌రెడ్డికి బీజేపీ కట్టబెట్టింది. ఆ పార్టీలో జరుగుతున్న పరిణామాలను చూసి ఆయన అటువైపే చూడలేదు. బీఆర్ఎస్‌కు బీజేపీ వంతపాడుతున్నదని ఆరోపిస్తూ ఆ పార్టీనే వీడారు. ఎటూపాలుపోని స్థితిలో కిషన్‌రెడ్డి, మరో ఇద్దరు ముగ్గురు నేతలను పట్టుకుని పని కానిచ్చేశారు. అభ్యర్థుల ...9లో

మతోన్మాద ఎంఐఎంకు ఓటమి తప్పదు

- ఎంఐఎం, బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఒక్కటే : నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్ ఖాన్

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



మతోన్మాద ఎంఐఎంకు ఈ సారి ఓటమి తప్పదని నాంపల్లి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఫిరోజ్‌ఖాన్ తెలిపారు. ఎంఐఎం అభ్యర్థుల ప్రకటన నేపథ్యంలో ఆయన శుక్రవారం మీడియా సమావేశంలో మాట్లాడారు. బీజేపీ, బీఆర్ఎస్ పార్టీలు ఎంఐఎం తొత్తులుగా వ్యవహరిస్తున్నాయని, ఆ మూడు పార్టీలు ఒక్కటేనని విమర్శించారు. నియోజకవర్గంలో 90 వేల బోగస్ ఓట్లున్నట్టు ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తే వాటిలో 40 వేల ఓట్లు తొలగించారనీ, ఇంకా 50 వేల బోగస్ ఓట్లు ఉన్నాయని తెలిపారు. ప్రతిసారి ఎంఐఎం బోగస్ ఓట్లతో గెలుస్తుందనీ, ఈ సారి అలాంటి పప్పులేవి ఉడకవని హెచ్చరించారు. తమ పార్టీ నాయకులు, కార్యకర్తల ద్వారా బోగస్ ఓట్లు పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకుంటామని తెలిపారు. ఆరున నామినేషన్ దాఖలు చేస్తామనీ, మతం ఆధారంగా చేసే విద్వేష రాజకీయాల కాలం చెల్లిందని హెచ్చరించారు. మతోన్మాద నాంపల్లిగా మార్చిన ఎంఐఎం చేతుల నుంచి తిరిగి సెక్యులర్ నాంపల్లిగా మార్చి ఆదర్శంగా తీర్చిదిద్దడమే తన లక్ష్యమని ఫిరోజ్ ఖాన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మిమిక్రీ అశోక్ కుమార్ రచించి, స్వరపరిచిన ఫిరోజ్ భాయ్ ప్రచార గీతాన్ని విడుదల చేశారు. సమావేశంలో ఫిరోజ్ ఖాన్ సతీమణి లైలాఖాన్ తదితరులు పాల్గొన్నారు.

కాళేశ్వరం వాస్తవాలు ప్రజల ముందు పెట్టాలి

- లేదంటే మేమే బయటపెడతాం
- అధికార దుర్వినియోగానికి ప్రాజెక్టే సాక్ష్యం
- రౌండ్‌టేబుల్‌లో వక్తల విమర్శ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి–హైదరాబాద్

కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించి పూర్తి వాస్తవాలను ప్రజల ముందు పెట్టాలని పలువురు వక్తలు వ్యాఖ్యానించారు. లేదంటే మేమే బయటపెడతామని హెచ్చరించారు. తెలంగాణ జర్నలిస్టుల అధ్యయన వేదిక ఆధ్వర్యంలో శుక్రవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో "కుంగుతున్న కాళేశ్వరం ప్రాజెక్టు బ్యారేజీలు..పరిష్కార మార్గాలు ?" అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఇందులో రాజకీయ నాయకులు, రిటైర్డ్ ఇంజినీర్లు, మేధావులు పాల్గొని తమ అభిప్రాయాలను వెల్లడించారు. ఈ సందర్భంగా టీజేఎఫ్ అధ్యక్షులు కోదండరాం మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు డ్యామ్ సేఫ్టీ రిపోర్ట్ బయట పెట్టాలని కోరారు. ప్రాజెక్టు అద్భుతాలపై రాష్ట్ర ప్రభుత్వం తన ప్రగల్భాలు ఆపాలని సూచించారు. ముఖ్యమంత్రే అన్ని పనులు చేస్తానంటే ఎలాగని ప్రశ్నించారు. శ్రీశైలం, నాగార్జునసాగర్, దేవాదుల ప్రాజెక్టులు ధడంగా ఉంటే కాళేశ్వరం ప్రాజెక్టుకు ఏమైందని ప్రశ్నించారు. ఈ ప్రాజెక్టుపై సమగ్ర దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ ప్రొఫెసర్ రమేష్‌రెడ్డి మాట్లాడుతూ నదిపై అధ్యయనం చేయకుండానే కాళేశ్వరం ప్రాజెక్టు కట్టడం సరికాదన్నారు. రిటైర్డ్ ఇంజినీర్లపై ఆధారపడి కట్టిన ప్రాజెక్టు కుంగిపోవడంపై ఇప్పుడు బాధ్యత ఎవరు తీసుకుంటారని ప్రశ్నించారు. కాళేశ్వరం అంతర్జాతీయ టూరిజం కోసమే కట్టారని గుర్తు చేశారు. రిటైర్డ్ చీఫ్ ఇంజినీర్ నర్సింహారావు మాట్లాడుతూ మేడిగడ్డ చాలా క్లిష్టమైన ప్రాజెక్టు అని చెప్పారు. బ్యారేజీలు కేవలం ఐదు టీఎంసీల వరకే నిర్మిస్తారనీ, డెల్టా ప్రాంతంలోనే వీటిని కడతారని చెప్పారు. మేడిగడ్డను స్టోరేజ్ చేయని పక్షంలో ఎప్పుడూ ఫ్లష్ చేస్తూ ఉండాలని చెప్పారు. సీనియర్ జర్నలిస్టు విజయసారథి రెడ్డి మాట్లాడుతూ డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021 ప్రకారం కేంద్రానికి రాష్ట్ర ప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్టుపై పూర్తి వివరాలు ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు సర్వేనే సరిగ్గా చేయలేదన్నారు. తప్పు ఉంటే రీ సర్వే చేయాలని గుర్తుచేశారు. ప్రాణహిత – చేవెళ్ల ప్రాజెక్టును ఎందుకు పక్కనపెట్టి కాళేశ్వరం కట్టారని ప్రశ్నించారు. రిటైర్డ్ ఇంజినీర్ శ్యామ్‌ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టు రికార్డులను సీజ్ చేయాలనీ, బాధ్యులైన ఇంజినీర్లు, అధికారులను జైలులో పెట్టాలని డిమాండ్ చేశారు. రాఫ్ట్ పిల్లర్ల కింద ఇసుక కొట్టుకుపోవడంతోనే మేడిగడ్డ కుంగుబాటుకు గురైందన్నారు. ప్రాణహిత ప్రాజెక్టును మళ్లీ నిర్మించాలని కోరారు. లక్ష యాభై వేల కోట్ల నిధులు నాశనం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ రౌండ్‌టేబుల్‌కు అధ్యయన వేదిక అధ్యక్షులు వేణుగోపాల్‌రెడ్డి అధ్యక్షత వహించగా, ప్రధానకార్యదర్శి సాధిక్ సమన్వయం చేశారు.

క్యూబాపై అమెరికా ఆంక్షలకు వ్యతిరేకత పెరుగుతోంది

- ఐరాస తీర్మానం పట్ల వెనిజులా హర్షం

కారకస్ : క్యూబాపై అమెరికా ఆర్థిక ఆంక్షలకు వ్యతిరేకంగా ఐక్యరాజ్య సమితి ఆమోదించిన తీర్మానం పట్ల వెనిజులా హర్షం వ్యక్తం చేసింది. క్యూబాపై అమెరికా అమలు చేస్తున్న ఆర్థిక, వాణిజ్య ఆంక్షలను తక్షణమే విరమించాలని కోరుతూ ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ అత్యధిక మెజారిటీతో తీర్మానాన్ని ఆమోదించింది. ఈ తీర్మానానికి అనుకూలంగా 187 దేశాలు ఓటు వేశాయి. ఈ విజయం మాది కూడా అని భావిస్తున్నట్లు వెనిజులా విదేశాంగ మంత్రి వాయాన్ గిల్ అన్నారు. అమెరికా ఆంక్షలకు అంతర్జాతీయ వ్యతిరేకత పెరగుతోందన్నారు. క్యూబాపై దశాబ్దాల పాటూ అమెరికా అనుసరిస్తున్న ఆర్థిక, వాణిజ్య, ఆర్థిక ఆంక్షలకు అంతర్జాతీయంగా తీవ్ర వ్యతిరేకత వస్తోందని అన్నారు. ప్రతిఘటనకు మారు పేరుగా నిలిచిన క్యూబా అధ్యక్షుడు మిగ్వెల్ డియాస్ కానెల్, కూబా ప్రజలకు అభినందనలు తెలియచేశారు. గత 31 సంవత్సరాలుగా ప్రతి ఏటా క్యూబాపై ఆంక్షలను ఎత్తివేయాలంటూ విజ్ఞప్తులు వస్తూనే వుంటాయి. ఈసారి 187మంది అనుకూలంగా ఓటు చేశారు. ఉక్రెయిన్ గైర్హాజరు కాగా, అమెరికా,ఇజ్రాయిల్‌లు వ్యతిరేకంగా ఓటు వేశాయి.

సీపీఎస్‌ను రద్దు చేయాల్సిందే

- టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి జగదీశ్వర్
- ఏఐఎస్‌జీఈఎఫ్ ఆధ్వర్యంలో ప్రదర్శన

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



దేశంలో కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీం (సీపీఎస్)ను రద్దు చేయాల్సిందేనని టీఎన్జీవో ప్రధాన కార్యదర్శి మారం జగదీశ్వర్ కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య (ఏఐఎస్‌జీఈఎఫ్) పిలుపు మేరకు శుక్రవారం ఢిల్లీలోని రాంలీలా మైదానంలో చేతావనీ ర్యాలీ నిర్వహించారు. టీఎన్జీవో నుంచి సుమారు వంద మంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా జగదీశ్వర్, టీఎన్జీవో రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కె లక్ష్మణ్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పీఎఫ్ఆర్డీఏ చట్టాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటి వరకు జమ అయిన సొమ్మును రాష్ట్రాలకు ఇప్పించాలని కోరారు. పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని చెప్పారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఆదాయపు పన్ను పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలనీ, ఉద్యోగుల పెండింగ్ డిమాండ్లను పరిష్కరించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు రావాలని డిమాండ్ చేశారు. లేదంటే రాబోయే ఎన్నికల్లో ఉద్యోగుల ఆగ్రహానికి గురికావాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో టీఎన్జీవో అసోసియేట్ అధ్యక్షులు కస్తూరి వెంకటేశ్వర్లు, సత్యనారాయణ గౌడ్, కోశాధికారి ఆర్ శ్రీనివాసరావు, హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు ముజీబ్ హుస్సేనీ, నాయకులు వెంకట్‌రెడ్డి, సాయిలు, నరేందర్, ఆకుల రాజేందర్, సోమన్న, ఖాజా షరీఫ్, శ్రీనివాస్, కొండల్‌రెడ్డి, నరసింహ రెడ్డి, గోవర్ధన్ రెడ్డి, పర్వతాలు, చారి తదితరులు పాల్గొన్నారు.

యువజన సమస్యలపై సమరశీల పోరాటాలు

- డీవైఎఫ్ఐ ఆవిర్భావ దినోత్సవంలో నాయకులు

నవతెలంగాణ బ్యూరో – హైదరాబాద్



యువజన సమస్యలపై సమరశీల పోరాటాలను నిర్మిస్తామని భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య (డీవైఎఫ్ఐ) రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కోట రమేష్, ఆనగంటి వెంకటేశ్ అన్నారు. డీవైఎఫ్ఐ 43వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ సంఘం రాష్ట్ర కార్యాలయంలో కోట రమేష్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 1980, నవంబర్ ఒకటి, రెండు, మూడు తేదీల్లో డీవైఎఫ్ఐ ఆవిర్భవించిందని చెప్పారు. జాతీయోద్యమ స్ఫూర్తితో, సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా దేశభక్తి యుత ఆలోచనలతో ఏర్పడిందన్నారు. ఈ సంఘం యువజన సమస్యలపై దేశవ్యాప్తంగా అనేక సమరశీల పోరాటాలను నిర్వహించిందని అన్నారు. ఎంతో మంది యువజన ఉద్యమ నాయకులు వారి ప్రాణాలను ఫణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు. 'అందరికీ విద్య–అందరికీ ఉపాధి' అనే నినాదంతో గత 43 ఏండ్లుగా దేశంలో యువజనులు ఎదుర్కొంటున్న అనేక సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నదని చెప్పారు. దేశంలో నిరుద్యోగ సమస్యలపై ఉపాధి, నియామకాల కోసం నిరంతరం పోరాటాలను నిర్వహిస్తున్నదని అన్నారు. దేశంలో నిరుద్యోగ సమస్య పెరుగుతున్నదనీ, పాలకులు దాన్ని పెంచి పోషిస్తున్నారని విమర్శించారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలిస్తామంటూ యువతను మోసం చేసిందన్నారు. సమస్యలపై ప్రశ్నించకుండా పక్కదారి పట్టించే విధంగా కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని చెప్పారు. మతోన్మాదాన్ని పెంచి పోషిస్తున్నదని అన్నారు. మత రాజకీయాలు చేస్తూ రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా పాలన సాగిస్తున్నదని విమర్శించారు. వివిధ వర్గాల ప్రజలు, విద్యార్థులు, యువజనులు ఎదుర్కొంటున్న సమస్యలపై రానున్న కాలంలో మరిన్ని పోరాటాలను నిర్వహిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ఎండీ జావిద్, నాయకులు నరేష్, శ్రీమన్, బాలపీరు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

టెట్ మినహాయింపుతో పదోన్నతులివ్వండి

- ఎన్‌సీటీఈ చైర్‌పర్సన్‌కు టీఎస్‌యూటీఎఫ్ వినతి

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్

రాష్ట్రంలో 2010, ఆగస్టు 23 కంటే ముందే నియామకమైన ఉపాధ్యాయులకు 45 ఏండ్లు నిండినందున టెట్ మినహాయింపుతో పదోన్నతులివ్వాలని తెలంగాణ రాష్ట్ర ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (టీఎస్‌యూటీఎఫ్)కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు జాతీయ ఉపాధ్యాయ విద్యామండలి (ఎన్‌సీటీఈ) చైర్‌పర్సన్ ప్రొఫెసర్ యోగేష్ సింగ్, సభ్య కార్యదర్శి కెసాంగ్ యాంగ్‌జామ్ శెర్పా, సదరన్ రీజియన్ డైరెక్టర్ మదన్ సింగ్ యాదవ్‌ను శుక్రవారం న్యూఢిల్లీలో టీఎస్‌యూటీ ఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు కె జంగయ్య, ప్రధాన కార్యదర్శి చావ రవి నేతృత్వంలో కలిసి వినతిపత్రం సమర్పించారు. లేదంటే ఐదేండ్లలో టెట్ ఉత్తీర్ణత కావాలనే షరతుతో ఉపాధ్యాయులకు పదోన్నతులు కల్పించేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు. టెట్ ఉత్తీర్ణత పొందితేనే ఉపాధ్యాయులకు స్కూల్ అసిస్టెంట్‌గ పదోన్నతులుఇవ్వాలంటూ ఎన్‌సీటీఈ నిబంధనలు రూపొందించిన విషయం తెలిసిందే. అయితే హైకోర్టు సైతం ఎన్‌సీటీఈ నిబంధనలను పాటించాల్సిందేననీ, టెట్ ఉత్తీర్ణత అయితేనే పదోన్నతులు కల్పించాలంటూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో రాష్ట్రంలో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియ నిలిచిపోయింది. ప్రత్యేక అంశంగా పరిగణించి సానుకూల నిర్ణయం తీసుకోవాలని కోరారు.



చిన్న చూపు...

మధ్యప్రదేశ్ ఓటర్లు వచ్చే నెలలో 16వ శాసనసభకు ప్రతినిధులను ఎన్నుకోబోతున్నారు. ఆ రాష్ట్రంలో మిగిలిన విషయాలలో ఎన్ని మార్పులు వస్తున్నప్పటికీ ఒక్క అంశంలో మాత్రం ఎలాంటి మార్పు కన్పించడం లేదు. అదే శాసనసభలో ముస్లింల ప్రాతినిధ్యం. ముస్లింలను అభ్యర్థులుగా నిలిపే విషయంలో అన్ని పార్టీలూ ఒకే దారిలో నడుస్తున్నాయి. అవి ముస్లింలకు పార్టీ టిక్కెట్లు ఇచ్చేందుకు ఎంతమాత్రం సుముఖత చూపడం లేదు. ముస్లిం అభ్యర్థులే లేనప్పుడు ఇక వారు ఎమ్మెల్యేలుగా చట్టసభలో ఎలా ప్రవేశిస్తారు? 2011 జనాభా లెక్కల ప్రకారం రాష్ట్ర జనాభాలో ముస్లింల సంఖ్య 7%గా ఉన్నప్పటికీ ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ కేవలం ఇద్దరికే టిక్కెట్లు ఇచ్చింది. బీజేపీ నుండి ఒక్క ముస్లిం అభ్యర్థి కూడా పోటీలో లేరు. శాసనసభలో ముస్లింలకు తగిన ప్రాతినిధ్యం లభించకపోవడానికి కారణాలు తెలుసుకోవాలంటే మధ్యప్రదేశ్ రాజకీయాలను, జనసంఖ్యను అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది.

మధ్యప్రదేశ్‌లో ముస్లింలను పట్టించుకోని కాంగ్రెస్, బీజేపీ • కాంగ్రెస్ నుంచి ఇద్దరే పోటీ...బీజేపీ నుంచి ఒక్కరూ లేరు

ప్రధాన పార్టీల మధ్య నలిగిపోతున్న వైనం

భోపాల్ : రాష్ట్రంలో ఎప్పుడు ఎన్నికలు జరిగినప్పటికీ పోటీ ప్రధానంగా కాంగ్రెస్, బీజేపీ మధ్యనే నడుస్తోంది. ఆగస్టులో కాంగ్రెస్ నాయకుడు అజీజ్ ఖురేషీ ఓ వ్యాఖ్య చేశారు. మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ జయంతి సందర్భంగా విదిష జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ప్రసంగిస్తూ 'కాంగ్రెస్ సహా ప్రతి రాజకీయ పార్టీ ఓ విషయాన్ని గ్రహించాలి. ముస్లింలు బానిసలు కారు. పార్టీల ఆదేశాలను వారు పాటించాల్సిన అవసరం లేదు' అని ఆయన తెగేసి చెప్పారు. రాష్ట్రంలో ముస్లింల ప్రాతినిధ్యంపై ఆయన ఓ వార్తా సంస్థతో మాట్లాడుతూ 'మధ్యప్రదేశ్‌లోని ముస్లింలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. వారిని అవమానిస్తున్నారు. నిర్లక్ష్యం చేస్తున్నారు. దేశంలోనూ, జాతి నిర్మాణంలోనూ తమ పాత్రేమీ లేదని వారు అభిప్రాయపడుతున్నారు' అని అన్నారు. రాష్ట్రంలో బీజేపీ విజయాలు సాధిస్తుంటే అదే సమయంలో ఎన్నికల్లో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గిపోతోందని ఆయన అంగీకరించారు.

కారణాలు ఇవే

మధ్యప్రదేశ్‌లో 50 లక్షల మంది ముస్లింలు నివసిస్తున్నారు. 19 జిల్లాల్లో 10 లక్షలకు పైగా ముస్లిం జనాభా ఉంది. ముస్లింల ప్రాతినిధ్యం పడిపోవడానికి ప్రధానంగా రెండు కారణాలు కన్పిస్తున్నాయి. 1992లో బాబ్రీ మసీదు కూల్చివేత తర్వాత ఓ వర్గం ఓటర్లు సంఘటితమయ్యారు. 2002లో జరిగిన నియోజకవర్గాల పునర్విభజన కారణంగా ముస్లిం జనాభా చెల్లాచెదురైపోయింది. ఈ రెండు కారణాల వల్ల రాష్ట్రంలో ముస్లింల ప్రాతినిధ్యం తగ్గుతూ వస్తోందని రాజకీయ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

రెండు పార్టీలదీ అదే దారి

రాష్ట్రంలో 230 అసెంబ్లీ స్థానాలు ఉన్నాయి. కాంగ్రెస్ పార్టీ 62 మంది ఓబీసీలు, 80 మంది రాజపుత్రులు, బ్రాహ్మణులు, 48 మంది ఎస్టీలు, 34 మంది ఎస్సీలకు పార్టీ టిక్కెట్లు ఇచ్చింది. అయితే కేవలం ఇద్దరు ముస్లింలకు మాత్రమే...భోపాల్ నార్త్ నుండి అతీఫ్, భోపాల్ సెంట్రల్ నుండి ఆరిఫ్ మసూద్...టిక్కెట్లు కేటాయించి చేతులు దులుపుకుంది. భోపాల్ నార్త్ స్థానంపై 1998 నుండీ ఎమ్మెల్యే అతీఫ్ అఖీల్ పట్టు బిగించారు. అయితే అఖీల్ ఆరోగ్యం సరిగా లేకపోవడంతో ఇప్పుడు ఆయన కుమారుడు అతీఫ్ బరిలో నిలిచారు. 2013 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఐదుగురు ముస్లింలకు టిక్కెట్లు ఇచ్చింది. 2018లో ఆ సంఖ్య మూడుకు తగ్గింది. ఇప్పుడు మరింత తగ్గిపోయి రెండుకు చేరింది. బీజేపీ విషయానికి వస్తే 2013 ఎన్నికల్లో మాత్రం ఒకే ఒక ముస్లిం అభ్యర్థిని పోటీకి నిలిపింది. 1993, 2008, 2018లో జరిగిన ఎన్నికల్లోనూ, రేపు నవంబర్‌లో జరిగే ఎన్నికల్లోనూ ఒక్కరంటే ఒక్క ముస్లిం అభ్యర్థికి కూడా ఆ పార్టీ టిక్కెట్ ఇవ్వలేదు.

1962లో చిట్టచివరిసారిగా శాసనసభకు అత్యధికంగా ఏడుగురు ముస్లింలు (కాంగ్రెస్ నుండి ఆరుగురు, సీపీఐ నుండి ఒకరు) ఎన్నికయ్యారు. రాష్ట్రంలో ఓటర్లు మత ప్రాతిపదికనే ఓట్లు వేస్తారని సీనియర్ పాత్రికేయుడు షామ్స్ ఉర్ రెహ్మాన్ అలావీ చెప్పారు. ముస్లింలతో ఏ పార్టీ కానీ, ఏ

ఎవరికీ కాకుండా...

కులం కానీ చేతులు కలపకపోవడంతో వారి సంఖ్య నియోజకవర్గంలో 40శాతం ఉన్నప్పటికీ గెలిచే అవకాశాలు తక్కువేనని ఆయన తెలిపారు. రాజకీయాల్లో ముస్లిం కుటుంబాలు ఎక్కువగానే పాల్గొంటున్నప్పటికీ వారి పిల్లలు వేరే వృత్తులను ఎంచుకోవడంతో ప్రాతినిధ్యం తగ్గిపోతోందని వివరించారు.

మైనారిటీల్లో కలిపేసి...

తమ పార్టీ ముస్లింలను పట్టించుకోవడం లేదన్న ఆరోపణను కాంగ్రెస్ మీడియా విభాగం ఛైర్మన్ కేకే మిశ్రా తోసిపుచ్చారు. మైనారిటీల్లో ఒక్క ముస్లింల పైనే ఎందుకు దృష్టి సారిస్తారు? మైనారిటీల జనాభా ఎక్కువగా (60-70%) ఉన్న స్థానాల్లో మేము వారికే టిక్కెట్లు ఇస్తాం. వారే గెలుస్తారు. బీజేపీ ఒక్క ముస్లింకు కూడా టిక్కెట్ ఇవ్వలేదు. వారిని ఎందుకు ప్రశ్నించరు?' అని ఆయన అన్నారు. జైనులు, ముస్లింలు, ఇతర మతస్థులతో కలిపి మైనారిటీలకు 10-12 టిక్కెట్లు ఇచ్చామని ఆయన చెప్పుకొచ్చారు.

రెండు పార్టీల మధ్య నలిగి...

ఓ సంస్థ అధ్యయనం ప్రకారం మధ్యప్రదేశ్‌లో ముస్లింల జనాభా ఏ నాడూ 10% దాటలేదు. పైగా గత 15 సంవత్సరాల్లో అది తగ్గుతూ వస్తోంది. రాష్ట్రంలో బీజేపీ, కాంగ్రెస్ మినహా వేరే పార్టీలేవీ పెద్దగా ప్రభావం చూపేవి కాకపోవడంతో ముస్లింలు ఈ రెండింటి మధ్య నలిగిపోతున్నారని, అణచివేతకు గురవుతున్నారని బర్కతుల్లా యూత్ ఫోరం వ్యవస్థాపకుడు అనస్ అలీ వాపోయారు. ఉత్తరప్రదేశ్, బీహార్, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు ప్రభావం చూపుతున్నాయి. దీంతో ముస్లింలు కాంగ్రెస్‌కు ప్రత్యామ్నాయంగా వాటిని ఎంచుకుంటున్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ, కాంగ్రెస్ పార్టీలే ప్రధాన పోటీదారులుగా ఉన్నందున ముస్లిం ఓటరుకు ప్రాధాన్యత తగ్గిపోయిందని అలీ విశ్లేషించారు. రాజధాని భోపాల్‌లో 30% ముస్లింలు నివసిస్తున్నారని, నగరం నుండి ముగ్గురు ముస్లింలు ఎన్నికయ్యే అవకాశం ఉన్నదని, అయినప్పటికీ పార్టీలు వారికి మూడు టిక్కెట్లు ఇవ్వడం లేదని ఆయన చెప్పారు. ముస్లింల సంఖ్య గణనీయంగా ఉన్న ఖార్గాన్ నగరంలోని ముస్లింల నివాసాలను గత సంవత్సరం కూల్చివేసిన నేపథ్యంలో వారి మనసుల్లో ఆ ప్రభావం పడిందని అన్నారు. బీజేపీ విధానాలు ముస్లింలకు వ్యతిరేకమని, అందుకే వారు ప్రత్యామ్నాయం కోసం చూస్తున్నారని తెలిపారు. రాష్ట్రంలోని సుమారు 25 నియోజకవర్గాల్లో ముస్లింలు గెలుపోటములను ప్రభావితం చేయగలరని ఆయన చెప్పారు.

లచ్మన్‌గర్ నుంచి రాజస్థాన్ పీసీసీ చీఫ్ నామినేషన్



జైపూర్: రాజస్థాన్‌లో అసెంబ్లీ ఎన్నికల కోలాహలం మరింత ఊపందుకుంది. అక్టోబర్ 30న ఎన్నికల నోటిఫికేషన్ వెలువడగానే నామినేషన్‌ల పర్వం మొదలైంది. ఈ నెల 6వ తేదీ వరకు అభ్యర్థుల నుంచి నామినేషన్‌ల స్వీకరణ కొనసాగనుంది. శుక్రవారం ఉదయం రాజస్థాన్ పీసీసీ అధ్యక్షుడు గోవింద్ సింగ్ దోతసారా లచ్మన్‌గర్ అసెంబ్లీ నియోజకవర్గంలో నామినేషన్ దాఖలు చేశారు. తన అనుచరులతో కలిసి వెళ్లి రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు సమర్పించారు.

కాగా, నవంబర్ 6 వరకు నామినేషన్‌లను స్వీకరించి 7న స్క్రూటినీ నిర్వహించనున్నారు. నవంబర్ 9 వరకు నామినేషన్‌ల ఉపసంహరణకు గడువు విధించారు. రాజస్థాన్ రాష్ట్రమంతటా ఒకే విడతలో నవంబర్ 25న పోలింగ్ జరగనుంది. డిసెంబర్ 3న ఓట్లను లెక్కించి ఫలితాలను వెల్లడించనున్నారు. 200 అసెంబ్లీ స్థానాలున్న రాజస్థాన్‌లో గత ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలిచింది. అశోక్ గెహ్లాట్ నేతృత్వంలో ప్రభుత్వం ఏర్పాటైంది.



బీజేపీకి గట్టి ఎదురుదెబ్బ

మధ్యప్రదేశ్ సీఎం సన్నిహితుడి తనయుడు రాజీనామా

భోపాల్ : మధ్యప్రదేశ్ బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు, ఖాండ్వా ఎంపీ నంద్ కుమార్ సింగ్ చౌహాన్ కుమారుడు బీజేపీకి రాజీనామా చేశారు. ఎన్నికల్లో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేస్తానని కూడా ప్రకటించారు. సీఎం శివరాజ్ సింగ్ చౌహాన్‌తో నందు భయ్యాకు మంచి దోస్తీ.. ఎంపీ అసెంబ్లీ ఎన్నికల్లో నామినేషన్ల ఉపసంహరణ చివరి రోజున తీవ్ర ఉత్కంఠ నెలకొంది. పలువురు రెబల్స్ పేర్లను ఉపసంహరించుకుంటే..భారీ సంఖ్యలో రెబల్స్ బరిలోనే ఉండటంతో బీజేపీకి తలనొప్పిగా మారింది.మరోవైపు సీఎం శివరాజ్ సన్నిహితుడు , బీజేపీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు నంద్ కుమార్ సింగ్ చౌహాన్ కుమారుడు నంద్ కుమార్ సింగ్ చౌహాన్ దడ పుట్టిస్తున్నాడు. హర్షవర్ధన్ సింగ్ చౌహాన్ బీజేపీకి రాజీనామా చేసి, బుర్హాన్‌పూర్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీ చేయాలని కూడా నిర్ణయించుకున్నారు.దీంతో అతన్ని బుజ్జగించే ప్రయత్నాలు బెడిసికొట్టాయి.

మిజోరం ఓటర్ల ఆందోళన అదే...

నిరుద్యోగం, రోడ్లు, అభివద్ధి గురించే...



నవంబర్ 7న మిజోరాంలో ఎనిమిది లక్షల మంది ఓటర్లు రాజకీయ ఆటుపోట్లను నిర్ణయించనున్నారు. వీరిలో 50,000 మందికి పైగా తొలిసారిగా ఓటు వేయ నున్నారు. ఐజ్వాల్. మిజోరంలో పెద్దసంఖ్యలో యువ ఓటర్లు మొదటిసారిగా ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. విశ్వవిద్యాలయం , ప్రభుత్వ జాన్సన్ కళాశాలలో చదువుతున్న యువతను పలకరించగా.. తమ రాష్ట్రంలో నిరుద్యోగం, అవినీతి, అభివద్ధి మందగించడం వంటి అంశాలను కీలకంగా ప్రస్తావించారు. రోడ్ల దుస్థితి గురించిపై కూడా వారిలో ఆగ్రహం వ్యక్తమవుతోంది.

"మేం చాలా నెమ్మదిగా అభివద్ధి చెందుతున్నాం. మా రోడ్లు దెబ్బతిన్నాయి. అనేక అభివృద్ధి సమస్యలు ఉన్నాయి. స్పీడ్‌గా అభివద్ధి చెందడానికి సహాయపడే పార్టీకి ఈ సారి ఓటు వేద్దాం' అని అనుకుంటున్న ఓ విద్యార్థి అన్నారు. మరొకరు ఇలా .. "ముఖ్యంగా విద్యార్థుల అవసరాలు, రవాణా వ్యవస్థను మెరుగుపరచాలి." అని చెప్పారు.

మిజోరాం జాతిని రక్షించాల్సిన అవసరాన్ని కూడా ఒక విద్యార్థి ఎత్తి చూపారు. "మేం మిజోలు మన భాషను రక్షించుకోవాలి, మన మతాన్ని రక్షించుకోవాలి. మన తెగను రక్షించుకోవాలి. మా జాతిని రక్షించడంలో మాకు సహాయపడే రాజకీయ పార్టీ అవసరం. అని నొక్కి చెప్పారు.

దంతేవాడ ఎవరికి దక్కేన్..!

కాంగ్రెస్, బీజేపీ మధ్య ఫైట్

ఛత్తీస్‌గఢ్‌లోని దంతేవాడను దక్కించు కోవటానికి బీజేపీ,కాంగ్రెస్ పోటీ పడుతు న్నాయి. ఇక్కడ కాంగ్రెస్ టిక్కెట్‌పై ఛవీంద్ర కర్మ, బీజేపీకి చెందిన చేత్రమ్ అరామికి వ్యతిరేకంగా ఎన్నికల బరిలోకి దిగారు. 2013లో మావోయిస్టుల చేతిలో హత్యకు గురైన పలువురు కాంగ్రెస్ నేతలలో ఆయన తండ్రి మహేంద్ర కర్మ కూడా ఉన్నారు. ఎస్టీ నియోజకవర్గమైన దంతెవాడలో నవంబర్ 7న తొలి విడతలో పోలింగ్ జరగనుంది. ఈ ప్రాంతంలోని నిరుద్యోగం గురించి, తన తల్లి దేవ్తి కర్మ 2018 ఎన్నికలలో ఓటమి గురించి కర్మ వివరించారు. ఇపుడు దంతెవాడ తమ కుటుంబానికి బలమైన కోటగా ఉందని భావిస్తున్నారు.

"నా పోరాటం బీజేపీ గుర్తుపై కాదు, ఏ అభ్యర్థికీ వ్యతిరేకం కాదు.. ప్రస్తుతం ఉన్న 72 స్థానాలను నిలబెట్టుకోవడంపై మాకు నమ్మకం ఉంది... కాంగ్రెస్ చేసిన పని గురించి ప్రజలకు ఇప్పటికే తెలుసు" అని చవీంద్ర అన్నారు, రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దష్టి సారిస్తోందని అన్నారు. ఉపాధి కల్పించడం , ఈ ప్రాంతంలోని గ్రామాలను అనుసంధానం చేయడంపై.ప్రత్యేక శ్రద్ధ చూపుతానని అంటున్నారు.



బీజేపీని వెంటాడుతున్న నర్మద వరద

మోడీ జన్మదినానికి ముందు గ్రామాలను ముంచెత్తిన నీటి ప్రవాహం బీజేపీపై మధ్యప్రదేశ్ ఓటర్ల ఆగ్రహం



భోపాల్ : అది మధ్యప్రదేశ్‌లోని పశ్చిమ ప్రాంతం. నర్మద నదికి సమీపంలో ఉంది. నాలుగు జిల్లాల్లో వ్యాపించిన కొంత భూభాగం గత నెల రోజులుగా వరద నీటిలోనే నానుతోంది. పంట పొలాలు, ఇళ్లు నీట మునిగాయి. రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. దీనికి కారణం ప్రధాని నరేంద్ర మోడీ జన్మదినం. అదేమిటి ? ఆయన పుట్టిన రోజుకు, వరదలు రావడానికి సంబంధమేమిటని అంటారా... జన్మదినం రోజు మోడీ కళ్లలో ఆనందం చూడాలనే ఉద్దేశంతో అధికారులు సర్దార్ సరోవర్ డ్యాంలో సామర్థ్యానికి మించి నీటిని నిల్వ చేశారు. అందుకోసం నీటి విడుదలను కొన్ని రోజులు ఆపేశారు. ఆయన పుట్టిన రోజైన సెప్టెంబర్ 17న ఒక్కసారిగా నీటిని దిగువకు విడుదల చేయడంతో వరద ప్రవాహం పెరిగి పొలాలు, ఇళ్లు నీట మునిగాయి. నీటిలో నానుతున్నప్పటికీ గత నెల రోజులుగా ప్రజలను పట్టించుకున్న దిక్కే లేదు.

బర్వానీ జిల్లాలోని అవాల్డా గ్రామ సర్పంచ్ ధర్మేంద్ర మండ్లాయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన తాత్కాలిక శిబిరంలో తలదాచుకుంటున్నారు. సెప్టెంబర్ 15వ తేదీ రాత్రి నర్మద నది ప్రవాహంలో ఆయన ఇల్లు, పశువుల కొట్టం, మరికొన్ని నిర్మాణాలు మునిగిపోయాయి. ప్రతి సంవత్సరం ఇలాగే జరుగుతుందని, అయితే ఈ ఏడాది అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరిగిందని ఆయన చెప్పారు. ముందస్తు హెచ్చరికలేవీ చేయలేదని, దీంతో కట్టుబట్టలతో మిగిలామని ఆయన వాపోయారు. ఇప్పటి వరకూ ఒక్కరికి కూడా నష్టపరిహారం అందలేదని తెలిపారు. తమకు వాటిల్లిన నష్టానికి బీజేపీ ప్రభుత్వమే కారణమని బర్వానీ, అలీరాజ్‌పూర్, ధార్, ఖర్గాన్ జిల్లాల ప్రజలు అంటున్నారు. బీజేపీపై ఆగ్రహాన్ని వారు ఎంతమాత్రం దాచుకోవడం లేదు. బీజేపీ నేతలెవ్వరూ తమ గ్రామంలో పర్యటించలేదని ధర్మేంద్ర చెప్పారు. ఈ ప్రభుత్వంతో ప్రజలు విసిగిపోయారని ఆయన అన్నారు. ఎనిమిది శాసనసభ నియోజకవర్గాలకు చెందిన 170 గ్రామాల ప్రజలది ఇదే మాట. అలీరాజ్‌పూర్, కుక్షీ మనావర్, ధరంపురి, బర్వానీ, రాజ్‌పూర్ నియోజకవర్గాల ప్రజల్లో బీజేపీపై ఆగ్రహం కట్టలు తెంచుకుంటోంది. నీటి ప్రవాహం ఒక్కసారిగా పెరగడంతో పశువులు కొట్టుకుపోయాయి. పంటలు ధ్వంసమయ్యాయి. నిల్వ చేసుకున్న ఆహార ధాన్యాలు కూడా నీట మునిగాయి. నర్మద నదికి సమీపంలో ఉన్న గ్రామాల్లో ఇప్పటికీ వరద నీరు తగ్గలేదు. సహాయ శిబిరాల్లో తలదాచుకుంటున్న వారు ఇంకా ఇళ్లకు చేరుకోవడం లేదు.

అవాల్డా గ్రామం నర్మద నది ఒడ్డునే ఉంటుంది. ఈ గ్రామంలోని కొంత భాగం ఇప్పటికే సర్దార్ సరోవర్ డ్యాం నిర్మాణం కారణంగా నీట మునిగింది. సెప్టెంబర్ 15న భారీ వర్షాలు కురిశాంయి. నర్మద నదికి ఎగువన ఉన్న నాలుగు డ్యాంల గేట్లు ఎత్తి రిజర్వాయర్లలో అధికంగా ఉన్న నీటిని వదిలారు. నీరు దిగువకు ప్రవహిస్తుంటే నదిలో నీటి నిల్వ పెరుగుతోంది. అయినప్పటికీ సర్దార్ సరోవర్ డ్యాం గేట్లను మాత్రం మూసే ఉంచారు. గేట్లను తెరవడంలో ఎనిమిది గంటలు ఆలస్యం చేశారని స్థానికులు ఆరోపించారు. చివరికి గేట్లు తెరవగానే నీరు ఒక్క ఉదుటన కిందికి ప్రవహించి, పలు గ్రామాలను ముంచెత్తింది. అయినా బీజేపీ నుండి స్పందన లేకపోవడం ప్రజలకు ఆగ్రహం కలిగించింది. వారంతా ఇప్పుడు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారు. బాధితులను అన్ని విధాలా ఆదుకుంటామని కాంగ్రెస్ నేతలు హామీ ఇస్తున్నారు. పుట్టిన రోజు సందర్భంగా మోడీని సంతృప్తి పరచేందుకు కొందరు బీజేపీ నాయకులు మూర్ఖంగా ప్రవర్తించారని ప్రజలు మండిపడుతున్నారు.



పెరుగుతున్న ధరలను అదుపు చేయడానికి బీజేపీ ప్రభుత్వం చేసిందేమీ లేదని, కనీసం తమను కష్టకాలంలో ఆదుకునేందుకు నష్టపరిహారం కూడా ఇవ్వలేదని ప్రజలు ఆరోపించారు. నష్టపరిహారం ఇవ్వాలని బీజేపీ ఎంపీ గజేంద్ర సింగ్ పటేల్‌ను కోరినా ఆయన పట్టించుకోలేదని జంఘర్వా గ్రామానికి చెందిన ప్రజలు వాపోయారు. కొందరికి పరిహారం అందినా అది ఏ మూలకు చాలదని చెప్పారు. అయితే ఎన్నికల కోడ్ అమలులో ఉన్న కారణంగా వెంటనే నష్టపరిహారం ఇవ్వలేకపోతున్నామని బీజేపీ నేతలు కుంటిసాకులు చెబుతున్నారు. ప్రజల ఆగ్రహాన్ని బీజేపీ నాయకులు కూడా అంగీకరిస్తున్నారు.

సంపాదకీయం

బాండ్ల వెనుక బంధం!

ప్రజాస్వామ్యం, పౌరహక్కుల గురించి మనమేదో ముచ్చట పడుతుంటాంగాని అలాంటివేవీ అమలులో లేక పోవడం ఓ చేదునిజం. ఎన్నికల నిర్వాహణ కోసం రాజకీయ పార్టీలకు డబ్బు ఎక్కడ్నుంచొస్తుందో, ఎలా పంచబడుతుందో తెలుసుకునే హక్కు దేశపౌరులకు లేదుగాక లేదు పొమ్మంటోంది మోడీ సర్కారు. ఈ ముక్క అక్కడా ఇక్కడా కాదు ఏకంగా సుప్రీంకోర్టు ముఖం మీదనే చెప్పేసింది. ఎన్నికల బాండ్లను సవాలు చేస్తూ దాఖలైన పిటీషన్లను సుప్రీంకోర్టు విచారిస్తున్న సంగతి తెలిసిందే. ఈ విచారణలో భాగంగా న్యాయస్థానం ముందు కేంద్రం తరఫున అటార్నీ జనరల్ వినిపించిన వాదన చూశాక..

> **సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం కూడా ఈ ఎలక్టోరల్‌బాండ్ల విశ్వసనీయతను ప్రశ్నించడం తాజా పరిణామం. ఈ పథకంలో అధికారపార్టీకే అధిక విరాళాలెందు కొస్తున్నాయి? ముడుపులను చట్టబద్ధం చేయదలిచారా? అని నిలదీసింది. అధికారంలో ఉన్నవారితో రహస్య వ్యాపారాలు చేసేందుకు, పాలకపార్టీలకు అనుకూలంగా "క్విడ్ ప్రో కో"లోకి ప్రవేశించేందుకు సంపన్నులు ఈ ఎలక్టోరల్ బాండ్స్‌ను ఉపయోగించుకునే అవకాశముందని వ్యాఖ్యానించింది.**

ఎన్నికల్లో ప్రజల ఆకాంక్షలకు, చైతన్యానికి చోటు లేకుండా పోయిందనిపిస్తోంది. ఎన్నికల బాండ్ల సమాచారం పబ్లిక్ డొమైన్లో ఉండదట. ఆర్టీఐ చట్టం ద్వారా తెలుసుకునే హక్కు కూడా ప్రజలకు లేదట. రాజ్యాంగం ప్రకారం... తాము ఓటు వేసే అభ్యర్థుల విద్యార్హతలు, గుణగణాలు, అప్పులు, ఆస్తులు, నేర చరిత్ర తదితర పూర్వాపరాలను తెలుసుకునే హక్కు పౌరులకుంటుంది. అలాంటప్పుడు అభ్యర్థులకు నిధులెలా సమకూరుతున్నాయో తెలుసుకునే హక్కు మాత్రం లేదనడంలోని మతలబేమిటి?

రాజకీయపార్టీలకు నల్లధనం చేరకుండా అడ్డుకునే పేరుతో, పార్టీల ఆదాయ మార్గాల్లో పారదర్శకత కోసమంటూ మోడీ ప్రభుత్వం ఈ ఎలక్టోరల్ బాండ్స్ పథకాన్ని తీసుకొచ్చింది. నిజంగా ప్రభుత్వ ఉద్దేశం అదే అయితే విభేదించాల్సిందేమీ లేదుగానీ, ఆచరణలో జరుగుతున్నదేమిటి? పారదర్శకత అంటే ప్రతిదీ ప్రజల ముందుంచడమే కదా. కానీ ఈ బాండ్ల చుట్టూ గోప్యత అనే సంకెళ్లు విధించిందీ ప్రభుత్వం. ఈ బాండ్లు ఎవరు కొంటున్నారు? ఎవరికిస్తున్నారు? అనే వివరాలను ప్రజల ముందుంచడం మహా అపరాధమట! ఎందుకంటే ఈ వివరాలు తెలిస్తే రాజకీయపార్టీల నుండి దాతలకు ఇబ్బందులెదురవుతాయట! అలాగని ఇక్కడ పూర్తిగా గోప్యతే ఉందనుకుంటే పొరపాటే. ఏలినవారికి మాత్రం మినహాయింపు! ఎలాగంటే.. ప్రభుత్వ బ్యాంకుల దగ్గర బాండ్లు కొంటున్నవారు, తీసుకుంటున్న వారు.. ఇద్దరి వివరాలూ ఉంటాయి. అంటే ప్రభుత్వం... ఇంకా స్పష్టంగా చెప్పాలంటే అధికారపక్షం ఏదో ఒక మార్గంలో ఈ వివరాలను తెలుసుకోవచ్చు,



విరాళాలు ఇచ్చే వారిని ప్రభావితం కూడా చేయొచ్చు. ఆ ప్రభావం మోతాదు ఎంతంటే, ఈ మొత్తం స్కీంలో నాలుగింట మూడొంతులు, అంటే దాదాపు 75 శాతం నిధులు అధికారపక్షమైన బీజేపీకి మాత్రమే అందేంత! కాంగ్రెస్ లాంటి ప్రధాన ప్రతిపక్షానికి కేవలం 9 శాతమే దక్కేంత!! ప్రాంతీయ పార్టీల్లో కూడా అధికారంలో ఉన్న వారికే అత్యధిక నిధులు అందుతున్న వైనాన్ని పలు నివేదికలు ధృవీకరిస్తున్నాయి. అందుకే వీటిని రాజ్యాంగ విరుద్ధమైనవిగా పేర్కొంటూ, వీటి చెల్లుబాటును సవాలు చేస్తూ పిటీషన్‌లు దాఖలయ్యాయి.

ఈ పిటిషన్ దాఖలు చేసిన వారిలో సీపీఐ(ఎం)తో పాటు "ఏడీఆర్(అసోసియేషన్ ఫర్ డెమొక్రటిక్ రిఫామ్స్)" లాంటి సంస్థలు కూడా ఉండటం గమనార్హం. భారత దేశంలో ప్రజాస్వామ్య సంస్కరణలు స్థిరపడి నిలదొక్కుకోవాలనే లక్ష్యంతో ఏర్పడిన సంస్థ ఇది. గత కొంతకాలంగా మన శాసనవ్యవస్థలో పేరుకుపోతున్న అంతులేని అవినీతిని, నేరప్రవృత్తిని బట్టబయలు చేస్తూ దేశ ప్రజలను అప్రమత్తం చేస్తోంది. ఈ ఎన్నికల బాండ్ల విషయంలోనూ పలు ఆధారాలు, విశ్లేషణలతో కూడిన ఏడీఆర్ నివేదికలు ఏలిన వారి కుట్రపూరితమైన ఎత్తుగడల్ని పట్టిచూపుతున్నాయి. అంతెందుకు, 2017లో ఈ బాండ్లను మొదట ప్రవేశపెట్టినప్పుడు, వీటి వల్ల ఎన్నికల్లో పారదర్శకత ఏర్పడటం కాదుకదా, కొరవడుతుందని ఎన్నికల సంఘం సైతం చెప్పింది. అయితే, ఏం జరిగిందో తెలియదు గానీ ఏడాది తర్వాత ఎన్నికల సంఘం తన అభిప్రాయాన్ని వెనక్కి తీసుకుంది.

ఇక విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ప్రత్యేక ధర్మాసనం కూడా ఈ ఎలక్టోరల్ బాండ్ల విశ్వసనీయతను ప్రశ్నించడం తాజా పరిణామం. ఈ పథకంలో అధికార పార్టీకే అధిక విరాళాలెందుకొస్తున్నాయి? ముడుపులను చట్టబద్ధం చేయదలిచారా? అని నిలదీసింది. అధికారంలో ఉన్న వారితో రహస్య వ్యాపారాలు చేసేందుకు, పాలకపార్టీలకు అనుకూలంగా "క్విడ్ ప్రోకో"లోకి ప్రవేశించేందుకు సంపన్నులు ఈ ఎలక్టోరల్ బాండ్స్‌ను ఉపయోగించుకునే అవకాశముందని వ్యాఖ్యానించింది. ఇప్పటి వరకూ వివిధ పార్టీలు పొందిన విరాళాల వివరాలను రెండువారాల్లో అందజేయాలని ఆదేశించింది. అంతిమంగా విచారణ ముగించి రిజర్వులో ఉంచిన ధర్మాసనం తీర్పు ఎలా ఉండబోతుందో వేచి చూడాల్సిందే గానీ... ప్రభుత్వం చెబుతున్నట్టు ఈ పథకంలో పారదర్శకత, ప్రజాస్వామ్య ప్రక్రియలంటూ ఏమీలేవని తేలిపోయింది. దేశంలో ప్రజలకు సార్వత్రిక ఓటు హక్కయితే ఇచ్చారు గాని ఎన్నికలకూ వారికీ సంబంధమే లేకుండా పోవడం విచారకరం. ఎన్నికలను కేవలం ఓ తంతుగా మార్చి.. ఏ పార్టీ అధికారంలోకి రావాలో, వచ్చినవారు ఎలాంటి విధానాలను అవలంబించాలో కార్పొరేట్లు ముందే నిర్ణయిస్తున్నారనడానికి ఈ ఎలక్టోరల్ బాండ్స్ ఓ ఉదాహరణ.

మెయిల్ @ నవతెంగాణ

అతిథి అధ్యాపకులకు జీతాలేవి?

రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్, కళాశాలల్లోని అతిథి అధ్యాపకులు సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 405 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో 1654 మంది అతిథి అధ్యాపకులు పనిచేస్తున్నారు. ఈ 2023 - 2024 విద్యా సంవత్సరంలో గత ఆరు నెలలుగా వీరికి నయా పైసా కూడా అందలేదు. గత అసెంబ్లీలో సాక్ష్యాత్తు తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర రావు మాట్లాడుతూ 'అతిథి అధ్యాపకుల పొట్ట కొట్టకూడదు. వారికి ప్రతి నెల క్రమం తప్పకుండా జీతాలు చెల్లించాలి' అని ఆదేశించినా ఇప్పటి వరకు ఏ విధమైన పురోగతి కనిపించక పోవడం విచారకరం. ఫలితంగా అతిథి అధ్యాపకులు జీతాలు పొందలేక బతుకులు భారమై పండుగ రోజులలో కూడా అప్పులు తెచ్చుకుని కుటుంబాల్ని పోషించుకునే పరిస్థితులు నెలకొన్నాయి. వీరికి సంవత్సరంలో విద్యాబోధన ఉండేది ఏడు నెలలు మాత్రమే. ఈ ఏడు నెలల్లో ఆరు నెలల జీతాలను అధికారులు పెండింగ్‌లో ఉంచడం ఏమాత్రం సమంజసం కాదు. ఇటు ఉద్యోగ భద్రత లేకపోగా నెలవారిగా కూడా వేతనాలు పొందలేని స్థితిలో అధ్యాపకులు ఉండటం బాధాకరం. ఇలాంటి పరిస్థితుల్లో ఆర్థిక భారాలతో మానసిక కుంగుబాటుకు గురై కొంతమంది ఆత్మహత్యలు కూడా చేసుకున్న ఉదంతాలు అనేకం. కరోనా సమయంలో విద్యార్థులకు సమర్థవంతంగా ఆన్‌లైన్ క్లాసులు నిర్వహించి వారి శక్తికి మించి విద్యాబోధన చేసిన అధ్యాపకులను ప్రభుత్వం పట్టించుకోకపోవడం సరికాదు. విద్యాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న అతిథి అధ్యాపకులకు చెల్లించాల్సిన జీతాల పట్ల ప్రభుత్వం ఇకనైనా నిర్లక్ష్యాన్ని విడనాడి జీతాల చెల్లింపు దిశగా చొరవ చూపాలి.

- జె.జె.సి.పి. బాబూరావు, 94933 19690

కొలనూరును మండల కేంద్రం చేయాలి

పెద్దపల్లి జిల్లా ఓదెల మండలంలోని కొలనూరును గ్రామాన్ని మండల కేంద్రంగా ఏర్పాటు చేయకపోవడం పట్ల ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే ఇక్కడ 1927లోనే రైల్వేస్టేషన్‌ను ఏర్పాటు చేశారు. 1960 దశకంలోనే సబ్‌పోస్టాఫీస్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం నిర్మించారు. చుట్టూ పది గ్రామాలకు కనీస వైద్య సౌకర్యం లేని రోజుల్లో ఇక్కడి వైద్యశాలే ప్రజలకు దిక్కు. ఇక్కడి ప్రజలు రవాణా సాగించాలన్నా, బస్సు లేదా రైలు కోసం కొలనూరుకే రావాలి. ఇంతటి ప్రాధాన్యత కలిగిన గ్రామాన్ని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనే మండలం చేయాలనే డిమాండ్ ముందుకొచ్చింది.కానీ అది నెరవేరలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం వచ్చిన తర్వాతనైనా ప్రజలకు నిరాశే ఎదురవుతున్నది. ప్రస్తుతం పెద్దపెల్లి జిల్లాలో పద్నాలుగు మండల కేంద్రాలున్నవి. ఇక్కడి గ్రామస్తులు ప్రస్తుతం ఉన్న ఓదెల మండలానికి పోవాలంటే సరైన రవాణా సౌకర్యాలు లేవు. ఏ పని కోసం బయలుదేరినా వ్యయ ప్రయాసలకు గురి కావల్సి వస్తున్నది. ఓదెల మండల గ్రామాలైన హరిపురం, గోపరిపల్లె, ఉప్పరపల్లె, కనగర్తి, గుండ్లపల్లి, లంబాడి తండా అతి సమీపంలో ఉన్న ఇతర మండలాల గ్రామాలైన కొత్తపల్లి, మూలసాల (పెద్దపల్లి మండలం) అంకంపల్లి, మడిపల్లి, న్యూ మడిపల్లి, (కాల్వ శ్రీరాంపూర్ మండలం), రేగడి మద్దికుంట (సుల్తానాబాద్ మండలం) కలిపి కొలనూరును 15వ మండలంగా చేయాలని ఈ గ్రామాల ప్రజలు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

- దండంరాజు రాంచందర్ రావు, 9849592958

సామాజిక న్యాయానికి కులగణన మరో మెట్టు



రామ్ పునియానీ

హిందూ రాజ్యస్థాపన కోసం అనేక విద్యా, రాజకీయ, సామాజిక వేదికల ద్వారా రాజకీయ నిర్వహణతో పాటు అనేక ఇతర సంస్థలు చేస్తున్న కృషి వెనుక ఉన్న రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్)కు మోహన్ భగవత్ మూలపురుషుడు. సంఘ్, విజయదశమిగా గుర్తించే దసరా రోజు, ఆయన తన అనుచరులకు భవిష్యత్తు పట్ల దిశా నిర్దేశం చేస్తాడు. దసరా రోజు ఆయన చేసే ప్రసంగం, హిందూ జాతీయవాద అధికసంఖ్యాక (మెజారిటేరియన్) రాజకీయాలను, భావజాలాన్ని ప్రతిబింబిస్తుంది.

దానికనుగుణంగానే, అక్టోబర్ 24న చేసిన తన సాంప్రదాయ ప్రసంగంలో, ఆరెస్సెస్ రెండో సర్సంగ్ చాలక్, ఎం.ఎస్. గోల్వాల్కర్ ఆలోచనలను, సూత్రీకరణలను మరింత స్పష్టంగా పునరావృతం చేస్తూ, భగవత్ వివిధ అంశాలను లేవనెత్తాడు. "ముస్లింలు, క్రైస్తవులు, కమ్యూనిస్టుల" నుండి హిందూజాతికి అంతర్గతంగా ముప్పు పొంచి వుందని, గోల్వాల్కర్ "బంచ్ ఆఫ్ థాట్స్" అనే తన రచనలో పేర్కొన్నాడు. ఆకట్టుకునే మాటలను ఉపయోగిస్తూ, "సాంస్కృతిక మార్క్సిజం",

> **వాస్తవానికి, మార్క్సిజంచే ప్రభావితులైనవారు సమానత్వం దిశగా సామాజిక మార్పు కోసం పిలుపునిస్తున్నారు. ఇది, భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో జరిగింది. మార్క్సిస్ట్ అయిన భగత్ సింగ్, అతని సహ చరులు, సమానత్వం విలువల్ని ముందుకు తెచ్చారు. పారిశ్రామికీకరణ, ఆధునిక విద్య నెమ్మదిగా భారతదేశంలోకి ప్రవేశించినప్పుడే, అది దేశంలో ప్రగతిశీల శక్తులను విస్తరించింది. వర్గం, కులం, లింగ సాంప్రదాయ భావనలు మార్గనిర్దేశం చేసిన భూస్వామ్య సమాజానికి తోడుగా ఉన్న ఎలాంటి భావజాల ధోరణులైనా పడగొట్టడం కోసం ఇది నిలబడింది.**

స్వార్థపూరితం, మోసపూరితమైనదనీ, "మీడియాను, విద్యా సంస్థలను అదుపుచేయడం" ద్వారా అది దేశాన్ని విభజించడానికి ప్రయత్నిస్తుందని, భగవత్ తన ప్రసంగంలో పేర్కొన్నాడు.

అలాంటి శక్తులు "ఉన్నతమైన లక్ష్యాల" కోసం కృషి చేస్తున్నట్టు చెప్పుకుంటాయనీ, కానీ "క్రమబద్ధత, నైతికత, ఉపకారం, సంస్కృతి, సంయమనం, గౌరవాలకు" విఘాతం కలిగించడమే వాటి ప్రాథమిక లక్ష్యమని ఆయన అన్నాడు. ఈ "వినాశనకర, అందర్నీ మింగేసే శక్తులు తమను తాము "సాంస్కృతిక మార్క్సిస్టులు"గా లేదా "మేల్కొన్నవారు" గా పిలుచుకుంటారని ఆయన అన్నాడు. భగవత్ చెప్పేదాని ప్రకారం మీడియా, విద్యా సంస్థలపై అదుపు సాధించి, విద్య, సంస్కృతి, సామాజిక వాతావరణం, రాజకీయాలను "గందరగోళం, కల్లోలం, అవినీతి" లోకి నెట్టివేయడమే వారి పనివిధానం.

'మేల్కొలుపు' అనే పదం ఆలస్యంగా అనేక చర్చల్లో ఒక కేంద్రంగా మారింది. అమెరికా, పాశ్చాత్య దేశాల్లో తమను తాము జాతి అహంకార బంధనాల నుండి విముక్తి చేసుకోడానికి, సమానత్వం కోసం జరిగే వారి అన్వేషణ ముందుకు పోవాలనే ఆఫ్రికన్ అమెరికన్ల కోరిక నుండే ఈ పదం పుట్టింది. పితృస్వామిక, జాతి, వర్గశ్రేణీ గత వ్యవస్థలు విధించిన నిరంకుశ లేదా పూర్వ ప్రజాస్వామిక నిబంధనల సంకెళ్ళను అధిగమించాలనుకునే వారికి ఈ పదం ప్రతీకగా కూడా వచ్చింది. కానీ, 'మేల్కొన్నాం', 'మేల్కొన్న సంస్కృతి' అనే పదాలు ప్రపంచవ్యాప్తమయ్యాయి. కలుపుకోవడం (ఇంక్లూజివిటీ), అనే డిమాండ్‌ను యూరోప్, ఆస్ట్రేలియా, ఇతర దేశాల్లోని సాంప్రదాయ రాజకీయ నాయకులు "మేల్కొలుపు" అని ఎగతాళి చేశారు. పర్యావరణ పరిరక్షణ, లింగ సమానత్వం కోసం తమ సమాజాలు ప్రయత్నం చేయాలని కోరుకునే వారికి వ్యతిరేకంగా వారు ఈ పదాన్ని ఉపయోగించారు.

బ్రిటీష్ ఉన్నత వర్గాల్లో "మేల్కొన్న సంస్కృతి" పెరిగిన కారణంగా బీబీసీ "విశ్వసనీయత సంక్షోభం"లో పడిపోయిందని ఆరెస్సెస్ నాయకుడు రామ్ మాధవ్ ద ఇండియన్ ఎక్స్‌ప్రెస్ దిన పత్రికలో "ఇండియా : ద మోడీ క్వశ్చన్" పై (నరేంద్ర మోడీ గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో 2002 లో గుజరాత్ సామూహిక హత్యాకాండపై బీబీసీ డాక్యుమెంటరీ తీసింది, తర్వాత భారతదేశంలో దానిని నిషేధించారు) రాసాడు. కానీ, 'ద మోడీ క్వశ్చన్' లాంటి డాక్యుమెంటరీని ప్రదర్శించడం వల్లే "బీబీసీ క్షీణత" అని కూడా మాధవ్ భావించాడు. మనుస్మృతిలో పొందు పరిచిన విలువలకు, మూలాలకు తిరిగి రావాలని సర్సంగ్ చాలక్ పిలుపు ఇచ్చినప్పుడు, అతడు సర్సంగ్ చాలక్‌ను కూడా సమర్థిస్తూ, విద్యా సంస్థల్ని, మీడియాను స్వాధీనం చేసుకున్నందుకు "సాంస్కృతిక మార్క్సిస్టులు" గా పిలువబడే వారిని నిందిస్తాడు. మాధవ్ చెప్పే దాని ప్రకారం, హిందూ మతాన్ని ఉన్నత వర్గాల కులాధిపత్యంతో సమానంగా పరిగణించడం ద్వారా హిందూ మతం, కులం, అణిచివేతకు, దోపిడీకి గురిచేసే కథనాన్ని సాంస్కృతిక మార్క్సిస్టులు అభివృద్ధి పరిచారు. కాబట్టి, మాధవ్ ప్రాపంచిక దృష్టికోణంలో కులగణన పిలుపు, విభజన కోసం ఇచ్చే పిలుపే.


వాస్తవానికి, మార్క్సిజంచే ప్రభావితులైనవారు సమానత్వం దిశగా సామాజిక మార్పు కోసం పిలుపునిస్తున్నారు. ఇది, భారత స్వాతంత్ర్యోద్యమ పోరాటంలో జరిగింది. మార్క్సిస్ట్ అయిన భగత్‌సింగ్, అతని సహచరులు, సమానత్వం విలువల్ని ముందుకు తెచ్చారు. పారిశ్రామికీకరణ, ఆధునిక విద్య నెమ్మదిగా భారతదేశంలోకి ప్రవేశించినప్పుడే, అది దేశంలో ప్రగతిశీల శక్తులను విస్తరించింది. వర్గం, కులం, లింగ సాంప్రదాయ భావనలు మార్గనిర్దేశం చేసిన భూస్వామ్య సమాజానికి తోడుగా ఉన్న ఎలాంటి భావజాల ధోరణులైనా పడగొట్టడం కోసం ఇది నిలబడింది.

అయితే సమానత్వంతో కూడిన సామాజిక మార్పుకై నూతన దేశవ్యాప్త ఉద్యమాల కోసం కమ్యూనిస్టులు మాత్రమే నిలబడలేదు. దళితులు, మహిళలపై ఉన్నత వర్గాల కుల ఆధిపత్యాన్ని చెలాయించిన పితృస్వామ్యంతో సహా అన్ని అణచివేత పద్ధతులను సవాల్ చేస్తూ, జ్యోతిరావు పూలే, బి.ఆర్ అంబేద్కర్ నాయకత్వంలోని సామాజిక ఉద్యమాలు కూడా ముందు పీఠిన నిలిచాయి. మహాత్మాగాంధీ నాయకత్వంలో జరిగిన స్వాతంత్ర్యోద్యమం కూడా అణచివేత సామాజిక ఆచారాలకు వ్యతిరేకంగా తిరుగుబాటును విస్తృతపరచడానికి నిరంతరం ప్రయత్నించింది. ఈ పోరాటాలు, బ్రిటీష్ సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా జరిగిన పోరాటాలను పరిపూర్ణం చేశాయి.

భావవ్యక్తీకరణ స్వేచ్ఛ కూడా స్వాతంత్ర్యోద్యమంలో ఒక ముఖ్యమైన భాగంగా ఉంది, స్వాతంత్ర్యం కోసం జరిగిన మహత్తర పోరాటంలో ఇదొక ప్రత్యేక లక్షణం. లోకమాన్య తిలక్ నుంచి గాంధీ, జవహర్ లాల్ నెహ్రూ వరకు, పూర్వ స్వాతంత్ర్య యుగానికి ముందున్న ప్రముఖులంతా దానిని పాటించి, సమర్థించారు. భారత రాజ్యాంగం అమల్లోకి వచ్చిన తరువాత ప్రగతిశీల భావాలు గల వ్యక్తులు వారి మేధోపరమైన రచనల ద్వారా సమసమాజాన్ని కోరుకునే ఆలోచనల్ని ముందుకు తీసుకెళ్ళారు. యూనివర్సిటీ విద్యకు బలమైన పునాదుల్ని నిర్మించడం వాటిలో ముఖ్యమైనది.

స్వాతంత్ర్యపోరాట కాలంలో వినియోగించబడిన స్వేచ్ఛలు, భారతదేశంలో అభివృద్ధి చెందుతున్న ఆధునిక విద్యా విధాన ప్రజాస్వామిక పునాదులను పటిష్టపరిచాయి. ఢిల్లీలోని జవహర్ లాల్ నెహ్రూ యూనివర్సిటీ లాంటి శ్రేష్టమైన విద్యా కేంద్రాలు అభివృద్ధి చెందాయి. అక్కడి నుండే పెద్ద సంఖ్యలో రచయితలు, బ్యూరోక్రట్లు, పోలీసులు, ఇతర అధికారులు దేశానికి సేవలందిస్తున్నారు.

మార్క్సిస్టులు, హిందూమతాన్ని ఉన్నత వర్గాల కుల ఆధిపత్యంతో సమానం చేశారన్న హిందూ జాతీయవాదుల వాదన



పూర్తిగా తప్పు. అలాంటి ఒక విశ్వాసం, మన వారసత్వం గురించి పైకి కనిపించే అవగాహననే ప్రదర్శిస్తుంది. హిందూ మతంలో బ్రాహ్మణీయ విలువలు ఆధిపత్యం చెలాయిస్తున్నాయని అంబేద్కర్ చెప్పిన విషయాన్ని వారు మరిచిపోయారు. దళితులను సమాన పౌరులుగా, మనుషులుగా పరిగణించడానికి తిరస్కరించిన సనాతన హిందూ ధర్మంచే గాయపడిన అంబేద్కర్, మనుస్మృతి దహన కార్యక్రమానికి అధ్యక్షత వహించాడు. తాను హిందువుగా పుట్టానని - "పుట్టుక అనేది నా చేతిలో లేకపోయినప్పటికీ" - కానీ తాను హిందువుగా మాత్రం చనిపోనని అంబేద్కర్ ప్రకటించారు. తన మరణానికి కొద్దిరోజుల ముందు, ఆయన హిందూమతాన్ని త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరించాడు. కాలానుగుణంగా ముందుకు వెళ్ళేందుకు నిరాకరించిన సాంప్రదాయశక్తులు, నేడు భగవత్, మాధవ్ నిలిపిన "మూలాల" నుండి అంబేద్కర్‌ను దూరం చేశాయి. మేల్కొన్నవారిని, సాంప్రదాయ శ్రేణీగత వ్యవస్థ సంకెళ్ళ నుండి విముక్తి కావాలనుకునే ఉదారవాదుల్ని, సంఘ్ ప్రముఖులు, అనుచరులు ఒకేలా చూస్తారు. భారత రాజ్యాంగాన్ని అంటిపెట్టుకొని, అందరికీ సమాన పౌరసత్వం, హోదా కల్పించాలని ఉదారవాదులు కోరుకుంటున్నారు. మానవహక్కులపై ఐక్యరాజ్యసమితి చార్టర్‌లో పేర్కొన్న విధంగా, వారు మానవులందరి విడదీయరాని హక్కులలో విశ్వాసం కూడా కలిగి ఉన్నారు.

ఈ క్రమంలో, ఆర్ఎస్ఎస్ ఒక క్రమపద్ధతిలో సరస్వతీ శిశుమందిర్ లాంటి విద్యాసంస్థలను అభివృద్ధి పరిచింది. ఇక్కడి బోధనా లక్ష్యం, ఆధునిక భారత దేశానికి ముందు అభివృద్ధి చేయబడిన కుల, లింగ శ్రేణీగత వ్యవ స్థకు అనుగుణంగా ఉంటుంది. శిక్షా సంస్కృతీ ఉత్థాన్ న్యాస్ లాంటి సంస్థల్ని కూడా ప్రారంభించింది. ఇది, ఇండో ఫైల్, హిందూ మతంపైన నిష్ణాతుడైన మేధావి వెండీ డోనీగర్ లాంటి వారి హేతుబద్ధమైన, విజ్ఞానవంతమైన రచనలను వ్యతిరేకించేందుకు వెలుగులోకి వచ్చింది. అదే విధంగా, ఏ.కే. రామానుజన్ "మూడు వందల రామాయణాలు" (భారతీయ సాంప్రదాయంపై అవగాహన కలి గించే) అనే అద్భుతమైన వ్యాసాన్ని తొలగిం చాలని మరొక ఆరెస్సెస్ సంస్థ ఢిల్లీ యూనివర్సిటీని ఒత్తిడి చేసింది. ఇవి కేవలం రెండు ఉదాహరణలు మాత్రమే.

> **దళితులను సమాన పౌరులుగా, మనుషులుగా పరిగణించడానికి తిరస్కరించిన సనాతన హిందూధర్మంచే గాయపడిన అంబేద్కర్, మనుస్మృతి దహన కార్యక్రమానికి అధ్యక్షత వహించాడు. తాను హిందువుగా పుట్టానని - "పుట్టుక అనేది నా చేతిలో లేకపోయినప్పటికీ" - కానీ తాను హిందువుగా మాత్రం చనిపోనని అంబేద్కర్ ప్రకటించారు. తన మరణానికి కొద్దిరోజుల ముందు, ఆయన హిందూమతాన్ని త్యజించి, బౌద్ధమతాన్ని స్వీకరించాడు. కాలానుగుణంగా ముందుకు వెళ్ళేందుకు నిరాకరించిన సాంప్రదాయశక్తులు, నేడు భగవత్, మాధవ్ నిలిపిన "మూలాల" నుండి అంబేద్కర్‌ను దూరం చేశాయి.**

విభజనను సృష్టిస్తున్నది భారతదేశ ఉదార వాదం కాదు. పితృస్వామ్యం, కుల అణచివేతల నుండి విముక్తం చేయడానికి ఉదారవాదం నిలబడుతుంది. అసంఖ్యాకమైన ఆరెస్సెస్ శాఖల్లో లక్షలమంది సంఘ్ వాలంటీర్లు, వేల సంఖ్యలో ప్రచారకులు, పూర్తికాలపు ప్రచారకుల భాగస్వామ్యంతో వ్యాప్తి చెందుతున్న మైనారిటీ వ్యతిరేక ప్రచారం ద్వారా సమాజంలో విభజన తలెత్తుతుంది.

మీడియాను అదుపుచేసే విషయానికొస్తే, దాని గురించి ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిది. ఆరెస్సెస్ పూర్తికాలం ప్రచారక్‌గా పనిచేసిన ఎల్.కే.అద్వానీ 1977లో జనతా ప్రభుత్వంలో సమాచార, ప్రసారశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి మీడియాలో అనేక ఆరెస్సెస్ అనుకూల అంశాలు చోటుచేసుకున్నాయి. నేడు ఆర్ఎస్ఎస్, బీజేపీ మార్గంలో కార్పొరేట్ సంస్థలు, ప్రెస్‌ను భారీగా స్వాధీనం చేసుకునే ప్రక్రియ పూర్తయింది.

చివరగా సంఘ్ సిద్ధాంతకర్తలు కుల గణనను విభజనగా చిత్రీకరిస్తున్నారు కానీ, కులగణన అనేది సామాజిక న్యాయానికి మరో మెట్టు. సాధ్యమైనంత వరకు ఆరెస్సెస్ సామాజిక న్యాయాన్ని వ్యతిరేకిస్తుంది.

("న్యూస్ క్లిక్" సౌజన్యంతో)

అనువాదం : బోడపట్ల రవీందర్, 9848412451

విధానాలకు నీళ్లొదిలిన ఎన్నికల ప్రవాహంలో మన కర్తవ్యం!

ప్రజాస్వామ్య వ్యవస్థకు ఎన్నికలే పునాది. ఎన్నికలు జరుగుతున్నది ప్రజాస్వామ్య వ్యవస్థను ఏర్పాటు చేయడానికే కానీ అది ఒక రాజకీయ సమూహానికి సర్వాధికారాలను కట్టబెట్టే వ్యవస్థగా మారింది. నేడు జరుగుతున్న ఎన్నికలు పాలనా సంబంధిత అంశాల ప్రాధాన్యతతో కాకుండా అధికారం దక్కించుకునే సమీకరణాల వంటి అస్తిత్వాల కేంద్రంగా ఉన్నవి. గతంలో లేనంత పెద్ద మొత్తంలో అభ్యర్థుల ఆర్థిక బలాలకు ప్రాధాన్యత సంతరించుకుంది. డబ్బున్న వాడే పోటీ చేయగలడు. సామాజిక నేపథ్యానికి ఎంత ప్రాధాన్యత ఉన్నా, ఆర్థిక బలం ముందు అది కుదేలవుతున్నది. ఇక మీడియా తటస్థత జీరో స్థాయికి పడిపోయింది. ఒక మెట్టు ఎదిగి రాజకీయ పార్టీలను నేరుగా మీడియా యాజమాన్యంతో బాటు విలేకరులూ విమర్శించే స్థాయికి అభివృద్ధి చెందింది! అధికార గణం కూడా నిష్పక్షపాతంగా ఉందని చెప్పలేం. అందుకే కాబోలు కేంద్ర ప్రభుత్వం సివిల్ సర్వీస్ ఉద్యోగులు ప్రభుత్వ పథకాలను ప్రచారం చేసే యంత్రాంగంగా వినియోగించుకోవాలని చూస్తున్నది. దాని కోసం "రథ్‌ప్రభారీ" అనే కొత్త రకమైన విధులకు ఇట్లాంటి అధికారులను కేటాయిస్తున్నది. వెరసి రాజకీయాలు ప్రవేశించని సమూహం అంటూ ఏది లేకుండా ప్రజాస్వామ్యం దేశంలో పరిఢవిల్లుతున్నది! ఈ విధంగా "అధికారం దక్కించుకోవడం కోసం ఎన్నికలు" అనే ఒక వ్యవస్థ ద్వారా ప్రజలను మభ్యపెట్టి, మాయజేసి లేదా కొనుగోలు చేసి జరిగే ఒక యుద్ధమే ఇది. వాస్తవ, అప్రభావిత అభిప్రాయానికి, ఎన్నికలకు, అనంతరం లభించే అధికారానికి తద్వారా జరిగే పరిపాలనకు అవకాశం లేని ఇలాంటి వ్యవస్థ ఇలాగే కొనసాగితే, భవిష్యత్తులో భౌతిక యుద్ధాల ద్వారా అధికారం చేపట్టడం ఎంతో దూరం లేదు!



జి. తిరుపతయ్య
9951300016

తెలంగాణ, రాజస్థాన్, మధ్యప్రదేశ్, చత్తీస్‌గఢ్, మిజోరం ఐదు రాష్ట్రాల్లో ఎన్నికల ప్రచారం ఊపందుకున్నది. ఒక్కో రాష్ట్రంలో ఒక్కో విధమైన సమీకరణలున్నప్పటికీ ఆశావాహం- అధికారం- అందుకోసం జరిగే తంతూ మొత్తం ఒకే విధంగా సాగుతున్నది. గత నెల రోజుల నుండీ పడకేసిన పాలన డిసెంబర్ మూడు తర్వాత గాని తిరిగి ప్రారంభం కాదు. రాష్ట్రాల ఎన్నికల్లో కొన్ని స్థానిక సమస్యలు ప్రస్తావనకు రావచ్చు గానీ జాతీయ, అంతర్జాతీయ అంశాలేవీ అవసరమే లేదన్న చందాన స్థానిక నాయకత్వమున్నది. రాష్ట్రాలు ఇలాంటి వైఖరి అవలంభించటంతో కేంద్రం ఏకపక్షంగా అంతర్జాతీయ వ్యవహారాలు నెరపుతున్నది. గాజాపై ఇజ్రాయిల్ జరుపుతున్న దాడిని ఖండిస్తూ పాలస్తీనా నాయకులకు సంఘీభావాన్ని వ్యక్తపరుస్తూనే, ఇజ్రాయిల్ గాజాపై దాడులను ఆపాలని ఐక్యరాజ్యసమితీ ప్రతిపాదించిన తీర్మానానికి ఓటేయకుండా తటస్థ వైఖరి భారత్ తీసుకుని గైర్హాజరైంది. అంతర్జాతీయ వేదికలపై మాట్లాడే హక్కు రాష్ట్రాలకి లేనప్పటికీ జాతీయ నాయకత్వానికి సూచన చేయవచ్చు. ఇంత ప్రాధాన్యత ఉన్న అంశాన్ని విస్మరించడం తగదు.

కర్నాటక ఎన్నికల ఫలితాలు కచ్చితంగా తెలంగాణలో కాంగ్రెస్ పార్టీకి సానుకూల వాతావరణాన్ని కల్పించాయనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి ముఖ్యంగా బెంగళూరు లాంటి మెట్రోపాలిటన్ ప్రాంతంలో కూడా మతపరమైన భావోద్వేగాలకు గురికాకుండా కాంగ్రెస్ పార్టీని గెలిపించడం ఎగువ మధ్యతరగతిని ప్రభావితం చేసింది. బీజేపీ ప్రభుత్వ ఆధ్వర్యంలో కాంట్రాక్టర్లు - కమీషన్లు, ఆశ్రిత పెట్టుబడిదారులు, వారి ప్రయోజనాలు మరింత పెరిగిపోయిన వాతావరణాన్ని ప్రజలు గమనించారు. అయితే ఈ అంశాలలో కాంగ్రెస్‌కు పెద్దగా ఘనమైన చరిత్ర ఏమీ లేనప్పటికీ సమాజంలో అశాంతికి కారణమవుతున్న మతపరమైన, ప్రాంతీయపరమైన, పరదేశి ద్వేష భావన వంటివి కాంగ్రెస్ నేతృత్వంలో ఉండబోవు అన్న ఒక పాజిటివ్ ఆశావాహ దృక్పథం ప్రజల్లో ఏర్పడుతున్నది. అందుకే తెలంగాణలో కాంగ్రెస్ పార్టీ రోజురోజుకూ పుంజుకుంటున్నది. ఆ పార్టీలో అంతర్గత ఆధిపత్య పోరు ఎంత ఉన్నప్పటికీ అందరూ కలిసి పని చేయాలన్న సంకల్పం కనిపిస్తున్నది. తెలంగాణలో కాంగ్రెస్ గెలిస్తే బీఆర్ఎస్ పార్టీని మించిన స్థాయిలో పరిపాలన ఉంటుందో లేదో ఇప్పుడే చెప్పలేము.



> **మతాన్ని, దేశ సరిహద్దులను వివాదాంశాలుగా మార్చి, ఆశ్రిత పెట్టుబడిదారులను అందల మెక్కించే బీజేపీ లాంటి బూర్జువా పార్టీలకు సరైన విధంగా మునుగోడులో ప్రజల ద్వారా వామపక్షాలు జవాబు ఇచ్చా యనొచ్చు. అయితే "ఏరు దాటగానే తెప్ప తగలేసే" లక్షణాలు పుష్కలంగా కలిగి ఉన్న కేసీఆర్ తమ స్వప్రయోజనాల కోసం, తన కూతుర్ని ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నుంచి కాపాడుకోవడం కోసం, వామపక్షాలను విస్మరించారన్న వార్తలు నేడు చూస్తున్నాం!**

అయితే బీఆర్ఎస్ పరిపాలన కూడా మరీ తీసిపారేసే విధంగా లేదు. కానీ రాజకీయాధికారం ఏకస్వామ్యమై అవినీతి వ్యవస్థీకతమైపోయాయి. హైదరాబాద్‌తో సహా దాదాపు అన్ని జిల్లాలు మన కరీంనగర్, మన నల్లగొండ, మన మహబూబ్ నగర్ అంటూ నగరాల సుందరీకరణలకు ప్రాధాన్యతను ఇచ్చారు. వ్యవసాయ నీటిపారుదలకు కూడా కొంత ప్రాధాన్యత లభించింది. అయితే మిగులు నిధులు ఉన్న రాష్ట్రంలో ఆశించినంతమేర వ్యవసాయ ఉత్పత్తి జరగలేదన్నది వ్యవసాయ నిపుణుల అభిప్రాయం. నియామకాలు కూడా ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మాత్రమే చేపడుతున్న సంకేతాలు స్పష్టం. కార్మిక సంఘాలను చాలా దెబ్బతీసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుంది. ఎన్నికల్లో కార్యకర్తల స్థాయి వరకూ అవినీతి మార్గాలను అన్వేషించి చూపింది కూడా ఆయనే. అన్నిటినీ మించి అభివృద్ధి పథకాలు కాకుండా సంక్షేమ పథకాలకే ప్రాధాన్యతనిస్తూ లబ్ధిదారులను ఓటు బ్యాంకుగా మార్చుకున్నారు. దీని కోసం దాదాపు అన్ని గ్రామాల సర్పంచులను గుప్పిట్లో పెట్టుకున్నారు. రిటైరైన అధికారులకు పదవులు ముట్టజెబుతూ అధికార దుర్వినియోగానికీ ఎక్కువగా పాల్పడిందీ ఈ సర్కారే.

దుబ్బాకలో రఘునందన్‌రావు, హుజూరాబాద్‌లో ఈటల రాజేందర్ గెలిచేసరికి 'అంతా బీజేపీ గాలి వీస్తుంది' అన్న మితిమీరిన అంచనాతో కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డిని ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయించి మునుగోడు ఎన్నికను బలవంతంగా తెలంగాణ ప్రజలపై రుద్దారు. నిజంగా మునుగోడులో బీజేపీ గెలిచి ఉంటే నేడు పరిస్థితులు మరోలా ఉండేవి. వామపక్షాలకు బలీయమైన పట్టు ఉన్న మునుగోడు ప్రాంతంలో మతం, అతి జాతీయవాదాన్ని పెంచి పోషిస్తున్న బీజేపీకి అవకాశం ఇవ్వరాదని వామపక్షాలు బీఆర్ఎస్‌ను బలపరిచి గెలిపించాయి. వామపక్షాలకు కొంతనష్టం జరిగినా బీజేపీ తెలంగాణలో పుంజుకోకుండా చూడడంలో అవి సఫలమయ్యాయనడంలో సందేహం లేదు. మతాన్ని దేశ సరిహద్దులను వివాదాంశాలుగా మార్చి, ఆశ్రిత పెట్టుబడిదారులను అందల మెక్కించే బీజేపీ లాంటి బూర్జువా పార్టీలకు సరైన విధంగా మునుగోడులో ప్రజల ద్వారా వామపక్షాలు జవాబు ఇచ్చాయనొచ్చు. అయితే "ఏరు దాటగానే తెప్ప తగలేసే" లక్షణాలు పుష్కలంగా కలిగి ఉన్న కేసీఆర్ తమ స్వప్రయోజనాల కోసం, తన కూతుర్ని ఢిల్లీ లిక్కర్ స్కామ్‌లో నుంచి కాపాడుకోవడం కోసం, వామపక్షాలను విస్మరించారన్న వార్తలు నేడు చూస్తున్నాం! జాతీయస్థాయిలో బీజేపీని, కాంగ్రెస్‌ను ఢీకొని చక్రం తిప్పాలని టీఆర్ఎస్ పార్టీని బీఆర్ఎస్ పార్టీగా మార్చి సంవత్సరం దాటిన తర్వాత కూడా దాని ఊసే లేకుండా రాష్ట్ర రాజకీయాల్లో కేసీఆర్ తలమునకలై ఉన్నాడు. కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి తిరిగి కాంగ్రెస్ పార్టీలోకి రావడం ఒక అవకాశవాదమే. అయితే ఇలాంటి అవకాశవాదాన్ని పెంచి పోషించే బీజేపీకి తమది నీతిగలిగిన, దేశభక్తి, దైవభక్తితో సంస్కృతిని పరిరక్షించగల పార్టీ అని చెప్పుకునే అర్హత లేదని స్పష్టమౌతున్నది. తెలంగాణాలో తమ పరిస్థితి ఏమిటో అవగతమైన బీజేపీ అధి నాయకత్వం "అధికారంలోకి వస్తే బీసీని ముఖ్యమంత్రిని చేస్తాం లేదా ప్రతిపక్షంలో కూర్చుంటాం" అంటూ ఓటమిని అంగీకరిస్తూనే విభజనకు ఆజ్యం పోస్తున్నది.

విజ్ఞత గలిగిన కార్మికులుగా తటస్థ వైఖరితో కర్తవ్యాన్ని విస్మరించలేము. విద్యాహక్కును ప్రాథమిక హక్కుగా ప్రకటింపజేస్తూ, సమాచారహక్కు చట్టానికి కార్యరూపమివ్వటంలో, కనీస ఉమ్మడి ప్రణాళిక వంటి వాటిని కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలోని యుపిఎ-1 ప్రకటించేలా వామపక్షాలు కీలకపాత్ర పోషించిన సంగతి తెలిసిందే. 1999లో IRDAI బిల్ పాసై ఇన్సురెన్స్ రంగంలో 26శాతం ఎఫ్‌డిఐతో ప్రయివేటు కంపెనీలు మనుగడలోకి వచ్చినప్పటికీ కాంగ్రెస్ పాలించిన కాలంలో (2004- 2014)ఎఫ్‌డిఐ పెంచేందుకు కాంగ్రెస్ పార్టీ సాహసించలేదు. మన పోరాటాలు, వామపక్షాల తోడ్పాటు వల్ల ఇది సాధ్యమైంది. కానీ ప్రస్తుత పరిపాలనలో పోరాటాలకూ ప్రజాభిప్రాయానికీ ఏ మాత్రం గౌరవం లేదు. గత పదేళ్ళలో ఎఫ్‌డిఐ 26 నుండి 74శాతానికి పెంచేశారు. వివాదాస్పద, భావోద్వేగ అంశాలే కాకుండా ప్రజా సంక్షేమానికీ, దేశ ప్రగతికీ, మనకి బ్రెడ్ అండ్ బటర్‌గా వున్న ప్రభుత్వ రంగాల పరిరక్షణ కోసం లౌకిక ప్రజాస్వామిక శక్తుల వైపు నిలబడటం నేటి కర్తవ్యం.



ఐలమ్మ స్ఫూర్తితో ప్రభుత్వాల మెడలు వంచాలి

- ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్ పుణ్యవతి
- తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో.. మహిళా కూలీల రాష్ట్ర సదస్సు

నవతెలంగాణ-వరంగల్ ప్రాంతీయ ప్రతినిధి

చాకలి ఐలమ్మ స్ఫూర్తితో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల మెడలు వంచి రూ.600 కూలి, 200 రోజుల పనిదినాలు సాధించాలని ఐద్వా జాతీయ కోశాధికారి ఎస్. పుణ్యవతి పిలుపునిచ్చారు. హన్మకొండ జిల్లా హసన్‌పర్తిలోని ఐలమ్మ నగర్‌లో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా కూలీల రాష్ట్ర సదస్సును నాయకులు స్వరూప అధ్యక్షతన శుక్రవారం జరిగింది. సదస్సుకు ముందుగా తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం పతాకాన్ని మహిళా కూలీల రాష్ట్ర కన్వీనర్ బప్పని పద్మ ఆవిష్కరించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద ఏర్పాటు చేసిన పుచ్చలపల్లి సుందరయ్య ఛాయ చిత్రానికి పూలు చల్లి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సదస్సులో పుణ్యవతి మాట్లాడుతూ.. పాలకుర్తిలో రామచంద్రారెడ్డి దౌర్జన్యాలకు వ్యతిరేకంగా పోరాడిన ఐలమ్మ వారసులుగా.. కూలి కోసం, పనిదినాల కోసం పోరాటం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. ప్రధాని మోడీ, సీఎం కేసీఆర్ దొంగ నాటకాలాడుతూ కార్మికులు, కూలీల ప్రయోజనాలను దెబ్బతీస్తున్నారన్నారు. పోరాడి సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రధాని మోడీ అదానీ, అంబానీలను ప్రపంచ కుబేరులుగా చేయడానికి దేశ సంపదను, ప్రభుత్వ రంగ సంస్థలను వారికి అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. డ్వాక్రా గ్రూపులకు పావలా వడ్డీకి రుణాలిస్తామన్న ప్రభుత్వాలు రూ.2ల వడ్డీకి ఇస్తూ మహిళలను మోసం చేస్తున్నారన్నారు. మనకివ్వడానికి సర్కార్ వద్ద డబ్బులు లేవంటున్న ముఖ్యమంత్రి హైదరాబాద్‌లో ఉన్న సచివాలయం కూలగొట్టి కొత్త సచివాలయం కట్టించారని ఆరోపించారు. వ్యవసాయ కార్మిక సంఘం చేస్తున్న పోరాటాల్లో మహిళా కూలీలే అధికంగా పాల్గొంటున్నారని, భవిష్యత్తులోనూ హక్కుల సాధన కోసం పోరాటాలను మరింత ఉధృతం చేయాలని కోరారు.

ఐద్వా జాతీయ ఉపాధ్యక్షులు టి. జ్యోతి మాట్లాడుతూ.. వ్యవసాయ కార్మిక సంఘం నేతృత్వంలో జరుగుతున్న భూ పోరాటాల్లో మహిళా కూలీలే అధికంగా పాల్గొంటున్నారన్నారు. 60 గజాల స్థలం కోసం పోరాడే మహిళలది ఆత్మగౌరవ పోరాటమన్నారు. ఒక ఎకరం భూమి సాగు చేయడానికి 52 మంది కూలీలు అవసరమని ఒక అధ్యయనం తెలిపిందని, కానీ ప్రస్తుతం 16 మంది కూలీలు మాత్రమే పనిచేస్తున్నారని, వారందరూ మహిళా కూలీలే కావడం విశేషమన్నారు. ఎకరానికి 36 మందికి కూడా పని దొరకడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ చట్టానికి బడ్జెట్‌లో నిధులు తగ్గించిస్తూ దాన్ని నిర్వీర్యం చేసేందుకు ప్రయత్నిస్తుందని విమర్శించారు. పార్లమెంటులో మహిళా బిల్లు ఆమోదించినా, అది ఇప్పుడు అమలు చేయడం లేదన్నారు. జనగణన పూర్తై, నియోజకవర్గాల పునర్విభజన జరిగాకే అమలు చేస్తామని ప్రధాని మోడీ చెప్పడం మహిళలను మోసం చేయడమేనన్నారు. మోదీ పాలనలో నిత్యావసర సరుకుల ధరలు గణనీయంగా పెరిగాయని, దాంతో సామాన్యులు సరుకులు కొనలేక పస్తులుండాల్సి వస్తుందని తెలిపారు. గూడు కావాలని మీరు చేస్తున్న ఈ పోరాటానికి ఐద్వా సంపూర్ణ మద్దతు ఉంటుందని, మీ పోరాటం జయప్రదం కావాలని కోరారు. ఈ సదస్సులో రాష్ట్రవ్యాప్తంగా వచ్చిన ప్రతినిధులు పాల్గొన్నారు. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్. వెంకట్రాములు, ఉపాధ్యక్షులు బి. ప్రసాద్, హన్మకొండ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు సారంపల్లి వాసుదేవరెడ్డి, గుమ్మడిరాజుల రాములు, డి. తిరుపతి, పుల్లా అశోక్ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ అధికారం బీఆర్ఎస్‌దే

- మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్:

తెలంగాణలో మళ్లీ బీఆర్ఎస్ పార్టీ బంపర్ మెజార్టీతో అధికారం చేపడుతుందని పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. శుక్రవారం సోమాజిగూడ ప్రెస్ క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీట్ ది ప్రెస్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ గడిచిన తొమ్మిదిన్నర ఏండ్లలో తాము చేసిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలే తమను గెలిపిస్తాయని ధీమా వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ఎన్ని కుయుక్తులు చేసినా 78 స్థానాల్లో విజయం సాధించడం ద్వారా కేసీఆర్ హ్యాట్రిక్ ముఖ్యమంత్రిగా రికార్డు సృష్టించనున్నారని తెలిపారు. రైతుబంధు, రైతు భీమా, కళ్యాణ లక్ష్మి,ఆసరా పెన్షన్లు, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, మిషన్ భగీరథ తదితర సంక్షేమ పథకాలు చరిత్రలో నిలుస్తాయని అన్నారు. తాము మ్యానిఫెస్టోలో పెట్టిన హామీలను తూచా తప్పకుండా అమలు చేస్తున్నామని గుర్తు చేశారు. 60 ఏళ్ల పాలనలో కాంగ్రెస్ ఇచ్చిన హామీలను ఎక్కడా అమలు చేసిన దాఖలాలు లేవని ఆరోపించారు.



రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్

- చంచల్‌గూడ జైల్లో 1779 ఖైదీ
- తెలంగాణ ద్రోహులతో జతకట్టిండు
- స్ట్రాంగ్ లీడర్ కేసీఆర్ ఉండగా రాంగ్ లీడరెందుకు
- ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి
- సంగారెడ్డిలో బీఆర్ఎస్‌ను గెలిపిస్తే అభివృద్ధి బాధ్యత నాది: మంత్రి హరీశ్‌రావు

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఓటుకు నోటు కేసులో అడ్డంగా దొరికిన వ్యక్తి రేవంత్‌రెడ్డి ఓ క్రిమినల్ గ్యాంగ్ అని, చంచల్‌గూడ జైల్లో 1779 నెంబర్ ఖైదీ బెయిల్ మీద తిరుగుతున్నాడని మంత్రి తన్నీరు హరీశ్‌రావు విమర్శించారు. శుక్రవారం సంగారెడ్డి నియోజకవర్గ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక పీఎస్ఆర్ గార్డెన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. స్వరాష్ట్రం సాధించి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా అభివృద్ధి చేసిన కేసీఆర్ లాంటి స్ట్రాంగ్ లీడర్ ఉండగా.. మనకు రాంగ్ లీడర్లు ఎందుకని ప్రశ్నించారు. తెలంగాణ ద్రోహులంతా జతకట్టి ఎన్నికల ముసుగులో మన దగ్గరికి వస్తున్నారని ఆరోపించారు. తెలంగాణ గెలవాలంటే కారు గుర్తుకు ఓటేయాలని, తెలంగాణ ఓడాలంటే రేవంత్‌రెడ్డి క్రిమినల్ గ్యాంగ్‌కు ఓటేయాలన్నారు. ఏది కావాలో ప్రజలే తేల్చుకోవాలన్నారు. ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీలకుండా ఈ సారి ఎన్నికల్లో తెలంగాణలో టీడీపీ అసలు పోటీయే చేయడంలేదని, షర్మిల కూడా కాంగ్రెస్ పార్టీకి మద్దతు ప్రకటించారని, ఇక పవన్ కళ్యాణ్ బీజేపీతో చేతులు కలుపుతున్నారని తెలిపారు.

అనాడు సంగారెడ్డిని కర్నాటకలో కలపాలని డిమాండ్ చేసిన స్థానిక ఎమ్మెల్యే జగ్గారెడ్డి తెలంగాణ ద్రోహి అని విమర్శించారు. కాంగ్రెస్‌లో టికెట్లు అమ్ముకున్నారని ఆ పార్టీ వాళ్లే గాంధీ భవన్‌లో రేవంత్‌రెడ్డి బొమ్మలు దగ్ధం చేస్తున్నారన్నారు. కాంగ్రెస్‌ను గెలిపిస్తే తెలంగాణను గంపగుత్తగా అమ్ముకుంటారని విమర్శించారు. రేవంత్‌రెడ్డి ఉస్మానియా విద్యార్థులను అడ్డా కూలీలని, బీరుకు, బిర్యానికి అమ్ముడుపోతారని హేళన చేశారని గుర్తు చేశారు. బీఆర్ఎస్ గెలిస్తే సంగారెడ్డి నియోజకవర్గంలో 10 వేల ఇళ్ల స్థలాలు ఇస్తామని హామీ ఇచ్చారు. సంగారెడ్డిలో బీఆర్ఎస్ అభ్యర్థి చింత ప్రభాకర్‌ను గెలిపిస్తే నియోజకవర్గం అభివృద్ధి చేసే బాధ్యత తీసుకుంటానని భరోసా ఇచ్చారు. సమావేశంలో ఎర్రోళ్ల శ్రీనివాస్, టీఎన్జీఓ రాష్ట్ర మాజీ అధ్యక్షులు మామిళ్ల రాజేందర్, డీసీసీబీ వైస్ చైర్మన్ పట్నం మాణిక్యం, గ్రంథాలయ చైర్మెన్ నరహరిరెడ్డి, సీడీసీ చైర్మెన్ కాసర్ల బుచ్చిరెడ్డి, మున్సిపల్ చైర్మెన్ బొంగుల రవి విజయలక్ష్మి, వైస్ చైర్మెన్ లతా విజేయేందర్ రెడ్డి, ఎంపీ ముఖీం, మనోహర్‌గౌడ్, జెడ్పీటీసీ సునీతామనోహర్‌గౌడ్, బీరయ్య యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

వద్దని వెళ్లగొట్టినా బుద్ధి రాలేదు..

- ఖమ్మం, పాలేరు ప్రజలు వెళ్లగొడితే పొర్లు దండాలు పెడుతూ తిరుగుతున్నావ్.. : ఖమ్మం కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మలపై బీఆర్ఎస్ అభ్యర్థి పువ్వాడ



నవతెలంగాణ - ఖమ్మం ప్రాంతీయ ప్రతినిధి

'నిన్ను ఖమ్మం, పాలేరు ప్రజలు వద్దని ఇంటికి పంపించినా ఇంకా ఏ ముఖం పెట్టుకుని మళ్ళీ ప్రజలకు పొర్లు దండాలు పెడుతూ తిరుగుతున్నారో అర్థం కావట్లేదు' అని ఖమ్మం నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి పువ్వాడ అజయ్ కుమార్.. కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మల నాగేశ్వరరావుపై ధ్వజమెత్తారు. ఖమ్మం నగరం 24వ డివిజన్ శాంతినగర్‌లో ప్రభుత్వ పూర్వ ఉద్యోగి నరసింహారావు కుమార్తె నిరోషా ఆధ్వర్యంలో శుక్రవారం ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో పువ్వాడ మాట్లాడారు. ఎమ్మెల్యేగా, మంత్రిగా ఉన్న మీరు ప్రజలకు ఏం చేశారని కాంగ్రెస్ అభ్యర్థి తుమ్మలను ప్రశ్నించారు. ఒకవేళ చేసి ఉంటే ప్రజలు ఎందుకు మిమ్మల్ని తిరస్కరించారని నిలదీశారు. ఇక్కడ మీరు చేసింది ఏమీ లేదని, కేవలం అధికారాన్ని అనుభవించి ప్రజలను బూతుపురాణంతో భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపించారు. సత్తుపల్లి, పాలేరుల్లో గెలిచి మంత్రిగా ఉన్నపుడు ఆయా నియోజకవరాలకు ఏం చేశారని నిలదీశారు. ఖమ్మంకు ఏం చేశారో చెప్పాలన్నారు. 40 ఏండ్ల అనుభవం అని చెప్పుకుంటూ ఒక్క అవకాశం ఇవ్వండని పొర్లుదండాలు పెట్టడం చూస్తే అధికార దాహం తప్ప మరేం కనిపించడం లేదన్నారు. తనపై పోటీ చేసి ఓడిపోయిన వాడిని కేసీఆర్ పిలిచి మంత్రి పదవి, ఎమ్మెల్సీ, ఎమ్మెల్యేని చేస్తే అదే కేసీఆర్‌ను దూషిస్తున్న అవకాశవాది అని విమర్శించారు. రాజకీయంగా ఆయనకు ఎలాంటి అవకాశం లేకున్నా ఇంత మంచి అవకాశం ఇచ్చి జిల్లాలో ఏకఛత్రాధిపత్యం ఇస్తే నువ్వేం చేశావ్ అని, పార్టీకి వెన్నుపోటు పొడిచి పోవడం తప్ప అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలు అన్నీ గమనిస్తూనే ఉన్నారని అన్నారు. కార్యక్రమంలో మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మెన్ కూరాకుల నాగభూషణం, భద్రాద్రి బ్యాంక్ చైర్మెన్ చెరుకూరి కృష్ణమూర్తి, వర్తక సంఘం అధ్యక్షకార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, వేములపల్లి వెంకన్న, కార్పొరేటర్ మగ్బూల్, ఎన్నికల సమన్వయకర్త, సభ్యులు పల్లా రాజశేఖర్, పారా నాగేశ్వరరావు, అమరగాని వెంకన్న, అరుణ, మాధవి, ఇందిర తదితరులు పాల్గొన్నారు.

ఎనిమిది నెలలుగా తండాలో నీళ్లు రావడం లేదు

- ఎన్నికలు రాగానే వచ్చారా అంటూ గిరిజనుల ఆగ్రహం
- బీఆర్ఎస్ నాయకులకు నిరసన సెగ



నవతెలంగాణ-కౌడిపల్లి

'ఎన్నికలు రాగానే తాండాకు వచ్చి ఓట్లు అడుగుతున్నారని, కానీ ఎనిమిది నెలల నుంచి తాగునీరు రాక తాము ఎంత ఘోష పడ్డా ఎవరూ పట్టించుకోవడం లేదని మెదక్ జిల్లా కౌడిపల్లి మండలం హరిచంద్ తండా గిరిజన మహిళలు ఎమ్మెల్యే మదన్ రెడ్డి, నర్సాపూర్ బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థి సునీతా లక్ష్మారెడ్డిని గిరిజన మహిళలు నిలదీశారు. మండలంలోని తునికి నల్ల పోచమ్మ ఆలయంలో ప్రచారానికి వచ్చిన ఎమ్మెల్యే మదన్ రెడ్డి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి సునీతా రెడ్డి ప్రత్యేక పూజలు చేసి ప్రచారం ప్రారంభించారు.

మొదటి రోజు తునికి, హరిచంద్ తాండ, ముద్రాజ్ పల్లి, రాజిపేట్, వెంకటాపూర్, వెంకట్రావుపేట్ గ్రామాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ క్రమంలో హరిచంద్ తండాలో ప్రచారం నిర్వహిస్తున్న సమయంలో మహిళలు తాగునీటిపై వారిని ప్రశ్నించారు. తాగునీటి కోసం తమ సొంత డబ్బులతో బోర్ వేసుకున్నామని మూడవత్ రవి, మన్య, దేవి, లక్ష్మణ్, లచ్చు తెలిపారు. దీనిపై సునీత స్పందిస్తూ.. ఇక నుంచి ఎలాంటి ఇబ్బంది రాకుండా చూస్తానని హామీ ఇచ్చారు.

గిరిజనుల లావాణి భూములను ప్రభుత్వం వచ్చాక పట్టాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజు నాయక్, జెడ్పీటీసీ కవిత, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు చిలుముల వెంకటేశ్వర రెడ్డి, రాష్ట్ర నాయకులు నరసింహ రెడ్డి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు గుంజరి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో.. బంగారం ధరలు
(10 గ్రాములకు రూ.లలో)

24 క్యారెట్లు	- 61,750	▲ 220
22 క్యారెట్లు	- 56,600	▲ 200
కిలో వెండి	- 77,000	▼ 500



చికెన్ ధరలు
హైదరాబాద్
బ్రాయిలర్ చికెన్

ఫారం రేటు	రూ. 94
రిటైల్ (లైవ్)	రూ. 116
స్కిన్‌తో	రూ. 168
స్కిన్‌లెస్	రూ. 191

ఎన్నికల నోటిఫికేషన్ జారీ

నవతెలంగాణ-హైదరాబాద్‌బ్యూరో

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్లు జారీ అయ్యాయి. శుక్రవారం ఉదయం పది గంటలకు రిటర్నింగ్ అధికారులు ఎక్కడికక్కడ ఈ నోటిఫికేషన్లను జారీ చేశారు. 11 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల స్వీకరణ ప్రారంభమైంది. ఎలక్షన్ కమిషన్ ఆఫ్ ఇండియా ముఖ్య కార్యదర్శి అవినాష్ కుమార్, తెలంగాణ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి (సీఈఓ) వికాస్‌రాజ్ ఆదేశాల మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి ఎన్నికల నోటిఫికేషన్‌కు సంబంధించిన గెజిట్‌ను విడుదల చేశారు. అనంతరం బూర్గుల రామకృష్ణారావు భవన్‌లోని రాష్ట్ర ఎన్నికల సంఘం కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో సీఈఓ వికాస్‌రాజ్ ఎన్నికల నియమ నిబంధనలు వివరించారు. ఎన్నికలు పూర్తి స్వేచ్ఛ, పారదర్శకంగా నిర్వహించేందుకు రాజకీయపార్టీలు, ప్రజలు సహకరించాలని కోరారు. రైతుబంధు విడుదలపై తమకు ఎవరి నుంచి ఎలాంటి ఫిర్యాదులు అందలేదనీ, అదే సమయంలో దానిపై ప్రభుత్వం నుంచి కూడా ఎలాంటి ప్రతిపాదనలు రాలేదని స్పష్టంచేశారు. ఒక అభ్యర్థి గరిష్టంగా రెండు నియోజకవర్గాలనుంచి పోటీ చేయొచ్చని చెప్పారు. ఒక్కో నియోజకవర్గంలో గరిష్టంగా నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయొచ్చనీ, డిపాజిట్ మాత్రం ఒక్కదానికే చెల్లించాలన్నారు. నామినేషన్ పత్రాలు, అఫిడవిట్‌ల దాఖలు విషయంలో అభ్యర్థులు చాలా జాగ్రత్తగా ఉండాలనీ, ఏ కాలమ్‌ను ఖాళీగా వదలకూడదని వివరించారు. నవంబర్ 30న జరిగే పోలింగ్ 13 నియోజకవర్గాల్లో సాయంత్రం 4 గంటల వరకు, మిగతా చోట్ల 5 గంటల వరకు జరుగుతుందని చెప్పారు. అక్టోబరు 31వ తేదీ వరకు వచ్చిన ఓటు హక్కు దరఖాస్తులను నవంబరు 10వ తేదీ వరకు పూర్తి చేస్తామన్నారు. ఆ తర్వాతే ఇంటింటికీ పోల్ స్లిప్‌ల పంపిణీ ఉంటుందన్నారు. ఇప్పటి వరకు రెండు వేల పోలింగ్ కేంద్రాలు సిద్ధం చేశామనీ, 1500 కంటే ఎక్కువ ఓటర్లు ఉన్న ప్రాంతాల్లో అదనంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. పట్టణ ప్రాంతాల్లో ఓటింగ్ శాతం తక్కువగా ఉంటున్నదనీ, దాన్ని పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని వివరించారు. దివ్యాంగులు ఓటు హక్కు వినియోగించుకోవాలనీ, వారికి పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం ఉన్నా, నేరుగా పోలింగ్ బూత్‌లకు వచ్చి ఓట్లు వేసేందుకు అవసరమైన ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. 18వేల వీల్‌ఛైర్లు ఏర్పాటు చేస్తున్నామన్నారు. వృద్ధులు, వికలాంగుల కోసం ప్రత్యేక క్యూలైన్లు ఉంటాయన్నారు. రాష్ట్రంలో 9 లక్షల 10వేల 810 మంది యువ ఓటర్లు ఉన్నారనీ, వారందరూ ఓటు హక్కు వినియోగించుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. నవంబర్ 2 తేదీ నాటికి మొత్తం ఓటర్ల సంఖ్య 3 కోట్ల 21 లక్షల 88 వేల753గా ఉన్నదని పేర్కొన్నారు. ఎన్నికల షెడ్యూల్ వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.453 కోట్ల విలువైన సొత్తు స్వాధీనం చేసుకున్నామనీ, 362 కేసులు, 256 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని తెలిపారు. సీ-విజిల్ యాప్ ద్వారా 2,487 ఫిర్యాదులు వచ్చాయన్నారు. ప్రగతిభవన్‌కు తామిచ్చిన నోటీసులకు సమాధానం ఇచ్చారనీ, దాన్ని కేంద్ర ఎన్నికల సంఘానికి పంపామని ఓ ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. అలాగే వివిధ రకాల అనుమతుల కోసం 9,630 దరఖాస్తులు వచ్చాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా 205 చెక్ పోస్టులు ఏర్పాటు చేశామనీ, స్వాధీనం చేసుకున్న నగదుకు ఆధారాలు ఉంటే జిల్లా కమిటీల ద్వారా త్వరగా విడుదల చేయాలని ఆదేశించామని చెప్పారు. ఇప్పటివరకు 137 ఎన్నికల నియమావళి ఉల్లంఘన కేసులు నమోదు అయ్యాయనీ, వాటిలో 13 బీఆర్‌ఎస్, 16 కాంగ్రెస్, ఐదు బీజేపీ, మూడు బీఎస్పీకి సంబంధించి అనుమానిత కేసులు ఉన్నాయని వివరించారు. ప్రలోభాలను కట్టడి చేయాలన్నదే ఎన్నికల సంఘం లక్ష్యమనీ, రెవెన్యూ ఇంటెలిజెన్స్ సమాచారం ఆధారంగా ఆయా విభాగాల చర్యలు తెలుసుకుంటున్నామని చెప్పారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పర్యవేక్షణకు అదనంగా 375 కంపెనీల కేంద్ర బలగాలు వస్తున్నాయని తెలిపారు. ఎంపీ, దుబ్బాక బీఆర్‌ఎస్ అభ్యర్థి కొత్త ప్రభాకర్ రెడ్డిపై దాడి దురదృష్టకరమనీ, దానిపై తమకు పోలీసుల నివేదిక వచ్చిందని చెప్పారు. ఎన్నికల సందర్భంగా అభ్యర్థుల భద్రతపై తగిన చర్యలు తీసుకోవాలని పోలీసు శాఖను ఆదేశించామని అన్నారు. అనుమానాస్పద ఆన్‌లైన్ దావాదేవీలపై నిఘా ఉంచుతామనీ, దానికోసం శుక్రవారం బ్యాంకర్లతో ప్రత్యేకంగా సమావేశమై విధివిధానాలు, నిబంధనలు తెలిపామని చెప్పారు.

కాళేశ్వరం కుంగుతోంది

(మొదటిపేజీ తరువాయి)

తెలియాడే నిర్మాణంగా రూపకల్పన చేశారు.. కానీ స్థిరమైన నిర్మాణంగా నిర్మించారు. ప్రాజెక్ట్ అధికారులు బ్యారేజీకి ఎగువ, దిగువ రెండు వైపులా కింద ఉన్న రాక్‌ని చేరుకోవడానికి వరుస సెకెంట్ పైల్ (కాంక్రీట్) గోడలను ఉపయోగించారు. ఈ విషయాలను పరిశీలిస్తే ప్లానింగ్ చేసిన విధంగా డిజైన్ జరగకపోవడం, డిజైన్ చేసిన విధంగా నిర్మాణం జరగకపోవడం స్పష్టంగా కనిపిస్తుంది. 2019లో బ్యారేజీని ప్రారంభించినప్పటి నుండి డ్యామ్ నిర్వాహకులు సిమెంట్ కాంక్రీట్ దిమ్మెలను, లాంచింగ్ అప్రాన్‌లను సరిగా పరిశీలించలేదు. మెయింటెనెన్స్ చేపట్టలేదు. ఈ నిర్లక్ష్యం వల్ల బ్యారేజీ క్రమంగా బలహీనపడింది. ఇది దాని వైఫల్యానికి దారి తీసింది.వర్షాకాలానికి ముందు, తర్వాత ఏవైనా అసాధారణ సమస్యలు కనిపిస్తే తనిఖీలు నిర్వహించాలని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ (ఎన్డీఎస్ఓ)కు పలుమార్లు సూచించింది. అయితే ఈ సూచనలను రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ ఆర్గనైజేషన్ సరిగా పాటించలేదని స్పష్టంగా తెలుస్తోంది. ఇది చాలా పెద్ద తప్పిదం. ఇది డ్యామ్ సేఫ్టీ యాక్ట్ 2021లోని నిబంధనలకు విరుద్ధంగా ఉంది. ప్రత్యేకంగా చాప్టర్ 10లోని 41 (బి) సెక్షన్ కింద తీసుకోవల్సిన చర్యలకు డ్యామ్ నిర్వాహకులు బాధ్యత వహించాలి.

అదేవిధంగా తెలంగాణ రాష్ట్ర డ్యామ్ సేఫ్టీ అథారిటీ, డ్యామ్ సేఫ్టీ యాక్ట్-2021లోని అనేక ఇతర నిబంధనలను పాటించలేదు. ఇది తీవ్రమైన సమస్య. ఎందుకంటే బ్యారేజీ వైఫల్యం ప్రజల జీవితాలకు, ఆర్థిక వ్యవస్థకు తీవ్రమైన ప్రమాదాన్ని కలిగించే అవకాశం ఉంది.

కమిటీ సూచనలు

బ్యారేజ్‌ను పునరుద్ధరించే వరకు చేపట్టాల్సిన చర్యలు కూడా నేషనల్ డ్యామ్‌సేఫ్టీ అథారిటీ సూచించింది. మేడిగడ్డ బ్యారేజీలో ఒక బ్లాక్ లో ఉత్పన్నమైన ఈ సమస్య కారణంగా మొత్తం బ్యారేజీ సక్రమంగా పనిచేయని పరిస్థితి ఏర్పడింది. ఈ సమస్య పరిష్కారం జరిగే వరకు మొత్తం బ్యారేజీని ఉపయోగించడానికి ఎలాంటి అవకాశం లేదు. బ్లాక్ నెం.7లో ఉన్న సమస్య మరమ్మతులు చేయడానికి వీలుగా లేదు. మొత్తం బ్లాక్ ని పునాదుల నుంచి తొలగించి తిరిగి పున:నిర్మించాలి. నిర్మాణ సారూప్యతలను పరిగణనలోకి తీసుకుంటే మేడిగడ్డ బ్యారేజ్ లోని ఇతర బ్లాక్‌లు కూడా ఇదే రీతిలో వైఫల్యం చెందే పరిస్థితి ఉంది. ఒకవేళ ఇదే జరిగితే మొత్తం బ్యారేజీని పునర్నిర్మించాల్సిన అవసరం వస్తుంది. ప్రస్తుతం ఉన్న పరిస్థితిలో రిజర్వాయర్‌ను నింపడం వల్ల బ్యారేజీ మరింత క్షీణించే అవకాశం ఉంది. అంటే ప్రస్తుత పరిస్థితిలో బ్యారేజీ పున్ణనిర్మాణం జరిగే వరకు ఏ విధంగానూ ఉపయోగించలేము. రిజర్వాయర్ లో నీటిని నింపకూడదు, ఒకవేళ నింపితే ఇది పైపింగ్ సమస్యను మరింత తీవ్రతరం చేస్తుంది. అంటే... డ్యామ్ ను సరి చేసే వరకు ప్రజలకు నీటి సరఫరా చేయ్యలేని పరిస్థితి ఉంటుందని పేర్కొంది. గాంట్రీ క్రేన్ ఆపరేట్ చేయకూడదని తెలిపింది. పరిస్థితి మరింత తీవ్రతరం కాకుండా ఉండటానికి, బ్యారేజీని పునరుద్ధరించే వరకు ఈ జాగ్రత్తలు తీసుకోవాలి. కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ ఎగువన నిర్మించిన అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా ఇదే విధమైన డిజైన్లు, నిర్మాణ పద్ధతులు కలిగి ఉన్నాయి. అంటే ఇవి కూడా ఇలాంటి సమస్యలను ఎదుర్కునే పరిస్థితులు ఉన్నాయి. అన్నారం బ్యారేజీ దిగువన బాయిలింగ్ సమస్య సంకేతాలు ఇప్పటికే ఉన్నాయి. గత రెండు రోజులుగా ఇది గమనిచండం జరిగింది. ఇలాంటి సంకేతాలు, పైపింగ్ సమస్యలను గుర్తించడానికి ఈ రెండు బ్యారేజీలలో వెంటనే మేడిగడ్డ బ్యారేజీతో పాటే యుద్ధ ప్రాతిపదికన తణిఖీలు నిర్వహించడం చాలా అవసరం. మేడిగడ్డ బ్యారేజ్ 2019లో నిర్మించబడింది. 2023 అక్టోబర్ 21న బ్యారేజ్ పునాది భారీ శబ్దంతో కుంగిపోయింది. జలశక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) మేడిగడ్డ బ్యారేజ్ పిల్లర్లు కుంగిపోయిన ఘటనపై విచారణ కమిటీ ఏర్పాటు చేసింది. ఈ కమిటీలో వివిధ రాష్ట్రాలకు చెందిన అధికారులు కూడా ఉన్నారు. ఈ కమిటీ అక్టోబర్ 24న ఈ మేడిగడ్డ డ్యామ్ ను సందర్శించింది. అక్టోబర్ 25న తెలంగాణ ప్రభుత్వం నుంచి 20 అంశాలపై సమాచారాన్ని కోరింది. కానీ, సర్కార్ పూర్తి సమాచారం ఇవ్వలేదు. అక్టోబర్ 29లోపు పూర్తి డేటాను ఇవ్వకపోతే బ్యారేజీ నిర్మాణంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్లక్ష్య పూరితంగా వ్యవహరించిందని భావించాల్సి వస్తోందని కమిటీ చెప్పినా కూడా తెలంగాణ సర్కార్ పట్టించుకోలేదని కమిటీ నివేదికలో తెలిపింది.

కేసీఆర్ సర్కారుకు దెబ్బ

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

కాళేశ్వరం సాగునీటి ప్రాజెక్టుపై జాతీయ డ్యామ్ సేఫ్టీ అథారిటీ(ఎన్‌డిఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక రాష్ట్రంలోని కేసీఆర్ సర్కారుకు భారీ నష్టాన్ని కలిగించే అవకాశాలున్నాయి. గులాబీ ప్రభుత్వానికి అవినీతి మరకలు అంటనున్నాయి. సాగునీటి ప్రాజెక్టులపై పాటించాల్సిన కనీస ప్రమాణాలను పాటించలేదని ఎన్‌డిఎస్‌ఏ వ్యాఖ్యలు ఇప్పుడు రాష్ట్రంలో సంచలనమవుతున్నాయి. అడుగడుగునా చర్చకు ఆస్కారమిచ్చినట్టయింది. అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రోజున ఎన్‌డిఎస్‌ఏ నివేదిక రావడం ఒకింత కలవరపరిచేదే. అంతేందుకు బాంబు పేల్చినంత పనిచేసింది. ఈ పరిణామం రాష్ట్ర రాజకీయాలపై తీవ్ర ప్రభావం పడనుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రణాళిక, డిజైన్, క్వాలిటీ, మెయింటెనెన్స్ తదితరాలు సాధారణ ప్రమాణాలు. అవే కీలకమైనవి కూడా. అవేవీ కేసీఆర్ సర్కారు పట్టించుకోలేదని ఎన్‌డిఎస్‌ఏ రిపోర్టు స్పష్టం చేస్తున్నది. అపరభగీరథుడుగా సీఎం కేసీఆర్‌ను ఆపార్టీ శ్రేణులు చెప్పుకున్నారు. సరైన సమాచారం ఇవ్వకుండా జాతీయ డ్యామ్ సేఫ్టీ చట్టం నిబంధనలను ఉల్లంఘించారంటూ నివేదికలో పేర్కొన్నారు. ఇది కూడా కేసీఆర్ సర్కారును ఇరుకునపెట్టేదే. మొత్తంగా బ్యారేజీ పనికిరాదనీ, పూర్తిస్థాయిలో నిర్మించాల్సిన అవసరం రావచ్చొని చెప్పింది. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్ల పరిస్థితి ఉందని నివేదిక వ్యాఖ్యానించింది. కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడప్పుడే వినియోగించరాదంటూ చెప్పింది. ఇప్పుడు రాష్ట్రసాగునీటి, ఆయకట్టు అభివృద్ధి శాఖలో భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. చరిత్రలో ఇలాంటి గొప్ప ప్రాజెక్టు కట్టలేదని చెప్పుకున్న అధికారులకు, శీతాకాలంలోనూ చెమటలు కక్కే పరస్థితి ఏర్పడింది. నివేదికపై హైదరాబాద్‌లోని జలసౌధలో చర్చోపచర్చలు చోటుచేసుకున్నాయి. మేడిగడ్డ, అన్నారంలో చోటుచేసుకున్న లోపాలపై ఆ ప్రాజెక్టు ఇంజినీర్ ఇన్ చీఫ్ నల్లా వెంకటేశ్వర్లు, ఎల్ అండ్ టీ అధికారి సురేశ్‌కుమార్ తదితర అధికారులతో వివరణ ఇప్పించిన సాగునీటి శాఖ, ఎన్‌డిఎస్‌ఏ నివేదికపై నోరుమెదపడం లేదు. నివేదికపై స్పందించాలని మీడియా కోరినా బాధ్యులైన అధికారురులు పట్టించుకోలేదు. ఉన్నతాధికారుల నుంచి వచ్చిన ఆదేశాల మేరకే ఇలా చేశారని సమాచారం. ఇకపోతే ముఖ్యమంత్రి కార్యాలయం సైతం ా ఎన్‌డిఎస్‌ఏ నివేదికపై ఎలాంటి వివరణా ఇవ్వలేదు. దీనికి కూడా వ్యూహం ఉందని తెలిసింది. చర్చలో జోక్యం చేసుకుంటే, అదీ దీర్ఘ కాలం కొనసాగుతుందనీ, అదే జరిగితే ఎన్నికల్లో తీవ్ర నష్టమే జరుగుతుందని బీఆర్‌ఎస్ ప్రభుత్వ భావిస్తున్నట్టుగా తెలిసింది. ఆ అంశాన్ని వదిలేయడమే మంచిదనే వైఖరితో ప్రభుత్వమున్నట్టు అధికారిక సమాచారం. దాదాపు 1.26 లక్షల కోట్లతో ప్రాజెక్టును కట్టిన గులాబీ సర్కారు, ఇప్పుడు దానిపై వస్తున్న ఆరోపణలు, విమర్శలపై నీళ్లు నములుతోంది. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో కాళేశ్వరం విపరతీమైన చర్చ ప్రారంభమైంది. అన్నీ రాజకీయపక్షాలు సర్కారును తప్పుబడుతున్నాయి. ఇంజినీర్లకే ఇంజినీర్ అని కేసీఆర్‌ను పొగిడిన వారంతా గప్‌చుప్ అయ్యారు. కేంద్ర జల సంఘం(సీడబ్లూసీ)కి, కేంద్ర ప్రభుత్వానికి ఎన్‌డిఎస్‌ఏ నివేదిక వెళ్లింది.

ఎన్నికల్లో పోటీ చేయం...

నవతెలంగాణ బ్యూరో-హైదరాబాద్

వైఎస్‌ఆర్‌టీపీ రాబోయే ఎన్నికల్లో పోటీ చేయబోదనీ, కాంగ్రెస్‌కు బేషరతుగా మద్దతు ప్రకటించనున్నట్టు వైఎస్‌ఆర్‌టీపీ అధ్యక్షులు వైఎస్ షర్మిల తెలిపారు. శుక్రవారం హైదరాబాద్‌లోని ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయంలో విలేకర్ల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉన్నదనీ, కేసీఆర్ అవినీతి పాలన అంతం కావాలంటే ప్రభుత్వ వ్యతిరేక ఓట్లు చీలకుండా ఉండాలని చెప్పారు. ప్రజల కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు చెప్పారు. కేసీఆర్‌కు తిరిగి అవకాశం ఇవ్వొద్దని పలువురు కాంగ్రెస్ నేతలు కోరారని తెలిపారు. వైఎస్‌ఆర్ నిర్మించిన పార్టీని ఓడించటం భావ్యం కాదని భావించినట్టు తెలిపారు. దేశంలో అతి పెద్ద సెక్యులర్ పార్టీ కాంగ్రెస్ అని తెలిపారు. పాలేరు నుంచి పోటీలో ఉండబోమని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ తిరిగి అధికారంలోకి వస్తే..అవినీతి పెచ్చరిల్లుతుందనీ, పేపర్‌లీకేజీలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు.

తొలి రోజు వంద నామినేషన్లు

టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డి తరఫున మాజీ ఎమ్మెల్యే గురునాథ్‌రెడ్డి ఎన్నికల రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఖమ్మం అసెంబ్లీ నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా తుమ్మల నాగేశ్వరరావు నామినేషన్ పత్రాలు సమర్పించారు. ఎక్కువగా స్వతంత్ర అభ్యర్థులు నామినేషన్లు వేశారు. నామినేషన్ల కేంద్రాల వద్ద సీఆర్పీఎఫ్ బలగాలతో పాటు పోలీసులు భారీ బందోబస్తు నిర్వహించారు. నామినేషన్లు వేసే అభ్యర్థులతో పాటు ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించారు.

హైదరాబాద్ గోషామహల్ నియోజకవర్గం కాంగ్రెస్ అభ్యర్థిగా మొగిలి సునీత నామినేషన్ దాఖలు వేశారు. ఉమ్మడి ఆదిలాబాద్‌లో ఎనిమిది నామినేషన్లు దాఖలయ్యాయి. నిర్మల్ నియోజకవర్గంలో బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి ఏలేటి మహేశ్వర్‌రెడ్డి రెండు సెట్ల నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారికి అందజేశారు. ముధోల్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి నారాయణరావు పటేల్, బెల్లంపల్లిలో బీజేపీ అభ్యర్థి అమురాజుల శ్రీదేవి నామినేషన్ దాఖలు చేశారు. చెన్నూర్‌లో ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ నుంచి సోగాల సంజీవ్, సిర్పూర్(టి) నుంచి కాంగ్రెస్ అభ్యర్థి రావి శ్రీనివాస్ నామినేషన్ పత్రాలు అందజేశారు.

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కొత్తగూడెం నియోజకవర్గంలో ఆజాద్ అధికార సేన పార్టీ బలపరుస్తున్న ఇమంది ఉదయ్ కుమార్ నామినేషన్ దాఖలు చేశారు. పాలేరు నియోజకవర్గ ఆమ్ ఆద్మీ పార్టీ అభ్యర్థిగా శ్రీ పసుపులేటి శ్రీనివాసరావు నామినేషన్ వేశారు.

ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొదటి రోజు 12 మంది అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. రంగారెడ్డిలో 7 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా.. వికారాబాద్ జిల్లాలో 5 మంది అభ్యర్థులు నామినేషన్లు వేశారు. కాంగ్రెస్ అభ్యర్థులు ఎక్కువగా నామినేషన్లు దాఖాలు చేశారు. వికారాబాద్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం ప్రసాద్‌కుమార్, శేరిలింగంపల్లి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్‌గౌడ్ నామినేషన్లు వేశారు.

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 11 నామినేషన్లు దాఖలయ్యాయి. వరంగల్ తూర్పులో బీజేపీ అభ్యర్థి ఎర్రబెల్లి ప్రదీప్‌రావు నామినేషన్ వేశారు. బీఆర్‌ఎస్ అభ్యర్థిగా 2 సెట్ల నామినేషన్ పత్రాలు అందజేశారు. బీజేపీ పార్టీ తరుపున భూపాలపల్లి నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థిగా చందుపట్ల కీర్తిరెడ్డి నామినేషన్ దాఖలు వేశారు. భూపాలపల్లి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గండ్ర సత్యనారాయణరావు తరపున ఆయన సతీమణి గణపురం జెడ్పీటీసీ గండ్ర పద్మ నామినేషన్ దాఖలు చేశారు. నర్సంపేట నియోజకవర్గం నుంచి ఎంసీపీఐ(యు) అభ్యర్థి పెద్దారపు రమేష్ నామినేషన్ దాఖలు చేశారు. ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా 15 నామినేషన్లు దాఖలు అయినట్టు రిటర్నింగ్ అధికారులు తెలిపారు.

లెఫ్ట్ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశం

- దెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీకి సీపీఐ, సీపీఐ(ఎం) పార్టీల హామీ

నవతెలంగాణ బ్యూరో - హైదరాబాద్



జర్నలిస్టుల ఇంటి స్థలాల కోసం కృషి చేస్తామని సీపీఐ, సీపీఐ(ఎం)లు హామీ ఇచ్చాయి. ఈ మేరకు శుక్రవారం సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఆ పార్టీ జాతీయ కార్యదర్శి నారాయణ, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడ వెంకటరెడ్డిలను డెక్కన్ జర్నలిస్ట్ హౌసింగ్ సొసైటీ (డీజేహెచ్ఎస్) అధ్యక్షులు బొల్లోజు రవి, ఉపాధ్యక్షులు మరిపాల శ్రీనివాస్, ట్రెజరర్ చిలుకూరు అయ్యప్ప, డైరెక్టర్లు దండ రామకృష్ణ, డేగ కుమార్ తదితరులు ఆ పార్టీల రాష్ట్ర కార్యాలయాల్లో వారిని వేరువేరుగా కలిశారు. జర్నలిస్టులకు ఇంటి స్థలాలు ఇచ్చే విషయంలో తాము సంపూర్ణ మద్దతు ప్రకటిస్తున్నామని తమ్మినేని, కూనంనేని తెలిపారు.

జర్నలిస్టుల ఇంటి స్థలాల అంశాన్ని తమ ఎన్నికల మేనిఫెస్టోల్లో పొందుపరుస్తామని హామీ ఇచ్చారు. తమ్మినేని అక్కడికక్కడే పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టో కమిటీలో చేర్చాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు టి.సాగర్‌కు సూచించడం విశేషం. ఈ సందర్భంగా డీజేహెచ్ఎస్ అధ్యక్షులు బొల్లోజు రవి మాట్లాడుతూ, జర్నలిస్టులకు ఇంటి స్థలం ఇవ్వడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు ప్రభుత్వం రూ. 10 లక్షల ఆర్థిక సాయం చేయాలనీ, ఆ మేరకు ఎన్నికల మ్యానిఫెస్టోల్లో పొందుపరచాలని కోరినట్టు తెలిపారు. ఎన్నికల నేపథ్యంలో పలు పార్టీలను కలిసి మ్యానిఫెస్టోల్లో జర్నలిస్టుల ఇండ్ల స్థలాల అంశం చేర్చాలని డీజేహెచ్ఎస్ కోరుతున్న సంగతి తెలిసిందే.

ఎంఐఎం తొలి జాబితా

నవతెలంగాణ బ్యూరో, హైదరాబాద్.

తెలంగాణ ఎన్నికల అభ్యర్థుల తొలి జాబితాను ఎంఐఎం విడుదల చేసింది. శుక్రవారం దారుసలాంలోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆ పార్టీ అధినేత అసదుద్దీన్ ఓవైసీ 6 స్థానాలకు అభ్యర్థులను ప్రకటించారు. మొత్తం 9 స్థానాల్లో పోటీ చేస్తున్నామని, సిట్టింగ్ స్థానమైన బహదూర్ పురాతో పాటు రాజేంద్ర నగర్, జూబ్లిహిల్స్ స్థానాల్లో అభ్యర్థులను త్వరలో ప్రకటిస్తామని వెల్లడించారు. పోటీ చేస్తున్న తొమ్మిది నియోజక వర్గాల్లో ఎంఐఎంకు పట్టం కట్టాలని ఆయన ఓటర్లను కోరారు. కేసీఆర్ పాలనలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉన్నారని,మరోసారి తెలంగాణలో ఎవ్వరి మద్దతు లేకుండా బీఆర్‌ఎస్ అధికారంలోకి వస్తుందని తెలిపారు.రాష్ట్ర వ్యాప్తంగా బీఆర్‌ఎస్‌కు మద్దతు ఇస్తున్నప్పటికి రాజేంద్రనగర్‌లో ప్రకాష్ గౌడ్ జూబ్లీహిల్స్‌లో మాగంటి గోపీనాథ్‌లను ఓడగొడతామని స్పష్టం చేశారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని పగటి కలలు కంటోందని విమర్శించారు. బీజేపీ బీసీ ముఖ్యమంత్రి ప్రకటన పెద్ద జోక్ అని కొట్టి పారేసారు. బాబ్రీ మసీద్ కూల్చివేత పాపంలో బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్‌తో పాటు కాంగ్రెస్ పాత్ర కూడా ఉందని సంచలన వ్యాఖ్యలు చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆరే నిజమైన సెక్యులర్ వాది అని కితాబు నిచ్చారు.సెక్రటేరియట్‌లో కూల్చిన మసీద్‌ను కేసీఆర్ సర్కార్ కొత్తగా నిర్మించి ముస్లింల మనోభావాలను కాపాడిందని గుర్తు చేశారు. ఇద్దరు సిట్టంగ్‌లకు మొండి చెయ్యిఎంఐఎం పార్టీ 2018లో పాగా వేసిన ఎడు సిట్టింగ్ స్థానాల్లో శుక్రవారం 6 స్థానాల అభ్యర్థులను ప్రకటించింది. ఇందులో ఇద్దరు సిట్టింగ్ ఎమ్మెల్యేలకు మొండి చెయ్యిచ్చింది. చార్మినార్ నుంచి గెలిచిన ముంతాజ్ ఖాన్, యాకత్ పురా నుంచి గెలిచిన పాషా ఖాద్రిలను వయోభారం దృష్ట్యా తప్పిస్తామని గతంలోనే ఎంఐఎం ప్రకటించింది. ఆ స్థానాల్లో మాజీ మేయర్ మాజిద్ హుస్సేన్, అక్బరుద్దీన్ కుటుంబం నుంచి కొడుకు లేదా కూతురికి అవకాశం కల్పించనున్నట్టు పార్టీ వెల్లడించింది. అయితే అనూహ్యంగా అక్బరుద్దీన్ కుటుంబం నుంచి కాకుండా మరో మాజీ మేయర్ జుల్ఫీకర్ అలీ అహ్మద్‌కు చార్మినార్ టికెట్ కేటాయించారు. సెకండ్ లిస్టులో ఓవైసీ కుటుంబం నుంచి ఒకరికి అవకాశం కల్పించేందుకే మరో సిట్టింగ్ స్థానమైన బహదూర్ పుర టికెట్‌ను ఆపినట్టు తెలుస్తోంది.

ప్రకటించిన అభ్యర్థుల వివరాలు

1). చార్మినార్- జుల్ఫెఖర్ అహ్మద్
2). చాంద్రాయణ గుట్ట - అక్బరుద్దీన్ ఓవైసీ
3). మలక్ పేట్ - అహ్మద్ బలాల
4). నాంపల్లి - మాజిద్ హుస్సేన్
5). కార్వాన్ - కౌజర్ మోహినుద్దిన్
6). యాకత్ పుర - జాఫర్ హుస్సేన్ మీరజ్

కేసీఆర్ పాలన కలల ప్రపంచాన్ని సృష్టించింది : భట్టి విక్రమార్క

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్

పదేండ్ల సీఎం పాలన కలల ప్రపంచాన్ని సృష్టించారని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఎద్దేవా చేశారు. ఆయన మోసపూరిత మాటలను నమ్మి దళిత, గిరిజనులు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. బలహీన వర్గాల ప్రజలను పట్టించుకోవడం లేదన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాష్ట్రంలో 92శాతం మంది దళిత, గిరిజన, మైనారిటీ బలహీన వర్గాలున్నాయని చెప్పారు. రాష్ట్రానికి మీరు ముఖ్యమంత్రి కావడానికి మొదటి దళిత ముఖ్యమంత్రి అంటూ కలల ప్రపంచం చూపించారని ఎద్దేవా చేశారు. 'దళితులకు మూడెకరాలు. దళిత బంధు అన్నారు. బడ్జెట్‌లో రూ.17,700 కోట్ల లెక్కలు చూపించారు. కనీసం రూ. 300 కోట్లు కూడా ఖర్చు చేయలేదు. ఆదిలాబాద్ జిల్లాలో రమాకాంత్ బోనాథ్‌కు దళిత బంధు రాక ఆత్మహత్య చేసుకున్నాడు. నా ఆత్మహత్య మీరే కారణామంటూ లేఖ రాసి చనిపోయారు. రాజ్యాధికారం కోసం ఎన్ని లక్షల మంది జీవితాలతో ఆడుకుంటారు' అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ధాన్యం కొనుగోలు ఎప్పుడు..?

- ఇప్పటికే 30శాతం మేర పూర్తయిన వరికోతలు
- ప్రారంభంకాని కొనుగోలు కేంద్రాలు
- దళారులు ఆశ్రయిస్తూ నష్టపోతున్న వైనం
- రికార్డు స్థాయిలో వానాకాలం సాగు

నవతెలంగాణ - తిమ్మాపూర్

ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా వరి కోతలు ఊపందుకోగా ధాన్యం కొనుగోలు కేంద్రాల ఏర్పాటులో తీవ్ర జాప్యం జరుగుతోంది. పంట చేతికొస్తున్నా కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు కల్లాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. సీజన్ ప్రారంభంలో వర్షాభావం, తరువాత అధికవర్షాలు సాగుపై ప్రతికూలంగా మారినా చివరి నాటికి అంచనా మేరకు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9.44లక్షల ఎకరాల్లో వరి సాగైంది. 18లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందనే అంచనాతో అధికారులు 1291 కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలు సిద్ధం చేశారు. ఇప్పటికే 30శాతం వరకు కోతలు పూర్తికాగా కేంద్రాలకు ధాన్యంతో వచ్చిన రైతులు కొనుగోళ్లు ప్రారంభంకపోవడంతో ఆందోళనకు గురవుతున్నారు. వాతావరణ పరిస్థితులు, మరోవైపు కదలని అధికారయంత్రాంగం తీరుతో రైతులు దళారులను ఆశ్రయిస్తున్నారు.



కేంద్రాల్లో ధాన్యం కుప్పలు..

ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 9,44,884 ఎకరాల్లో వరి సాగైంది. జిల్లాల వారీగా చూస్తే కరీంనగర్‌లో 2.66లక్షలు, పెద్దపల్లిలో 2.01లక్షలు, రాజన్నసిరిసిల్ల జిల్లాలో 1.74లక్షల ఎకరాల్లో సాగైంది. గతంలో సింగిల్ విండో, ఐకేపీ, డీసీఎంఎస్ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి ధాన్యం కొనుగోలు చేసేవారు. ఎన్నికల సమయం కావడంతో కొనుగోలు కేంద్రాల ప్రారంభంలో జాప్యం జరుగుతోంది.

ఇప్పటికే కోతలు ప్రారంభమై 20రోజులు కావస్తుండగా 25నుంచి 30శాతం పూర్తయ్యాయి. ఏ-గ్రేడ్ ధాన్యానికి ప్రభుత్వం రూ.2203 మద్దతు ధర ప్రకటించింది. కానీ కోతలు పూర్తయి ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తీసుకొచ్చి కుప్పల వద్ద రైతులు పడిగాపులు కాస్తున్నారు. ఇదే అదనుగా దళారులు ధాన్యం కొనుగోళ్లు చేపడతున్నారు. ఎన్నికలపై ఉన్న శ్రద్ధ రైతుల కొనుగోలు కేంద్రాలపై లేదని రైతులు అధికారులపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మానకొండూర్ నియోజకవర్గంలో పరిస్థితిని పరిశీలించగా ఇప్పటికే రైతులు 30శాతం మేర ధాన్యం కొనుగోలు కేంద్రాలకు తరలించినట్టు తెలిసింది. ఇదే పరిస్థితి ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా కనిపిస్తోంది.

కొనుగోలు కేంద్రాలను తక్షణమే ప్రారంభించాలి

కొనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలతో పాటు ముందు జాగ్రత్తలు తీసుకోవాలి. వరికోతలు ప్రారంభమై 20రోజులు గడుస్తున్నాయి. కొనుగోలు కేంద్రాల వద్ద ధాన్యం రాశులు పోసి రైతులు పడిగాపులు కాస్తున్నారు. రైతులు కోతలు షురూ చేసి, కోసిన ధాన్యం ఆరోబోసే పరిస్థితులు లేక ఇబ్బందులు పడుతున్నారు. ఒకవేళ వాతావరణం సహకరించకపోతే వర్షాలతో తమకు నష్టం కలుగుతుందని ఆందోళన చెందుతున్నారు. దాంతో వారం రోజులుగా.. క్వింటల్ రూ.1900 చొప్పున దళారులకు అమ్ముకొని నష్టపోతున్నారు. రైతుల కష్టం దళారుల పాలు కాకుండా ప్రభుత్వం స్పందించి కొనుగోలు కేంద్రాలను ప్రారంభించాలి.

మాతంగి శంకర్, వ్య.క.స జిల్లా ఉపాధ్యక్షులు

రైతులను పట్టించుకునే వారు లేదు

కోసిన వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రానికి తరలించి అక్కడే ఆరబోస్తూ పడిగాపులు కాస్తున్న. కొనుగోలు సెంటర్లను పట్టించుకునే అధికారులు కానీ ప్రజాప్రతినిధులు కానీ లేరు. వారికి ఎంతసేపు ఎలక్షన్లపైనే ప్రత్యేక శ్రద్ధ ఉంది. ఇప్పటికే దళారులు గ్రామంలో సగంకుపైగా ధాన్యాన్ని రూ.1900కే కొనుగోలు చేస్తూ సంచికిలా, మట్టికిలా అంటూ మోసం చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు సెంటర్లు ఉంటయో.. ఉండవో.. అని దళారులకు వడ్లు అమ్ముతున్నం.

చిలుకూరి బాలయ్య, రైతు, తిమ్మాపూర్

మేడిగడ్డ కుంగింది.. పాపాల పుట్ట పగిలింది

నవతెలంగాణబ్యూరో-హైదరాబాద్


నీళ్ల, నిధులు, నియామకాల కోసం పోరాటం చేశామని టీపీసీసీ అధ్యక్షులు, ఎంపీ ఎనుముల రేవంత్‌రెడ్డి గుర్తు చేశారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను నెరవేర్చేందుకు సోనియాగాంధీ అణుబాంబు లాంటి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. స్వేచ్ఛ, సామాజిక న్యాయం, సమాన అభివృద్ధి కోరుకున్నారని తెలిపారు. ఒక వ్యక్తి పాదాల కింద తెలంగాణ సమాజం నలిగిపోవడం సహించలేమన్నారు. తెలంగాణ రాష్ట్ర యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్స్ (టీయూడబ్ల్యూజే) ఆధ్వర్యంలో హైదరాబాద్ బషీర్‌బాగ్ ప్రెస్ క్లబ్‌లో శుక్రవారం నిర్వహించిన 'మీట్ ది ప్రెస్' రేవంత్ మాట్లాడారు. ఈ కార్యక్రమానికి సీనియర్ సంపాదకులు కె రామచంద్రమూర్తి సమన్వయకర్తగా వ్యవహరించారు. ప్రజాపక్షం సంపాదకులు కె శ్రీనివాసరెడ్డి, విరాహత్ తదితరులు ఉన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్‌ఎస్ పాలనలో నీళ్ల, నిధులు నియామకాలు సాధించుకున్నామా? ఒకసారి ఆలోచన చేయాలని రేవంత్‌రెడ్డి ప్రజలకు విజ్ఞప్తి చేశారు. కేసీఆర్ ఎప్పుడూ చెప్పే మాట. మట్టికి పోయిన ఇంటోడు పోవాలని అంటాడు. ఆయన చెప్పినవి ఏవి వచ్చాయి. రాచరిక పోకడలు కనిపించేలా సర్కార్ ముద్ర ఉంది. త్యాగాలు గుర్తు చేసేలా ఉండాలి కానీ అలా లేదు. ఉద్యమంలో టీజీ అని రాసుకుంటే, కేసీఆర్ వచ్చాక టీఆర్‌ఎస్ కనిపించేలా టీఎస్ రాసిండు. తెలంగాణ తల్లి కూడా భుజకీర్తులతో కనిపిస్తుంది' అన్నారు. 'కమ్యూనిస్టులు మాకు సహజసిద్ధ మిత్రులు. చర్చల కోసం సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో కమిటీ వేశాం. ఆ కమిటీ సమన్వయం చేస్తున్నది.నిర్దిష్టమైన నిర్ణయం వెలువడగానే మీతో పంచుకుంటాం.ఆ ప్రక్రియ ముగియలేదు. చర్చలు కొనసాగుతున్నాయి' అని ఆయన వెల్లడించారు.

రైతులకు ఎకరానికి ఏటా రూ. 10వేలు ఇస్తామని 2014లోనే కాంగ్రెస్ మ్యానిఫెస్టోలో పెట్టింది. దాన్నే కాపీ కొట్టి కేసీఆర్ రైతు బంధు పేరుతో ఇస్తున్నారని తెలిపారు. ఓడిపోవడంతో ఆ విషయాన్ని చెప్పుకోలేక పోయామనీ, అధికారంలోకి వస్తే అమలు చేసే ఉండేవారమని పేర్కొన్నారు. 'నియంత కంటే ఎక్కువగా ఉంది కేసీఆర్ పాలన. కేసీఆర్ నియంత కాదు క్రిమినల్ పొలిటిషియన్. కోట్లాడి సాధించుకున్న రాష్ట్రంలో ఏం జరుగుతుందో అర్థం కావడం లేదు. కర్నాటకలో కాంగ్రెస్ గెలవడం ద్రోహం, నేరం అంటున్నారనీ, మరి బీజేపీ గెలవాలా?' అని ప్రశ్నించారు. మూసీ ప్రక్షాళన, అంతర్జాతీయ ప్రమాణాలతో రోడ్లు, రాచకొండ గుట్ట పర్యాటక ప్రాంతంగా తీర్చిదిద్దే ప్రణాళికలున్నాయని తెలిపారు. అర్బన్, సెమీ అర్బన్, రూరల్ హైదరాబాద్‌కు కనెక్టివిటీ ఇవ్వనున్నామన్నారు.సీఎం జర్నలిస్టులను కూడా ఆగం చేశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. జర్నలిస్టుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామన్నారు. మేడిగడ్డ స్తంభం మూడు అడుగుల మేర కుంగిపోయిందన్నారు . పిల్లర్ దిగువన ఇసుక ఉందన్న విషయం నీటిపారుదల శాఖ ఇంజినీర్లకు తెలియదా? అని ప్రశ్నించారు. పిల్లర్లు కుంగాయి కాబట్టే మేడిగడ్డ బ్యారేజీ జాయింట్‌లో గ్యాప్ పెరిగిందన్నారు. కేసీఆర్ పాపాల వల్లే మేడిగడ్డ బ్యారేజీ కుంగిపోయిందన్నారు. కేసీఆర్ తన లోపాలను కప్పిపుచ్చుకునేందుకే పక్క రాష్ట్రాల అంశాన్ని తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ దశాబ్ద పాలన-బీఆర్‌ఎస్ దశాబ్ద పాలనపై చర్చకు సిద్ధం..మా పార్టీ నుంచి నేను, సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వస్తాం... మిగతా. పార్టీల నుంచి ఇద్దరు చొప్పున రండి..చర్చ పెడితే పాలకు పాలు, నీళ్లకు నీళ్లు బయట పడతాయని సవాల్ విసిరారు. అసెంబ్లీ ఎన్నికల్లో చుక్క మందు, డబ్బు లేకుండా వెళదామని బీఆర్‌ఎస్ పార్టీతో సహా ఇతర పార్టీలను రేవంత్ రెడ్డి కోరారు. విధివిధానాలపై ఈ ఎన్నికల్లో ప్రజల్లోకి వెళదామని తెలిపారు. ధరణి రద్దు చేస్తామంటే, కేసీఆర్‌కు ఎందుకంత దుఃఖం? అని ఎద్దేవా చేశారు. '2018లో తెలంగాణ సెంటిమెంటును నిద్రలేపి కేసీఆర్ రాజకీయంగా లాభం పొందారు. 2018లో చంద్రబాబు రూపంలో కేసీఆర్ కు అవకాశం దొరికింది. కానీ పదేండ్లలో కేసీఆర్ గుడ్ విల్ జీరోకు చేరింది' అన్నారు. బీజేపీ, ఎంఐఎం బీఆర్‌ఎస్ కూటమి ఒక వైపు, కాంగ్రెస్, కోదండరాం, కలిసివస్తే కమ్యూనిస్టులు, ప్రజా సంఘాల మావైపు ఉన్నాయన్నారు. వందశాతం ప్రజలు ఈ ఎన్నికల్లో కేసీఆర్‌ను ఓడించి తీరతారని చెప్పారు.

కేటీఆర్ కు రేవంత్ రెడ్డి కౌంటర్

'నేను కందిపప్పు లాంటివాన్ని.. కందిపప్పు ఆరోగ్యానికి మంచిది. మా కొడంగల్, తాండూరు ప్రాంతాల్లో కంది పప్పుకు మంచి పేరుంది. అందుకే నేను కందిపప్పు. కానీ మంత్రి కేటీఆర్ గన్నేరు పప్పు లాంటివారు. తింటే చస్తారు. ఆరోగ్యం బాగుండాలంటే కందిపప్పు, ముద్దపప్పును తీసుకోండి.. గన్నేరు పప్పును కాదు' అని రేవంత్ రెడ్డి మంత్రి కేటీఆర్‌పై సెటైర్ వేశారు.

పారదర్శకత ఎక్కడ?



- ఎన్నికల బాండ్ల పథకంలో అంతా గోప్యతే
- ఆర్‌బీఐ, ఈసీ అభ్యంతరాలు బేఖాతరు

నిబంధనలకు తూట్లు

న్యూఢిల్లీ : దేశంలో రాజకీయ వ్యవస్థను పూర్తిగా ప్రక్షాళన చేస్తానని బీజేపీ ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. పార్టీలకు అందే విరాళాల విషయంలో పారదర్శకత ఉండాలని, నల్లధనాన్ని పూర్తిగా రూపుమాపాలని సుద్దులు చెప్పింది. అయితే ప్రభుత్వ పనితీరు 'మాటలు ఘనం...చేతలు శూన్యం' అన్న చందంగా తయారైంది. ఆదాయపన్ను చట్టం, కంపెనీల చట్టం, ఆర్‌బీఐ చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టానికి తిరోగమన సవరణలు తీసుకొచ్చి ఎన్నికల బాండ్లను ప్రవేశపెట్టింది. ఈ పథకంలో రాజకీయ పార్టీలకు విరాళాలు అందించే వారు తమ వివరాలు వెల్లడించాల్సిన అవసరం లేదు. వారు ఎలాంటి పరిమితులు లేకుండా నిధులు అందించవచ్చు. మోడీ ప్రభుత్వ దృష్టిలో ఇదే పారదర్శకత. నల్లధనాన్ని నిర్మూలించే విధానం.

అసలు ఎన్నికల బాండ్ల పథకం అంటే ఏమిటి? ఈ బాండ్లను ప్రామిసరీ నోటు తరహాలో జారీ చేస్తారు. దీనిని దేశంలోని ఏ పౌరుడైనా, ఏ కంపెనీ అయినా కొనుగోలు చేయవచ్చు. అలా కొనుగోలు చేసిన వారు ఆ బాండ్లను తనకు నచ్చిన పార్టీకి అందజేయవచ్చు. ఆయా రాజకీయ పార్టీలు ఆ బాండ్లు ఇచ్చిన వారి పేర్లను బయటపెట్టాల్సిన అవసరం లేదు. ఎన్నికల కమిషన్‌కు కానీ, చివరికి ఆదాయపన్ను శాఖకు కానీ వెల్లడించాల్సిన పని లేదు. ఒక్క మాటలో చెప్పాలంటే ఇది పార్టీలకు వరదలా అందే అజ్ఞాత విరాళాల ప్రవాహానికి తలుపులు బార్లా తెరవడమే అవుతుంది. అసలు విరాళం ఎవరు ఇస్తున్నారు, ఏవైనా కార్పొరేట్ సంస్థలు నిధులు ఇస్తున్నాయా, క్విడ్‌ప్రోకో జరుగుతోందా అనే వివరాలు తెలుసుకునే అవకాశం ఓటర్లకు అసలు ఉండనే ఉండదు.

అడుగడుగునా ఉల్లంఘన

ఎన్నికల బాండ్ల పథకం ముసాయిదాను ముందుగా బహిర్గతం చేయకపోవడం నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. ముసాయిదాను అందజేయకుండానే రాజకీయ పార్టీల అభిప్రాయాన్ని కోరారు. దీనిపై కొన్ని పార్టీలు అభ్యంతరం తెలిపాయి. ఆర్‌టీఐ చట్టం ద్వారా సేకరించిన రికార్డులను పరిశీలిస్తే ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టే ముందు ప్రభుత్వం సంప్రదింపుల ప్రక్రియను చేపట్టలేదని తేటతెల్లమవుతోంది. ఇప్పటి వరకూ రూ.13,500 కోట్ల విలువైన బాండ్లను విక్రయించారు.

ఆర్‌బీఐ వద్దన్నా...

ఎన్నికల బాండ్ల విషయంలో రిజర్వ్‌బ్యాంక్, కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ మధ్య జరిగిన ఉత్తర ప్రత్యుత్తరాలను సమాచార హక్కు చట్టం ద్వారా తెలుసుకోవడం జరిగింది. ఎన్నికల బాండ్ల జారీ మనీ లాండరింగ్ నిరోధక చట్ట నిబంధనలను ఉల్లంఘించడమేనని కేంద్రాన్ని ఆర్‌బీఐ హెచ్చరించింది. ఇది చాలా ప్రమాదకరమైన పరిణామమని తెలిపింది. అయితే ఆర్‌బీఐ అభ్యంతరాలను ఆర్థిక శాఖ తోసిపుచ్చింది.

ఆర్‌బీఐ రెండు రోజుల వ్యవధిలోనే సమాధానం ఇచ్చినప్పటికీ సమయం మించిపోయిందని, ద్రవ్య బిల్లును అప్పటికే ముద్రించడం జరిగిందని సాకులు చెప్పింది. బిల్లును ఖరారు చేసిన తర్వాతే ఏదో లాంఛనప్రాయంగా ఆర్‌బీఐ అభిప్రాయం కోరినట్లు కన్పిస్తోంది. 2017వ సంవత్సరపు ఆర్థిక చట్టం ద్వారా నాలుగు చట్టాలకు (ఆదాయపన్ను చట్టం, కంపెనీల చట్టం, ఆర్‌బీఐ చట్టం, ప్రజా ప్రాతినిధ్య చట్టం) కేంద్రం సవరణలు చేసిన తర్వాత కూడా ఎన్నికల బాండ్ల పథకంపై ఆర్‌బీఐ గవర్నర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. వాటిని తేలికగా దుర్వినియోగం చేయవచ్చునని తెలిపారు.

ఎన్నికల కమిషన్ కూడా...

ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టేందుకు వీలుగా చేసిన చట్ట సవరణలను ఎన్నికల కమిషన్ కూడా వ్యతిరేకించింది.

రాజకీయ పార్టీలకు అందే విరాళాలలో పారదర్శకత లోపిస్తుందని, రాజకీయ పార్టీలకు నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విరాళాలు అందుతున్నాయా లేదా అనే విషయాన్ని తెలుసుకోవడం తమకు అసాధ్యమవుతుందని తెలిపింది. కంపెనీల చట్టానికి చేసిన సవరణలు షెల్ కంపెనీల ఏర్పాటుకు మార్గం సుగమం చేస్తాయని హెచ్చరించింది. నల్లధనం ప్రవాహం పెరుగుతుందని, అది షెల్ కంపెనీల ద్వారా పార్టీలకు చేరుతుందని ఆందోళన వ్యక్తం చేసింది.

కార్పొరేట్ కబంధహస్తాల్లో దేశం..



విశాల ఐక్య ఉద్యమాలతో కాపాడుకోవాలి : బీకేయంయూ

జాతీయ మహాసభల్లో బి. వెంకట్ పిలుపు

పాట్నా : కార్పొరేట్, మతోన్మాదుల కబంధహస్తాల నుంచి దేశాన్ని రక్షించాలంటే విశాల ఐక్య ఉద్యమాలు తప్ప మరో మార్గం లేదని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి బి వెంకట్ అన్నారు. బీకేయంయూ జాతీయ మహాసభలు బీహార్ రాజధాని పాట్నాలో జరుగుతున్నాయి. ఈ మహాసభల్లో శుక్రవారం పాల్గొన్న ఆయన సౌహార్ద సందేశమిచ్చారు. అంబానీ ఆదానీ లాంటి కార్పొరేట్లకు మన వ్యవసాయ రంగాన్ని, సహజ వనరులను, దేశ సంపదను అప్పగించే విధంగా మోడీ ప్రభుత్వం వ్యవహరిస్తున్నదని విమర్శించారు. దేశ ప్రజలు అనేక త్యాగాలతో సాధించుకున్న హక్కులు, చట్టాలను మోడీ ప్రభుత్వం దుర్మార్గంగా కాలరాస్తున్నదన్నారు. ప్రజా సంపద ప్రజలకే చెందాలని, సమానత్వం, సామాజిక న్యాయం, కుల నిర్మూలన, లౌకికతత్వం లాంటి ఉన్నత లక్ష్యాల కోసం జాతీయోద్యమం సాగిందని గుర్తు చేశారు. ఆనాడు జాతీయ ఉద్యమంలో అణుమాత్రం అడుగుపెట్టని బీజేపీ బ్రిటిష్ సామ్రాజ్యవాదులకు, దేశంలోని జమిందారులు, జాగీర్దార్లకు తొత్తుగా వ్యవహరించిందని గుర్తుచేశారు. స్వాతంత్ర్యానంతరం నిర్వహించిన ఉద్యమాలతో దున్నేవానికి భూమి, ఉపాధి హామీ, ప్రజా పంపిణీ వ్యవస్థ, కనీస వేతనాలు లాంటి చట్టాలను సాధించుకున్నామని తెలిపారు. పోరాడి సాధించుకున్న చట్టాలు, హక్కులను మోడీ ప్రభుత్వం కాలరాస్తున్నదని విమర్శించారు. దళితులు గిరిజనులు, మహిళలు మైనారిటీలపై అనాగరికమైన దాడులను బీజేపీ ప్రోత్సహిస్తున్నదని విమర్శించారు. హత్రాస్, ఉన్నావ్, మణిపూర్ లాంటి ఘటనలు బీజేపీ అరాచకాలకు చిన్న ఉదాహరణలు మాత్రమే అని ఆయన అన్నారు. ప్రజా సంపదను కార్పొరేట్లకు కట్టబెట్టే గుజరాత్ మోడల్ దేశానికి అరిష్టమని ఆయన అన్నారు. దేశానికి నేడు కేరళ మోడల్ ఆదర్శమని ఆయన వివరించారు. కార్మిక కర్షక కష్టజీవులకు అండగా ఆ ప్రభుత్వం చేస్తున్న చట్టాలను, పథకాలను దేశవ్యాప్తంగా సాధించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. గ్రామీణ పేదలను ఏకం చేసేందుకు బీకేఎంయు, ఏఐఏడబ్ల్యూయూ సమైక్యంగా ఉద్యమాలు సాగించాలని పిలుపునిచ్చారు.

రూ.4 లక్షలు డిమాండ్ చేసి ఏసీబీకి చిక్కిన ఎస్సై

నవతెలంగాణ-ప్రత్యేక ప్రతినిధి :

ఒక కేసులో నిందితులపై అనుకూలంగా చార్జిషీటు వేయటానికి గానూ రూ.4 లక్షలు డిమాండ్ చేసిన పోలీసు సబ్‌ఇన్‌స్పెక్టర్‌ను అవినీతి నిరోధక శాఖాధికారులు శుక్రవారం అరెస్టు చేశారు. ఏసీబీ డైరెక్టర్ జనరల్ రవిగుప్తా తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట సబ్‌ఇన్‌స్పెక్టర్ జి.పురుషోత్తం ఈ ఏడాది జులైలో హైదరాబాద్‌కు చెందిన గజ్జె రమేశ్‌తో సహా మొత్తం 9 మందిపై ఒక ఘటనకు సంబంధించి కేసును నమోదు చేశారు. కాగా, నిందితుడిపై కేసు నీరుగార్చి చార్జిషీటు వేయటానికి గానూ రూ.4 లక్షలను గతనెల 19న డిమాండ్ చేశాడు. అంతగా తాము ఇచ్చుకోలేమని బాధితుడు ప్రాధేయపడగా లంచాన్ని రూ. 2 లక్షలకు ఎస్సై కుదించాడు. మొదట రూ.1 లక్ష ఇవ్వాలనీ, కోర్టులో చార్జీషీటు వేశాక మరో రూ.1 లక్ష ఇవ్వాలని బేరం కుదుర్చుకున్నాడు. అంతేగాక, తన లంచం డబ్బులు ఇవ్వాలంటూ నిందితులను ఫోన్‌లో, వీడియో కాల్‌లో వేధించాడు. ఈ విషయమై నిందితులలో ఒకడైన గజ్జె రమేశ్.. ఏసీబీకి ఫిర్యాదు చేయగా దానిపై దృష్టి సారించిన అధికారులు ఎస్సై పురుషోత్తంపై క్రిమినల్ మిస్ కండక్ట్ కింద కేసు నమోదు చేసి అరెస్టు చేశారు. అనంతరం నిందితుడిని ఏసీబీ ప్రత్యేక కోర్టులో హాజరుపర్చి జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించారు. లంచాల కోసం పోలీసు శాఖలో ఎవరు డిమాండ్ చేసినా తమకు సమాచారమివ్వాలని ఏసీబీ డైరెక్టర్ జనరల్ రవిగుప్తా ఈ సందర్భంగా ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

అలహాబాద్ చీఫ్ జస్టిస్ ఆదేశాల్లో జోక్యం చేసుకోలేం

జ్ఞానవాపి కేసులో సుప్రీం తిరస్కృతి

న్యూఢిల్లీ : అలహాబాద్ చీఫ్ జస్టిస్ ఆదేశాల్లో జోక్యం చేసుకునేందుకు సుప్రీం కోర్టు తిరస్కరించింది. జ్ఞానవాపి మసీదు ఆవరణపై హిందువులు చేస్తున్న వాదనలకు సంబంధించిన పిటిషన్లను వాటిని విచారిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి నుండి ఉపసంహరించాలంటూ అలహాబాద్ హైకోర్టు చీఫ్ జస్టిస్ ప్రీతింకర్ దివాకర్ జారీ చేసిన ఆదేశాలకు వ్యతిరేకంగా అప్పీల్ దాఖలైంది. ఆ అప్పీల్ విషయంలో జోక్యం చేసుకోవడానికి సుప్రీం శుక్రవారం తిరస్కరించింది. ఆగస్టులో దివాకర్ జారీ చేసిన ఆదేశాల విషయంలో తాము జోక్యం చేసుకోబోమంటూ కొన్ని విషయాలను హైకోర్టు చీఫ్ జస్టిస్ పరిధిలో వుంచాలని ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ వ్యాఖ్యానించారు. దివాకర్ ఆదేశాలకు వ్యతిరేకంగా మసీదు మేనేజ్‌మెంట్ అంజుమన్ ఇంతాజ్‌మియా మసీద్ స్పెషల్ లీవ్ పిటిషన్‌ను దాఖలు చేసింది. ఏకసభ్య ధర్మాసనం నుండి కేసును ఉపసంహరించడం వాస్తవానికి న్యాయ క్రమాన్ని దుర్వినియోగం చేయడమేనని మసీదు మేనేజ్‌మెంట్ తరపున సీనియర్ న్యాయవాది హుఫీజా అహ్మది వ్యాఖ్యానించారు. 2021 నుండి జస్టిస్ పాడియా ఈ కేసును విస్తృతంగా విచారించారని, ఈ కేసులో తీర్పును రిజర్వ్ చేసిన వాస్తవాన్ని కూడా పరిగణనలోకి తీసుకోవాలని అహ్మదికోరారు. అయినా ఆయన వాదనతో చంద్రచూడ్ ఏకీభవించలేదు. హైకోర్టు చీఫ్ జస్టిస్ అధికారాల్లో జోక్యం చేసుకోబోమని స్పష్టం చేశారు.

ఎన్నికల బాండ్ల పథకంతో అవినీతి ముప్పు

పీఎంఎల్ఏ నిబంధనలకు విరుద్ధం

- గ్లోబల్ ఎన్‌పీఓ కొయిలేషన్ నివేదిక వెల్లడి
- ఎఫ్ఏటీఎఫ్ చట్రపరిధిలోకి తీసుకురావాలని సూచన

ముంబయి : మనీ లాండరింగ్ నిరోధక చట్టానికి (పిఎంఎల్ఎ) పూర్తి విరుద్ధంగా వున్న ఎన్నికల బాండ్లపథకం పాలక పార్టీకి అనుకూలంగా వ్యవహరిస్తోందని గ్లోబల్ ఎన్‌పిఓ కొయిలేషన్ తన ఇటీవలి నివేదికలో పేర్కొంది. ఆర్థిక కార్యకలాపాల టాస్క్ ఫోర్స్ (ఎఫ్ఎటిఎఫ్) చట్రపరిధిలో ఎన్నికల బాండ్ల పథకాన్ని చేర్చాలని కోరింది. పేరులేకుండా వెలువడే ఈ ఎన్నికల బాండ్ల స్వభావంతో మనీ లాండరింగ్‌కు, అవినీతికి కావాల్సినంత అవకాశం వుందని పేర్కొంది. దానితో పాటూ పాలక పార్టీకి అనుకూలంగా జరిగేవి తెలుసుకునే పౌరుల రాజ్యాంగ హక్కును కూడా ఉల్లంఘిస్తోందని పేర్కొంది.

ప్రజాస్వామ్యానికి ఈ ఎన్నికల బాండ్ల పథకం కలిగించే సంక్లిష్ట ముప్పును ఈ నివేదిక నిశితంగా వివరించింది. ఈ బాండ్లపై సుప్రీంకోర్టు విచారణ గత మూడు రోజులుగా సాగుతున్న నేపథ్యంలో కొయిలేషన్ నివేదిక వెలువడింది. కాగా సుప్రీంతః అంశంపై విచారణ పూర్తి చేసిన అనంతరం తన తీర్పును రిజర్వ్ చేసుకుంది.

ఎన్నికల బాండ్ల పథకం కేవలం పారదర్శకంగా లేకపోవడమే కాదు, చట్టబద్ధమైన మార్గాల ద్వారా మనీ లాండరింగ్‌కు గేట్లు తెరుస్తోందని గ్లోబల్ కొయిలేషన్ తన నివేదికలో పేర్కొంది. పైగా ఈ పథకంలో విరాళాలు ఇచ్చేవారి పేర్లు వెల్లడించకపోయే స్వభావంతో అనుమానాస్పదమైన, నిరవధికమైన విరాళాలకు దారి తీస్తోందని ఆ నివేదిక వాదిస్తోంది.

ఇటువంటి విరాళాలను గుర్తించడం కష్టసాధ్యమవుతుందని పేర్కొంది. 2017లో భారత రిజర్వ్ బ్యాంక్ చెప్పిందే ఇప్పుడు కొయిలేషన్ కూడా పునరుద్ఘాటించింది. ఎన్నికల బాండ్ల పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని ఆర్‌బిఐ తీవ్రంగా వ్యతిరేకించింది. తన అభ్యంతరం చెబుతూ కేంద్ర ఆర్థికత శాఖకు లేఖ కూడా రాసింది. బాండ్లు కొనుగోలు చేసిన వ్యక్తులు, సంస్థల పేర్లు వెల్లడించకపోవడం వల్ల పిఎంఎల్ఎ నిబంధనల స్ఫూర్తిని దెబ్బతీస్తున్నాయని పేర్కొంది.

ఎన్నికలే... ఎన్నికలు



వచ్చే ఏనిమిది నెలలపాటు బిజీబిజీ

- అసెంబ్లీ నుంచి స్థానిక సంస్థల దాకా...
- అధికారులు, రాజకీయ నాయకుల హడావిడి

నవతెలంగాణ ప్రత్యేక ప్రతినిధి-హైదరాబాద్

రాష్ట్రం వచ్చే ఏనిమిది నెలలపాటు కోలాహలంగా మారనుంది. ప్రతినెలా ఏదో ఒక విశేషంతో ముందుకు సాగనుంది. ప్రజలు, అధికారులు, రాజకీయ నాయకులు క్షణం తీరిక లేకుండా గడపనున్నారు. సాధారణ పండుగల ద్వారా అతి పెద్ద పండుగ ఏదైనా ఉందీ అంటే అది ఎన్నికల పండుగలే. వచ్చేకాలంలో దీపావళి, సంక్రాంతి పండుగలు ఎలాగూ వస్తాయి. అలాగే వాటితోపాటు ఎన్నికల పండుగలు వస్తున్నాయి. గురువారం అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ రాకతో రాష్ట్రంలోని రాజకీయ వాతావరణం సాంతం మారిపోయింది. రాజకీపార్టీల ప్రచారం హోరెత్తుతున్నది. గ్రామాలు, పట్టణాలు, నగరాలు ఎక్కడ చూసినా ఆ హడావిడే. అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణ కార్యక్రమం సైతం ప్రారంభమైంది. అలాగే అధికార వ్యవస్థ సైతం పూర్తిగా ఎన్నికల విధుల్లో నిమగ్నమయింది. ఏ ప్రభుత్వ శాఖను పరిశీలించినా, ఏ రాజకీయ పార్టీ కార్యాలయాన్ని పరిశీలించినా ఎన్నికల గురించే చర్చే. ఎవరు గెలుస్తారు, ఏ ప్రభుత్వం రానుంది, ఏ అభ్యర్థికి ఎంత మెజారిటీ వస్తుందనే అంశాలపై చర్చోపచర్చలూ సాధారణమే. శాసనసభ ఎన్నికలు మొదలు స్థానిక సంస్థల ఎన్నికల వరకు రాష్ట్రమంతా సందడిగా మారనుంది. గత అక్టోబరులో ప్రారంభమైన ఈ సందడి, ఈ నెలలో క్లైమాక్స్‌కు వచ్చేసినట్టే. ఈ నవంబరు నుంచి వచ్చే ఏడాది 2024 జూన్ వరకు ఆ ఎన్నికల కోలాహలం కొనసాగనుంది. ఈ నెలలో మొత్తం అసెంబ్లీ ఎన్నికల హడావిడే కనిపించనుంది. 119 శాసనసభాస్థానాలకు ఈ నెల 30న పోలింగ్ జరిగి, డిసెంబరు మూడున ఫలితాలు వచ్చేవరకు ఇదేరకమైన పరిస్థితి ఉండనుంది. డిసెంబరు రెండు లేదా మూడో వారంలో రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం కొలువుతీరనుంది. కొత్త సంవత్సరం 2024లో గ్రామపంచాయతీల ఎన్నికలు జరగనున్నాయి. స్థానిక సంస్థలకు చెందిన సర్పంచుల ఎన్నికలు ముందుకువస్తాయి. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల సంఘం సన్నాహాలు చేస్తున్నట్టు సమాచారం. అనంతరం రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం బడ్జెట్ ప్రవేశపెట్టే సన్నాహాల్లో ఉంటుంది. బడ్జెట్‌కు సంబంధించిన వ్యవహారాలు ఎలా ఉంటాయో అందరికీ తెలిసిందే. శాఖల ప్రతిపాదనలు, చర్చలు, క్యాబినెట్ సమావేశం అనంతర పరిణామాలు చాలానే ఉంటాయి. ఆ తర్వాత అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు జరగనున్నాయి. 2024 ఫిబ్రవరిలో ఓటాన్ అక్కౌంట్ బడ్జెట్‌ను కొత్త సర్కారు ప్రవేశపెట్టనుంది. ఇకపోతే వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్‌లో పార్లమెంటు ఎన్నికలు సైతం జరగనున్నాయి. 17 లోక్‌సభ నియోజకవర్గాలకు ఎన్నికలు చేపట్టనున్నారు. దేశవ్యాప్తంగా సార్వత్రిక ఎన్నికల సందడి కొనసాగనుంది. ఢిల్లీలోనూ నయా సర్కారు రానుంది. ఇదిలావుంటే, జూన్‌లో మళ్లీ స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు రంగం సిద్ధం చేయనున్నారు. ఈమారు మండల పరిషత్తు, జిల్లా పరిషత్తులకు నిర్వహిస్తారు. దీంతో రాష్ట్రంలో ఎన్నికల హడావిడి ముగియనుంది. ఇన్ని రకాల పనులతో ప్రభుత్వ, రాజకీయ వ్యవస్థలు క్షణం తీరికలేకుండా గడపనున్నాయి.

ఇజ్రాయిల్‌తో యుద్ధ విస్తరణపై ఇరాన్ నిరాసక్తత : సీఎన్ఎన్

న్యూయార్క్ : ఇజ్రాయిల్ పొరుగు దేశాల్లోని మిలిటెంట్ గ్రూపులతో ఇరాన్‌కు స్నేహ సంబంధాలున్నాయనేది అందరికీ తెలిసిందే. అయితే ఇజ్రాయిల్‌ను ప్రతిఘటించటాన్ని పూర్తి స్థాయి యుద్ధంగా మారకుండా జాగ్రత్తపడుతున్నట్టుగా అనిపిస్తోందని సీఎన్ఎన్ వ్యాఖ్యానించింది. లెబనాన్ స్థావరంగా ఇజ్రాయిల్ పైన తరచుగా దాడులు చేస్తున్న హెజ్బొల్లా మిలీషియాను, ఇతర మిత్ర గ్రూపులను పూర్తిస్థాయిలో నియంత్రించే స్థితిలో ఇరాన్ లేదని సీఎన్ఎన్ ఇంటర్వ్యూ చేసిన అమెరికన్ అధికారులు అన్నట్టు ఆ వార్తాసంస్థ పేర్కొంది. హెజ్బొల్లా అంతర్గత రాజకీయాలు ఆ సంస్థను ఇజ్రాయిల్‌తో యుద్ధానికి పురికొల్పేలా ఉన్నాయని అమెరికన్ అధికారులు ఆందోళన చెందుతున్నారని సీఎన్ఎన్ చెబుతోంది.



ఒకవేళ ఇజ్రాయిల్‌పై హెజ్బొల్లా, దాని మిత్రపక్షమైన అమెరికాపైన తీవ్రస్థాయిలో దాడిచేస్తే పర్యవసానాలు తీవ్రంగా ఉంటాయని ఇరాన్‌కు తెలుసని అమెరికా భావిస్తున్నది. ప్రస్తుతం తక్కువ స్థాయిలో కొనసాగుతున్న దాడులు ఒక వ్యూహం ప్రకారం జరుగుతున్నాయనీ, అవి మితిమీరితే ఊహించని పర్యవసానాలకు దారితీసే అవకాశముందని అమెరికా భావిస్తున్నది. యుద్ధం ప్రాంతీయ యుద్ధంగా పరిణమిస్తుందనే భయంతో ఇజ్రాయిల్ 1.5బిలియన్ డాలర్ల విలువైన ఆయుధాలను దేశీయంగాను, విదేశాల నుంచి సమకూర్చుకుందని వై-నెట్ శుక్రవారంనాడు రిపోర్ట్ చేసింది.

మాపై ఆంక్షలు విధించి 1.5 ట్రిలియన్ డాలర్ల సంపద కోల్పోయింది

- యూరోపియన్ యూనియన్‌పై రష్యా విమర్శ



మాస్కో : యూరోపియన్ యూనియన్ దేశాలు రష్యాపైన కనీవినీ ఎరుగని స్థాయిలో ఆంక్షలను విధించి 1.5 ట్రిలియన్ డాలర్ల (ఒక లక్షా యాభై వేల కోట్లకు సమానం) సంపదను కోల్పోయినట్టు రష్యన్ ఉప విదేశాంగ మంత్రి అలెగ్జాండర్ గ్రుష్కో శుక్రవారం ప్రకటించారు. రష్యాపట్ల యూరోపియన్ యూనియన్ సమీప భవిష్యత్తులోనూ తన విధానాలను మార్చుకునే సూచనలేవీ కనిపించటం లేదని యూరేసియన్ ఎకనామిక్ ఫోరమ్ సమావేశం సందర్భంగా పాత్రికేయులతో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 2013లో యూరోపియన్ యూనియన్ సభ్యదేశాలు రష్యాతో జరిపిన వాణిజ్యం పరిమాణం 417 బిలియన్ డాలర్లు. ఉక్రెయిన్ సంబంధిత ఆంక్షలు లేనట్టయితే అది వర్తమాన సంవత్సరంలో కనీసం 700 బిలియన్ డాలర్లయి ఉండేది. కానీ 2022వ సంవత్సరంలో యూరోపియన్ యూనియన్‌కు, రష్యాకు మధ్య జరిగిన వాణిజ్యం పరిమాణం కేవలం 200 బిలియన్లు, ఇది 2023లో మరింతగా క్షీణించి 100బిలియన్ల కంటే దిగువకు పడిపోయే అవకాశం ఉంటుందని, వచ్చే సంవత్సరంకల్లా అది 50బిలియన్లకు, ఆ తరువాత అది సున్నాకు పతనమౌతుందని తాను భావిస్తున్నట్టు గ్రుష్కో చెప్పారు. అమెరికాలోని ధరకు మూడు రెట్లు ఎక్కువ చెల్లించి జర్మనీ పారిశ్రామిక రంగం గ్యాస్‌ను కొంటోంది. జర్మన్ పారిశ్రామికవేత్తలం హెచ్చరిస్తున్నా అనేక పరిశ్రమలు మెల్లమెల్లగా అమెరికాకు తరలివెళుతున్నాయి.

ఉక్రెయిన్‌లో రష్యా సైనిక జోక్యం తరువాత యూరోపియన్ యూనియన్ రష్యాపైన 11 ఆంక్షల ప్యాకేజీలను విధించింది.

దీనితో వాణిజ్యానికి వేలకువేల ప్రతిబంధకాలు ఏర్పడ్డాయి. ఇది రష్యాను నష్టపరిచినదానికంటే ఎంతో ఎక్కువగా యూరోపియన్ యూనియన్‌ను నష్టపరిచాయి.

బిజినెస్

జైలుకు క్రిప్టో ఎక్స్ఛేంజీ వ్యవస్థాపకుడు

రూ.80వేల కోట్ల మోసం కేసు

శామ్ బాంక్‌మన్‌కు న్యూయార్క్ కోర్టు శిక్ష



న్యూయార్క్ : క్రిప్టో ఎక్స్ఛేంజీ ఎఫ్‌టిఎక్స్ ఫౌండర్, సీఈఓ శామ్ బాంక్‌మన్‌ను న్యూయార్క్ కోర్టు దోషిగా తేల్చింది. ఆర్థిక మోసాలు, అక్రమ నగదు చలామణి వంటి నేరాలకు పాల్పడినట్టు నిర్ధారణ అయ్యింది. క్రిప్టో కరెన్సీ పరిశ్రమలో శామ్‌ను కింగ్‌గా భావిస్తారు. గురువారం న్యూయార్క్ కోర్టు ఇచ్చిన తీర్పుతో 31 ఏండ్ల శామ్ బాంక్‌మన్ ప్రతిష్ట మొత్తం పోయింది. ఆర్థిక మోసాలకు పాల్పడిన శామ్‌కు 10 ఏండ్ల పాటు జైలు శిక్ష విధించింది. క్రిప్టో ఎక్స్ఛేంజీ ప్రారంభించిన అనాతి కాలంలోనే ఆయన సంపద 26 బిలియన్ డాలర్లకు (దాదాపు రూ.2 లక్షల కోట్లకు) ఎగిసింది. నిధుల దుర్వినియోగం, కృత్రిమ క్రిప్టో ధరలు, మనీలాండరింగ్ తదితర అక్రమాలకు పాల్పడిందనేది ప్రధాన ఆరోపణ. తమసంస్థ దివాలా తీసినట్లు ఎఫ్‌టిఎక్స్ స్వయంగా గతేడాది నవంబర్‌లో ప్రకటించింది. దీనిపై విచారించిన న్యూయార్క్ కోర్టు దాదాపు 10 బిలియన్ డాలర్ల (దాదాపు రూ.80వేల కోట్ల) విలువైన ఆర్థిక నేరానికి పాల్పడినట్టు తేల్చింది. ఇది అమెరికా చరిత్రలోనే అతిపెద్ద ఆర్థిక మోసాల్లో ఒకటని కోర్టు పేర్కొంది. ఈ వ్యవహారంలో బ్యాంక్‌మన్‌తో పాటు మరో ముగ్గురూ తమ తప్పులను కోర్టు ముందు అంగీకరించడంతో వారిని దోషిగా తేల్చింది.

యూఏఈకి లీ ఫార్మా కీళ్ల వ్యాధి ఔషధాలు

హైదరాబాద్ : ఔషధ ఉత్పత్తుల కంపెనీ లీ ఫార్మా ఉత్పత్తి చేసే కీళ్ల వ్యాధి చికిత్సలో వాడే బయో కార్టిలేజ్ స్మూత్‌వాక్ టాబ్లెట్లను యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యుఎఇ)కి ఎగుమతి చేయనున్నట్లు వెల్లడించింది. ఆ ప్రాంతంలో మార్కెట్ చేయడానికి అక్కడి మినిస్ట్రీ ఆఫ్ హెల్త్ ప్రివెన్షన్ నుంచి అనుమతులు పొందినట్లు తెలిపింది. "లీ ఫార్మా చరిత్రలో ఇదొక మైలురాయిగా నిలవనుంది. భారత్‌లో తయారైన ఇటువంటి ఉత్పాదనకు యుఎఇలో ఆమోదం రావడం ఇదే మొదటిసారి. ఈ ఉత్పత్తిని అన్ని మధ్యప్రాచ్యం, తూర్పు ఆసియా దేశాలలో విక్రయించేందుకు కంపెనీ దరఖాస్తు చేసుకుంది. అలాగే మార్కెటింగ్ ఆథరైజేషన్ కోసం యుఎస్ ప్రభుత్వానికి 2024 మూడవ త్రైమాసికంలో దరఖాస్తు చేస్తాము." అని లీ ఫార్మా డైరెక్టర్ లీలా రాణి తెలిపారు. శక్తివంతమైన ఫైటో పోషకాలతో సహజ బయోన్యూట్రాస్యూటికల్స్ ఆధారంగా ఈ ట్యాబ్లెట్లను తయారు చేసినట్లు వెల్లడించారు. మదులాస్థిని (కార్టిలేజ్) పెంచి కీళ్లలో కణజాల రుగ్మతలపై ఇది చక్కగా పనిచేస్తుందని పేర్కొన్నారు. ఈ మందు వాడితే సర్జరీలను నివారించవచ్చని లీలా రాణి అన్నారు. దేశీయంగా ఆన్‌లైన్, ఆఫ్‌లైన్‌లో ఈ ఔషధాలు లభ్యం అవుతాయని తెలిపారు.

ఏఐతో ఉద్యోగాల విధ్వంసమే

ఎలన్ మస్క్ హెచ్చరిక

న్యూయార్క్ : కృత్రిమ మేధా (ఎఐ)తో ఉద్యోగాలు భారీగా కనుమరుగు అయ్యే ప్రమాదం ఉందని టెస్లా, ట్విట్టర్ అధినేత ఎలన్ మస్క్ హెచ్చరించారు. ఎఐ చరిత్రలో అత్యంత వినాశనకారిగా మిగిలిపోతుందని విశ్లేషించారు. ఇటీవల బ్రిటన్ ప్రధాని రిషీ సునాక్‌తో భేటీ అయిన మస్క్ ఈ ఆధునిక టెక్నాలజీ మానవాళికి పెను ముప్పుగా పరిణమిస్తుందని ఆందోళన వ్యక్తం చేశారని రిపోర్టులు వస్తున్నాయి. రాబోయే రోజుల్లో మనుషులు చేసే అన్ని ఉద్యోగాలను కనుమరుగు చేస్తుందని మస్క్ ఆందోళన వ్యక్తం చేశారు. ఎఐతో అసలు ఉద్యోగాలు అవసరం లేని దశకు చేరుకునే ప్రమాదం లేకపోలేదన్నారు.


సుధాకర్ అడప చేతికి అరేబియా పత్రిక



హైదరాబాద్ : బియా బ్రాండ్ ఫౌండర్ సుధాకర్ అడప తాజాగా హలో ఇండో-అరేబియా సహా హలో అరేబియా పత్రికల హక్కులను పొందినట్లు ప్రకటించారు. ఈ జీవన శైలీ మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకోవడం ద్వారా మీడియా రంగంలోకి ప్రవేశించినట్లయ్యిందని ఆయన పేర్కొన్నారు. విదేశీ పబ్లిషింగ్ రంగంలోకి ప్రవేశించిన తొలి భారతీయుడిగా తాను గుర్తింపు పొందినట్లు తెలిపారు. హలో! ఇండో-అరేబియా, హలో! అరేబియా లాంటి రెండు లగ్జరీ, సెలబ్రిటీ మ్యాగజైన్‌లను స్వాధీనం చేసుకోవడం ద్వారా ప్రత్యేకమైన అవకాశాలు దక్కనున్నాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు.

వెరొకరికి రద్దయిన మొబైల్ నెంబర్లు

90 రోజుల తర్వాత జారీ : ట్రాయ్




న్యూఢిల్లీ : రద్దు చేసిన మొబైల్ నెంబర్లను కనీసం మూడు నెలల తర్వాత వెరొక్కరికి కేటాయిస్తామని ట్రాయ్ వెల్లడించింది. రద్దు అయిన మొబైల్ నంబర్లను ఇతరులకు కేటాయించడం ద్వారా తర్వాత వాట్సాప్ వంటి మాధ్యమాల ద్వారా వినియోగదారుల వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం అవుతుందని గతంలో సుప్రీంకోర్టులో కేసు నమోదయ్యింది. దీనిపై ట్రాయ్ కోర్టుకు వివరణ ఇస్తూ.. వినియోగదారుల ప్రైవసీకి భంగం వాటిల్లకుండా ఉండేందుకే 90 రోజుల వ్యవధి విధించినట్లు తెలిపింది. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా 45 రోజుల పైబడి వాడకంలోని ఫోన్‌లలో ఆటోమెటిక్‌గా డేటా తొలిగిపోతుందని వాట్సాప్‌కు వివరణ ఇచ్చింది.

గ్రోకామ్స్‌కు రూ.30 కోట్ల నిధులు

ముంబయి : అగ్రిటెక్ స్టార్టప్ గ్రోకామ్స్ 3.5 మిలియన్ డాలర్లు (దాదాపు రూ.30 కోట్లు) నిధులు సమీకరించినట్లు వెల్లడించింది. జెఎస్‌డబ్ల్యు వెంచర్స్, అరాలి వెంచర్స్ నేతృత్వంలో ఈ నిధులను పొందినట్లు పేర్కొంది. ఈ నిధులను మసాల దినుసలలో బి2బి కామర్స్ మోడల్‌ను బోలోపేతం చేసేందుకు ఉపయోగించనున్నట్లు గ్రోకామ్స్ సహ వ్యవస్థాపకుడు, సిఇఓ జార్జ్ కురియస్ తెలిపారు.

భారత్, ఇటలీ మధ్య భాగస్వామ్య ఒప్పందం

రోమ్ : కార్మికులు, విద్యార్థులు, వృత్తినిపుణుల తరలింపు కోసం భారత్, ఇటలీ మధ్య మొబిలిటీ అండ్ మైగ్రేషన్ పార్టనర్‌షిప్ ఒప్పందం కుదిరింది. ఇటలీ విదేశాంగ మంత్రి ఆంటానియో తాజనితో భారత విదేశాంగ మంత్రి జై శంకర్ సమగ్రంగా చర్చలు జరిపిన అనంతరం ఈ ఒప్పందం కుదిరింది. పోర్చుగల్, ఇటలీలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా జై శంకర్ రోమ్‌లో వున్నారు. సమగ్ర, ఫలప్రదమైన సమావేశం జరిగిందంటూ జైశంకర్ ట్విట్టర్‌లో పోస్టు పెట్టారు. "మా వ్యూహాత్మక భాగస్వామ్యం గురించి మరింత లోతుగా చర్చించాం. వ్యవసాయ సాంకేతికత, ఆవిష్కరణ, రోదసీ, రక్షణ, డిజిటల్ రంగాల్లో గల అవకాశాల గురించి అన్వేషణ జరగాలని అంగీకారం కుదిరింది." అని ఆయన ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పశ్చిమాసియా పరిస్థితులు, ఉక్రెయిన్ ఘర్షణ, ఇండో-పసిఫిక్‌ల్లో స్థితిగతుల గురించి ఇరువురు నేతలు సమగ్ర చర్చలు జరిపారు. భారత్ చొరవలకు, జి 20 అధ్యక్ష బాధ్యతల నిర్వహణకు ఇటలీ మద్దతును ఆయన అభినందించారు. ఇరు దేశాల మధ్య కార్మికులు, విద్యార్థులు, వృత్తి నిపుణులను పంపడానికి చర్చల ముగింపులో మొబిలిటీ అండ్ మైగ్రేషన్ పార్టనర్‌షిప్ ఒప్పందం కుదిరిందని చెప్పారు. ఇటలీలో భారతీయులు 1,80,000మంది వున్నారు. బ్రిటన్,నెదర్లాండ్స్ తర్వాత ఇటలీలోనే భారతీయులు ఎక్కువ. ప్రధానంగా వీరందరూ వ్యవసాయం, పాల ఉత్పత్తులు, తోలు పరిశ్రమ, నిర్మాణ కార్యకలాపాలు, సేవల పరిశ్రమ వంటి ఆర్థిక రంగాల్లోనే సెటిలయ్యారు.





ప్రపంచకప్‌లో నేడు
న్యూజిలాండ్ X పాకిస్థాన్
వేదిక: బెంగళూర్ ,సమయం : ఉ॥ 10.30
ఆస్ట్రేలియా X ఇంగ్లాండ్
వేదిక : కోల్‌కత , సమయం : మ॥ 2
స్టార్‌స్పోర్ట్స్‌లో ప్రసారం..

నేపాల్, ఓమన్ అర్హత

• 2024 ఐసీసీ టీ20 ప్రపంచకప్



దుబాయ్ : నేపాల్, ఓమన్ ధనాధన్ మెగా ఈవెంట్‌కు అర్హత సాధించాయి. ఆసియా రీజియన్ క్వాలిఫయర్స్‌లో సత్తా చాటిన నేపాల్, ఓమన్ 2024 ఐసీసీ మెన్స్ టీ20 ప్రపంచకప్‌లో పోటీపడనున్నాయి. ఐసీసీ ఆసియా రీజియన్ క్వాలిఫయర్స్ సెమీస్‌లో బ్రహెయిన్ పై ఓమన్ 10 వికెట్ల తేడాతో గెలుపొందగా, యుఏఈపై నేపాల్ 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. తొలుత యుఏఈ 134/9 పరుగులు చేయగా.. నేపాల్ 135/2తో ఛేదించి ఫైనల్లోకి చేరుకుంది. మరో సెమీస్‌లో బ్రహెయిన్ 106/9 స్కోరు చేయగా.. ఓమన్ 109/0తో లాంఛనం ముగించింది. ఆసియా రీజియన్ క్వాలిఫయర్స్ ఫైనల్లో నేపాల్, ఓమన్ తలపడనున్నాయి. 2014లో తొలిసారి టీ20 ప్రపంచకప్‌లో మెరిసిన నేపాల్ పదేండ్ల తర్వాత మళ్లీ మెగా టోర్నీలో ఆడనుంది. నేపాల్, ఓమన్ అర్హతతో.. 2024 టీ20 ప్రపంచకప్‌లో పోటీపడనున్న జట్ల సంఖ్య 18కి చేరుకుంది. ఆఫ్రికా క్వాలిఫయర్స్ నుంచి మరో రెండు జట్లు సైతం అర్హత సాధించాల్సి ఉంది. ఓవరాల్‌గా 20 జట్లు పోటీపడనున్న టోర్నీకి ఆతిథ్య దేశాలు అమెరికా, వెస్టిండీస్ సహా ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్, భారత్, న్యూజిలాండ్, నెదర్లాండ్స్, పాకిస్థాన్, దక్షిణాఫ్రికా, శ్రీలంకలు 2022 టీ20 ప్రపంచకప్‌లో టాప్-8లో నిలిచి అర్హత సాధించాయి. ర్యాంకింగ్స్‌లో మెరుగైన స్థానాల్లో నిలిచి అఫ్గనిస్థాన్, బంగ్లాదేశ్ అర్హత సాధించాయి. యూరోప్ క్వాలిఫయర్స్ నుంచి ఐర్లాండ్స్, స్కాట్లాండ్.. ఈస్ట్ ఆసియా పసిఫిక్ నుంచి న్యూ గునియా, అమెరికా రీజియన్ నుంచి కెనడా అర్హత సాధించాయి.

పరిమితి ఎత్తివేయాలి!

• 15 మందితో కూడిన జట్టుపై పాట్ కమిన్స్



బెంగళూర్ : ఐసీసీ ప్రపంచకప్. రెండు నెలల పాటు సాగే మహా సమరం. అత్యంత పోటీతత్వం, ఒత్తిడితో కూడిన టోర్నీలో ఆటగాళ్లకు గాయాలు సహజం. అప్పుడు తుది జట్టు ఎంపిక కత్తి మీద సాముగా మారుతోంది. ఇద్దరు ఆటగాళ్లు గాయపడితే అందుబాటులోని 13 మందితోనే తుది జట్టు కూర్పు చేయాలి. ఐసీసీ నిబంధనల ప్రకారం ప్రపంచకప్ జట్టులో 15 మంది మాత్రమే ఉండాలి. ఐసీసీ రూల్స్‌లో మార్పు అవసరమని, ప్రపంచకప్ జట్టు సంఖ్యను మరింత పెంచటం అనివార్యమని ఆస్ట్రేలియా కెప్టెన్ పాట్ కమిన్స్ అన్నాడు. ఆ జట్టులో గ్లెన్ మాక్స్‌వెల్ కంకషన్‌తో బాధపడుతుండగా, మిచెల్ మార్ష్ స్వదేశానికి వెళ్లిపోయాడు. ఇంగ్లాండ్‌తో కీలక మ్యాచ్‌కు తుది జట్టు ఎంపికకు కంగారూ సారథికి కష్టాలు తప్పటం లేదు. 'ఐసీసీ రూల్స్ మారాలి. ప్రపంచకప్ జట్టు సంఖ్య పరిమితి సడలించాలి. రెండు నెలల పాటు సాగే టోర్నీలో ప్రస్తుతం న్యూజిలాండ్ కొనసాగుతున్న స్థితిలో ఉండాలని ఎవరూ కోరుకోరు. కేన్ విలియమ్సన్ గాయపడినా.. అతడిని జట్టుతో పాటు నిలుపుకున్నారు. 14 మందితో కూడిన జట్టుతో ప్రపంచకప్‌లో పోటీపడుతున్నారు. ఎక్కువ మంది అందుబాటులో ఉండటం అంటే.. మరో దేశం నుంచి క్రికెటర్లను తెచ్చుకోవటం ఏమీ కాదు. తుది జట్టు ఎంపికకు మరింత మంది ఆటగాళ్లు అందుబాటులో ఉండటం అవసరమని నా అభిప్రాయం' అని పాట్ కమిన్స్ అన్నాడు.

అఫ్గాన్ మాయ

• డచ్‌పై 7 వికెట్ల తేడాతో గెలుపు
• ఛేదనలో రెహమత్, షాహిది జోరు

ఐసీసీ 2023 ప్రపంచకప్



నవతెలంగాణ-లక్నో

అఫ్గనిస్థాన్ జోరు కొనసాగుతోంది. ప్రపంచకప్ గ్రూప్ దశలో నాల్గో విజయం ఖాతాలో వేసుకున్న అఫ్గనిస్థాన్ శుక్రవారం లక్నోలో నెదర్లాండ్స్‌ను చిత్తు చేసింది. బౌలర్లు, బ్యాటర్లు మెరువటంతో 7 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. 180 పరుగుల ఛేదనలో రెహమత్ షా (52, 54 బంతుల్లో 8 ఫోర్లు), హస్మతుల్లా షాహిది (56 నాటౌట్, 64 బంతుల్లో 6 ఫోర్లు) అర్థ సెంచరీలతో కదం తొక్కారు. 31.3 ఓవర్లలో 181/3 పరుగులు చేసిన అఫ్గనిస్థాన్ మరో 111 బంతులు మిగిలి ఉండగానే లాంఛనం ముగించింది. తొలుత బ్యాటింగ్ చేసిన నెదర్లాండ్స్ 46.3 ఓవర్లలో 179 పరుగులకు ఆలౌటైంది. స్పిన్నర్లు మహ్మద్ నబి (3/28), రషీద్ ఖాన్ (2/31), ముజీబ్ రెహమాన్ (1/40) మాయజాలం ప్రదర్శించారు. మూడు వికెట్లతో డచ్ జట్టు పతనం శాసించిన మహ్మద్ నబి 'మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్'గా నిలిచాడు. ప్రపంచకప్ గ్రూప్ దశలో అఫ్గనిస్థాన్‌కు ఇది ఏడు మ్యాచుల్లో నాల్గో విజయం కాగా.. నెదర్లాండ్స్‌కు ఏడు మ్యాచుల్లో ఐదో పరాజయం కావటం విశేషం.

స్పిన్నర్ల మ్యాజిక్ : టాస్ నెగ్గిన నెదర్లాండ్స్ తొలుత బ్యాటింగ్ ఎంచుకుంది. ఇన్నింగ్స్ తొలి ఓవర్లోనే ఓపెనర్ వెస్లీ బారెసీ (1)ను అవుట్ చేసి అఫ్గాన్‌కు బ్రేక్ అందించాడు. కానీ ఆ తర్వాత నలుగురు బ్యాటర్లు వికెట్ల మధ్య పరుగు తీస్తూ రనౌట్ అయ్యారు. మాక్స్ ఒబెడ్ (42), కొలిన్ ఏకర్‌మాన్ (29), సైబ్రాండ్ (58, 86 బంతుల్లో 6 ఫోర్లు), స్కాట్ ఎడ్వర్డ్స్ (0)లు రనౌట్‌గా నిష్క్రమించారు. సైబ్రాండ్ అర్థ సెంచరీతో మెరువగా.. కొలిన్ విలువైన ఇన్నింగ్స్ నమోదు చేశాడు. దీంతో నెదర్లాండ్స్ మంచి స్కోరు దిశగా సాగింది. వరుస రనౌట్లకు మహ్మద్ నబి, రషీద్ ఖాన్ మాయజాలం జతకలవటంతో డచ్ జట్టు 179 పరుగులకు కుప్పకూలింది.

ఆడుతూ పాడుతూ : స్వల్ప లక్ష్యాన్ని అఫ్గనిస్థాన్ ఆడుతూ పాడుతూ ఛేదించింది. ఓపెనర్లు రెహ్మానుల్లా గుర్బాజ్ (10), ఇబ్రహీం జద్రాన్ (20) మంచి ఆరంభాన్ని అందించారు. రెహమత్ షా (52), కెప్టెన్ హస్మతుల్లా షాహిది (56 నాటౌట్) మూడో వికెట్‌కు భారీ భాగస్వామ్యం నెలకొల్పారు. షా, షాహిది అర్థ సెంచరీలతో అఫ్గాన్ గెలుపు ఖాయం చేసుకుంది. అజ్మతుల్లా ఒమర్‌జాయ్ (31 నాటౌట్, 28 బంతుల్లో 3 ఫోర్లు) సైతం రాణించాడు. 31.3 ఓవర్లలోనే 181 పరుగులు చేసిన అఫ్గనిస్థాన్ గ్రూప్ దశలో నాల్గో విజయం ఖాతాలో వేసుకుంది.

సంక్షిప్త స్కోర్లు

నెదర్లాండ్స్ ఇన్నింగ్స్ : 179/10 (సైబ్రాండ్ 58, మాక్స్ ఒబెడ్ 42, మహ్మద్ నబి 3/28, రషీద్ ఖాన్ 2/31)

అఫ్గనిస్థాన్ ఇన్నింగ్స్ : 181/3 (హస్మతుల్లా 56, రెహమత్ షా 52, ఒమర్‌జాయ్ 31, జుల్ఫీకర్ 1/25)

ఇదేం ఆట.. వివరణ ఇవ్వండి!

శ్రీలంక కోచింగ్ సిబ్బందికి బోర్డు హుకుం

కొలంబో : ఐసీసీ ప్రపంచకప్‌లో శ్రీలంక పేలవ ప్రదర్శన, చెత్త ఆట తీరు పట్ల ఆ దేశ క్రికెట్ బోర్డు తీవ్ర ఆగ్రహంతో ఉంది. ముంబయిలో భారత్‌తో మ్యాచ్‌లో శ్రీలంక ఏకంగా 302 పరుగుల తేడాతో దారుణ పరాజయం చవిచూసింది. ప్రపంచకప్ గ్రూప్ దశలో ఆడిన ఏడు మ్యాచుల్లో ఐదింట పరాజయాలు చవిచూసింది. నెదర్లాండ్స్, ఇంగ్లాండ్‌పై నెగ్గిన లంకేయులు..దక్షిణాఫ్రికా, పాకిస్థాన్, ఆస్ట్రేలియా, అఫ్గనిస్థాన్, భారత్ చేతిలో మట్టికరిచింది. సెమీఫైనల్స్ రేసు నుంచి నిష్క్రమించిన శ్రీలంక 2025 ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి అర్హత సాధించేందుకు ఆడుతోంది. చివరి రెండు గ్రూప్ మ్యాచుల్లో బంగ్లాదేశ్, న్యూజిలాండ్‌తో శ్రీలంక తలపడనుంది. భారత్‌తో మ్యాచ్‌లో అవమానకర ఓటమి, ఆటతీరు పట్ల వివరణ ఇవ్వాలని శ్రీలంక క్రికెట్ బోర్డు సహాయక సిబ్బందిని ఆదేశించింది.



'జట్టుకు సేవలు అందించే ప్రొఫెషనల్స్ అంశంలో బోర్డు ఎప్పుడూ జోక్యం చేసుకోదు. నిబంధనలను గౌరవిస్తూ వచ్చింది. కానీ బాధ్యత, పారదర్శకత, సమస్యలను పరిష్కరించే ప్రక్రియను ఎస్‌ఎల్‌సీ విశ్వసిస్తుంది. ప్రపంచకప్‌లో జట్టు పేలవ ప్రదర్శనకు కారణమైన వ్యూహం, సన్నద్ధత, జట్టు ఎంపిక, ఆటగాళ్ల ప్రదర్శన, మ్యాచ్ అనంతరం అనాలసిస్ వివరాలతో కూడిన నివేదిక తక్షణమే అందజేయాలి' అని సహాయక సిబ్బందిని బోర్డు ఆదేశించింది.

స్టోక్స్‌కు త్వరలో శస్త్రచికిత్స

• భారత్ టెస్టు సిరీస్‌కు రీ ఎంట్రీ



అహ్మదాబాద్ : ఇంగ్లాండ్ స్టార్ ఆల్‌రౌండర్, టెస్టు జట్టు కెప్టెన్ బెన్ స్టోక్స్ త్వరలో శస్త్రచికిత్సకు వెళ్లనున్నాడు. 18 నెలలుగా మోకాలు గాయంతో బాధపడుతున్న బెన్ స్టోక్స్.. వన్డే వరల్డ్‌కప్ కోసం రిటైర్మెంట్ నుంచి బయటికొచ్చినా జట్టుకు ఆశించిన ప్రదర్శన చేయటం లేదు. స్పెషలిస్ట్ బ్యాటర్‌గానే ఆడుతున్న స్టోక్స్.. బంతి పట్టుకోవటం లేదు. 'మోకాలు గాయం నాకు ఎంతో అడ్డంకిగా మారింది. జట్టులో నా బాధ్యతను నిర్వర్తించటం లేదు. మళ్లీ నేను నాలా ఆడాలని అనుకుంటున్నాను. బెన్ స్టోక్స్ ఏం చేయగలడో.. అది చేయాలని ఆశిస్తున్నాను. వరల్డ్‌కప్ తర్వాత సర్జరీ చేయించుకుంటాను. భారత్‌తో టెస్టు సిరీస్ సమయానికి కోలుకుంటానని అనుకుంటున్నాను' అని బెన్ స్టోక్స్ తెలిపాడు.



నేడు డబుల్ ధమాకా

• కివీస్‌తో పాక్.. ఇంగ్లాండ్‌తో ఆసీస్ ఢీ
• 2023 ఐసీసీ వన్డే వరల్డ్‌కప్

బెంగళూర్/అహ్మదాబాద్



ప్రపంచకప్ గ్రూప్ దశ మ్యాచులు ముగింపు దశకు చేరుకుంటున్న వేళ నేడు డబుల్ ధమాకాకు రంగం సిద్ధమైంది. అగ్రజట్లు నేడు ముఖాముఖి పోరులో తాడోపేడో తేల్చుకునేందుకు సిద్ధమవుతున్నాయి. అహ్మదాబాద్ వేదికగా న్యూజిలాండ్, పాకిస్థాన్ తలపడనుండగా.. బెంగళూర్ చిన్నస్వామి స్టేడియంలో ఆస్ట్రేలియాతో ఇంగ్లాండ్ పోటీపడనుంది. కివీస్, పాక్ ఉదయం 10.30 గంటలకు షురూ కానుండగా.. ఆసీస్, ఇంగ్లాండ్ పోరు మధ్యాహ్నం 2 గంటలకు మొదలవుతుంది. సెమీస్ ఆశలు కోల్పోయిన ఇంగ్లాండ్ నుంచి ఆసీస్‌కు గండం పొంచి ఉండగా.. సెమీస్ రేసులో విలువైన రెండు పాయింట్ల వేటలో నిలిచిన కివీస్, పాక్ నేడు అమీతుమీ తేల్చుకోనున్నాయి.

కివీస్ మెరిసేనా? : వరుసగా నాలుగు విజయాల అనంతరం న్యూజిలాండ్ హ్యాట్రిక్ పరాజయాలు చవిచూసింది. భారత్, ఆసీస్, సఫారీలు కివీస్‌ను ఓడించాయి. సెమీస్ బెర్త్ ఖాయం అనుకున్న న్యూజిలాండ్.. ఇప్పుడు టాప్-4లో నిలిచేందుకు తంటాలు పడుతోంది. మరోవైపు నాలుగు పరాజయాలకు బ్రేక్ వేస్తూ బంగ్లాపై గెలుపొందిన పాకిస్థాన్ సైతం సెమీస్ రేసులో నిలిచేందుకు నేడు విజయమే లక్ష్యంగా బరిలోకి దిగుతోంది. న్యూజిలాండ్ అన్ని విభాగాల్లోనూ మెరుగ్గా కనిపిస్తోంది. పాకిస్థాన్ పెద్దగా పుంజుకోలేదు. బ్యాటింగ్ విభాగంలో బాబర్‌సేన కష్టాలు కొనసాగుతున్నాయి. అయితే, అనిశ్చితి చిరునామా పాకిస్థాన్ ఎప్పుడు ఎలా ఆడేది ఎవరూ అంచనా వేయలేరు. సెమీస్ రేసులో కివీస్, పాక్‌కు ఈ మ్యాచ్ కీలకం.



ఆసీస్‌కు ఎదురుందా? : ఆరు మ్యాచుల్లో ఐదు పరాజయాలతో ఇంగ్లాండ్ సెమీస్ ఆశలు వదిలేసుకుంది. కానీ సెమీస్ రేసు రసవత్తరంగా మారిన తరుణంలో ఇంగ్లాండ్ అత్యంత ప్రమాదకర జట్టు. ఇప్పుడు బట్లర్‌సేన ఇతర జట్ల సెమీస్ అవకాశాలను ప్రభావితం చేయగల స్థితిలో నిలిచింది. దీంతో నేడు జాగ్రత్త పడాల్సిన జట్టు ఆస్ట్రేలియానే. వరుసగా నాలుగు విజయాలు నమోదు చేసి ఊపుమీదున్న కంగారూలు.. నేడు ఇంగ్లాండ్ సవాల్‌కు సిద్ధమయ్యారు. మిచెల్ మార్ష్, గ్లెన్ మాక్స్‌వెల్ లేని వేళ మార్కస్ స్టోయినిస్, కామెరూన్ గ్రీన్ నేడు బరిలోకి దిగే అవకాశం కనిపిస్తోంది.



మానస చౌదరి, రోషన్ కనకాల

నవచిత్రం

హబీబీ జిలేబీ..

రోషన్ కనకాల హీరోగా పరిచయం అవుతున్న తొలి చిత్రం 'బబుల్‌గమ్'. రవికాంత్ పేరేపు దర్శకుడు. అగ్రహీరో వెంకటేష్ ఈ చిత్రంలోని ఫస్ట్ సింగిల్ 'హబీబీ జిలేబీ..' సాంగ్‌ని లాంచ్ చేయడంతో ఈ చిత్ర మ్యూజికల్ జర్నీ మొదలైంది. ఈ సందర్భంగా చిత్ర యూనిట్‌కు వెంకటేష్ శుభాకాంక్షలు తెలియజేశారు.

శ్రీచరణ్ పాకాల మాస్, యూత్‌ని ఆకట్టుకునే పెప్పీ ట్రాక్‌గా కంపోజ్ చేసిన ఈ పాట లీడ్ పెయిర్ డ్యాన్స్ పెర్ఫార్మెన్స్‌కి స్కోప్ ఇచ్చింది. రోషన్ కనకాల అద్భుతమైన డ్యాన్స్ మూవ్స్‌తో ఆకట్టుకున్నారు. సింగల్ రాహుల్ సిప్లిగంజ్ తన హై-పిచ్ వోకల్స్‌తో అదనపు ఎనర్జీని నింపారు. కాసర్ల శ్యామ్ లిరిక్స్ ఆకట్టుకున్నాయి. ఈ పెప్పీ ట్రాక్ తెలుగు సినిమా ప్రేమికులకు మ్యూజిక్, విజువల్ ట్రీట్ అని చెప్పడంలో ఏ మాత్రం అతిశయోక్తి లేదు. మనసుని హత్తుకునే జెన్జీ ప్రేమకథతో ప్రేక్షకులను కట్టిపడేసేలా ఈ చిత్రాన్ని రూపొందించారు. సరికొత్త రొమాంటిక్ జర్నీతో ఈ చిత్రం ప్రేక్షకులని ఆకట్టుకోనుంది. పీపుల్ మీడియా ఫ్యాక్టరీతో కలిసి మహేశ్వరి మూవీస్ నిర్మిస్తున్న ఈ సినిమా డిసెంబర్ 29న రిలీజ్ కానుంది అని చిత్ర బృందం తెలిపింది.

గర్వంగా ఉంది



ఆర్.ఎ.వెంకట్


స్రవంతి మూవీస్ అధినేత 'స్రవంతి' రవికిశోర్ తొలిసారిగా తమిళంలో నిర్మించిన చిత్రం 'కిడ'. తెలుగులో దీపావళి పేరుతో అనువదించారు. ఆర్.ఎ.వెంకట్ దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. పూ రాము, కాళీ వెంకట్ తదితరులు ప్రధాన పాత్రలు పోషించారు. దీపావళి పండగ సందర్భంగా ఈ నెల 11న తెలుగు, తమిళ భాషల్లో సినిమాను విడుదల చేస్తున్నారు. ఈ సందర్భంగా దర్శకుడు ఆర్.ఎ.వెంకట్ మాట్లాడుతూ, 'సినిమా ఎంత గ్రాండియర్‌గా ఉన్నప్పటికీ అందులో ఎమోషన్స్‌కే ప్రేక్షకులు కనెక్ట్ అవుతారనే విషయాన్ని నేను నమ్ముతాను. పల్లెటూరు, అందులో మేకలు పెంచుకునే ఓ ముసలి వ్యక్తి, మనవడు, వారు ప్రేమగా పెంచుకునే మేక పిల్ల.. ఈ అంశాలను కనెక్ట్ చేస్తూ ఎమోషనల్‌గా ఓ కథను రాసుకున్నాను. ఈ కథ విన్న వేణు అనే నిర్మాత స్రవంతి రవికిశోర్‌కి చెప్పారు. ఆయన పూర్తి కథను ఆడియో రూపంలో వివరించి పంపమన్నారు. అది విన్న ఆయన ఈ సినిమా మనం చేస్తున్నామని చెప్పడంతో షాకింగ్‌గా అనిపించింది. ఎందుకంటే స్టార్స్‌తో మూవీస్ చేసిన రవికిశోర్ తమిళంలో నా సినిమాతో నిర్మాతగా అడుగు పెట్టారు. రవికిశోర్ తొలి తమిళ సినిమాకు నేనే డైరెక్టర్ అని చెప్పుకోవటం ఎంతో గర్వంగా ఉంటుంది. గోవా ఫిల్మ్ ఫెస్టివల్‌లో ఆడియెన్స్ నుంచి స్టాండింగ్ ఓవేషన్ వచ్చింది. తర్వాత చెన్నై ఫిల్మ్ ఫెస్టివల్‌లో బెస్ట్ ఫిల్మ్, బెస్ట్ యాక్టర్ అవార్డ్స్ వచ్చాయి. మెల్‌బోర్న్ ఫిల్మ్ ఫెస్టివల్‌లోనూ స్క్రీనింగ్ చేస్తే స్టాండింగ్ ఓవేషన్ వచ్చింది. మా అమ్మగారైతే ఈ సినిమా చూసిన తర్వాత కన్నీళ్లు పెట్టుకున్నారు. ఎమోషనల్ పాయింట్‌తోనే రెడీ చేసిన ఓ లైన్ స్రవంతి రవికిశోర్‌కి చెప్పాను. ఆయనకు నచ్చింది. దాన్నొక స్టార్ హీరోతో చేసే ఆలోచనలో ఉన్నాం' అని చెప్పారు.

భారతీయుడు ఈజ్ బ్యాక్..

కమల్ హాసన్, శంకర్ కాంబినేషన్‌లో లైకా ప్రొడక్షన్స్‌తో పాటు రెడ్ జెయింట్ బ్యానర్‌పై సుభాస్కరన్ నిర్మిస్తున్న భారీ బడ్జెట్ చిత్రం 'భారతీయుడు 2'.


1996లో విడుదలై బాక్సాఫీస్ దగ్గర సరికొత్త రికార్డులను క్రియేట్ చేసిన 'ఇండియన్' చిత్రాన్ని 'భారతీయుడు'గా తెలుగులో విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఆ మూవీకి సీక్వెల్‌గా ఇప్పుడు 'భారతీయుడు 2'ని తెరకెక్కిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా ఇంట్రో గ్లింప్స్‌ను మేకర్స్ విడుదల చేశారు. తెలుగులో ఈ గ్లింప్స్‌ను డైరెక్టర్ ఎస్.ఎస్.రాజమౌళి రిలీజ్ చేశారు.

'భారతీయుడు'లో లంచానికి వ్యతిరేకంగా పోరాడిన వీరశేఖరన్ సేనాపతి ఇండియాలో మళ్లీ తప్పు జరిగితే తాను తిరిగి వస్తానని చెప్పటంతో కథ ముగిసింది. అయితే ఇప్పుడు మళ్లీ దేశంలో లంచగొండి తనం పెరిగిపోతోంది. లంచం లేనిదే అధికారులు ఎవరూ ఏ పనులు చేయటం లేదు. దీంతో సామాన్యుడు బతకటమే కష్టంగా మారింది. అప్పుడు భారతీయులందరూ కమ్ బ్యాక్ ఇండియన్ అంటూ హ్యాష్ ట్యాగ్ క్రియేట్ చేసి మళ్లీ దేశంలోకి భారతీయుడు అడుగు పెట్టాలని రిక్వెస్టులు పంపుతారు. చివరకు వీరశేఖరన్ సేనాపతి ఇండియాలోకి అడుగు పెడతారు. వచ్చిన తర్వాత సేనాపతి ఏం చేశారు?, భారతీయుడుకి భయపడి లంచాలు మానేసిన అధికారలు మళ్లీ లంచాలు తీసుకోవటానికి కారణం ఎవరు? పేట్రేగిన లంచం వల్ల దేశంలో ఎలాంటి అల్లకల్లోలాలు జరిగాయి అనే విషయాలను ఈ గ్లింప్స్‌లో చాలా గ్రాండియర్‌గా చూపించారు డైరెక్టర్ శంకర్. ఇదే గ్లింప్స్‌లో కమల్ హాసన్‌తో పాటు హీరో సిద్ధార్థ్, ప్రియా భవానీ శంకర్, రకుల్ ప్రీత్ సింగ్, ఎస్.జె.సూర్య, బాబీ సింహా తదితరులను మనం చూడొచ్చు. ఈ ఇంట్రో గ్లింప్స్‌ను తమిళంలో రజినీకాంత్, హిందీలో ఆమిర్ ఖాన్, మలయాళంలో మోహన్ లాల్, కన్నడలో కిచ్చా సుదీప్ విడుదల చేశారు.



కమల్ హాసన్

నటుడు ఈశ్వరరావు కన్నుమూత



ప్రముఖ సీనియర్ నటుడు ఈశ్వరరావు కన్నుమూశారు. అయితే ఆయన మరణించిన వార్త చాలా ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఈశ్వరరావు గత కొంతకాలంగా అమెరికాలోని మిచిగాన్‌లో ఉంటున్న తన కుమార్తె వద్ద ఉంటున్నారు. వృద్ధాప్య అనారోగ్య సమస్యలతో బాధ పడుతున్న ఆయన అక్టోబర్ 31న తుదిశ్వాస విడిచారు. దర్శకరత్న దాసరి నారాయణరావు దర్శకత్వం వహించిన 'స్వర్గం నరకం' చిత్రం ద్వారా నటుడిగా ఈశ్వరరావు తెలుగు చిత్రసీమకు పరిచయం అయ్యారు. తొలి సినిమాలోని నటనకు గానూ ఆయన కాంస్య నంది అవార్డును అందుకోవడం విశేషం.

అత్యంత సహజంగా ఉండే ఆయన నటన, పోషించిన పాత్రలు ప్రేక్షకుల మదిపై చెరగని ముద్ర వేశాయి. దాదాపు 200కు పైగా సినిమాల్లో నటించిన ఈశ్వరరావు.. ఇండస్ట్రీలోని దాదాపు అందరు అగ్ర దర్శకులు, నటీనటులతో కలిసి పని చేశారు. 'ప్రేమాభిషేకం', 'యుగపురుషుడు', 'దయామయుడు', 'ఘరానా మొగుడు', 'ప్రెసిడెంట్ గారి అబ్బాయి', 'జయం మనదే', 'శభాష్ గోపి', 'దేవతలారా దీవించండి', 'కన్నవారిల్లు', 'ఖైదీ నెం 77', 'ఆడదంటే అలుసా', 'తల్లి దీవెన', 'బంగారు బాట' వంటి తదితర ఎన్నో విజయవంతమైన చిత్రాల్లో ఈశ్వరరావు నటించారు. అలాగే పలు టీవీ సీరియల్స్‌లోనూ ఆయన నటించి, మంచి గుర్తింపు తెచ్చుకున్నారు. ఈశ్వరరావు మృతిపట్ల తెలుగు చిత్ర సీమకు చెందిన పలువురు ప్రముఖులు సోషల్‌మీడియా వేదికగా ఆయనతో తమకి ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకుంటూ సంతాపం వ్యక్తం చేశారు.

అప్పడప్పడ తాండ్ర..



తరుణ్ భాస్కర్

అజయ్ భూపతి దర్శకత్వం వహించిన తాజా సినిమా 'మంగళవారం'. పాయల్ రాజ్‌పుత్, 'రంగం' ఫేమ్ అజ్మల్ అమీర్ జంటగా నటించారు.

ఈ చిత్రానికి అజయ్ భూపతి ఎ క్రియేటివ్ వర్క్స్ నిర్మాణ భాగస్వామి. ముద్ర మీడియా వర్క్స్ పతాకంపై స్వాతి రెడ్డి గునుపాటి, సురేష్ వర్మ .ఎం సంయుక్తంగా నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో దర్శకుడు తరుణ్ భాస్కర్ 'అప్పడప్పడ తాండ్ర ఆవకాయ తాండ్ర...' అంటూ సాగే ప్రత్యేక గీతం చేశారు. గణేష్ ఎ రాసిన ఈ పాటను రాహుల్ సిప్లిగంజ్ ఆలపించారు. శుక్రవారం సాంగ్ లిరికల్ వీడియోని మేకర్స్ విడుదల చేశారు. అజనీష్ లోక్‌నాథ్ బాణీకి తోడు తరుణ్ భాస్కర్ మాసీ గెటప్ 'అప్పడప్పడు తాండ్ర ఆవకాయ తాండ్ర...'లో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పల్లెటూరు వీధుల్లో, పొలం గట్లలో ఫలానా విధంగా జరిగిందంటూ ప్రజలు కథలు కథలుగా చెప్పుకుంటారు. ఆ కథలను పాట రూపంలో ప్రేక్షకుల ముందుకు తీసుకువస్తున్నారు అజయ్ భూపతి. దర్శకుడు అజయ్ భూపతి మాట్లాడుతూ, 'తరుణ్ భాస్కర్ ఈ సాంగ్ చేయడం ఓ స్పెషల్ అయితే... మాస్ గెటప్, లుంగీలో డాన్స్ చేయడం మరో స్పెషల్. కోనసీమలోని ఓ పల్లెటూరిలో ఈ పాటను చిత్రీకరించాం. సినిమాలోని ఓ మంచి సందర్భంలో ఈ పాట వస్తుంది. ఇదొక డిఫరెంట్ యాక్షన్ థ్రిల్లర్. ఇప్పటివరకు ఇండియన్ స్క్రీన్ మీద రానటువంటి ప్రయత్నం చేస్తున్నాం. తప్పకుండా అందరికీ నచ్చే చిత్రమిది' అని చెప్పారు. ఇటీవల విడుదల చేసిన సినిమా ట్రైలర్, పాటలకు మంచి స్పందన లభిస్తుందని నిర్మాతలు స్వాతి రెడ్డి, సురేష్ వర్మ సంతోషం వ్యక్తం చేశారు. ఇప్పుడు 'అప్పడప్పడు తాండ్ర ఆవకాయ తాండ్ర...' పాటు కూడా ప్రేక్షకులందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు.

స్పందన అద్భుతం



ప్రదీప్ మద్దాలి

సత్య దేవ్ హీరోగా '47 డేస్' చిత్రంతో దర్శకుడిగా పరిచయం అయిన ప్రదీప్ మద్దాలి తన రెండో ప్రాజెక్ట్‌గా 'సర్వం శక్తి మయం' అనే సిరీస్‌కి దర్శకత్వం వహిం చారు. ఇటీవల ఆహాలో విడుదలైన ఈ సిరీస్ శక్తి పీఠాలు, హిందూ మతంలోని విశిష్టతను తెలియజేసే విధంగా ఆసక్తికరంగా రూపుదిద్దుకుని విశేష ఆదరణతో దూసుకెళ్తోంది. ఈ సందర్భంగా దర్శకుడు ప్రదీప్ మద్దాలి మాట్లాడుతూ, 'మాది రాజమండ్రి. ఇంజనీరింగ్ కంప్లీట్ చేశాను. రామ్ గోపాల్ వర్మ పరిచయం చేసిన పూరి జగన్నాథ్ దగ్గర ఐదేళ్లు పనిచేసాను. తర్వాత '47 డేస్'తో దర్శకుడిగా మారాను. 'సర్వం శక్తి మయం' లాంటి చాలా పెద్ద స్పాన్ ఉన్న సబ్జెక్టుని చేయడం చాలా పెద్ద బాధ్యత. బివిఎస్ రవి ఈ ఐడియా చెప్పినప్పుడు నాకు బాగా నచ్చి, వెంటనే చేస్తానని చెప్పాను. అయితే ఇంత స్పిరిచ్యుల్ సబ్జెక్టు చేయడానికి కారణం ఇంకొకటి ఉంది. మాది ఆర్థోడాక్స్ ఫామిలీ. అలాగే ఈ సిరీస్ కోసం ప్రియమణి, సంజయ్ సూరి, సమీర్ సోని, ఆశ్లేష ఠాకూర్... లాంటి మాకు అద్భుతమైన నటులు దొరికారు. అమ్మవారి శక్తి పీఠాల కథ ఇందులో చెప్పాం. జీ 5లో హిందీలో జూన్ 9న, ఆహాలో తెలుగు, తమిళంలో అక్టోబర్ 20న విడుదలై మంచి స్పందన రాబట్టుకుంది. ఎంతో మంచి స్పందన చూపిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు. నా నెక్స్ట్ ప్రాజెక్ట్‌గా రామ్ తాళ్లూరి ఎస్ఆర్‌టి ఎంటర్టైన్మెంట్ బ్యానర్‌లో ఓ వెబ్ సిరీస్ చేస్తున్నాను' అని అన్నారు.

భిన్న కథతో తెర చాప



నవీన్ రాజ్ సంకరపు, పూజా సుహాసిని, శ్రీలు కీలక పాత్ర ధారులుగా రూపొందుతున్న చిత్రం 'తెరచాప'.

జోయల్ జార్జ్ దర్శకత్వం వహి స్తున్న ఈ చిత్రాన్ని అనన్యా క్రియేషన్స్, హరితవనం ఎంటర్‌టైన్ మెంట్స్ పతాకాలపై కైలాష్ దుర్గం నిర్మిస్తు న్నారు. ఈ చిత్ర టైటిల్‌ను హీరో విశ్వక్‌సేన్ విడుదల చేశారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'ఈ సినిమా కథ, కథనం, టేకింగ్, నిర్మాణ విలువలు అన్ని విషయాలు నాకు తెలుసు. టైటిల్ డిజైనింగ్ చాలా బావుంది. సినిమా బాగా ఆడి, మంచి విజయాన్ని ఈ టీమ్‌కి అందించాలని కోరుకుంటున్నా' అని తెలిపారు.

జగదీష్ ప్రతాప్ బండారి, రాజీవ్ కనకాల, రాకీ, నాగ మహేష్, పృథ్వీరాజ్‌జీ, ఫిష్ వెంకట్, అశోక్ జబర్దస్త్, నాగి జబర్దస్త్, అప్పారావు జబర్దస్త్, రైజింగ్ రాజు, రాజేష్ భూపతి, శ్రీనివాస్‌జీ, మాయ మశ్చీంద్ర తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి నిర్మాత : కైలాష్ దుర్గం, సంగీతం: ప్రజ్వల్ క్రిష్, మాటలు - పాటలు : మిద్దె మనోజ్‌కుమార్, కెమెరా: అజీమ్ - వెంకట్, ఎడిటర్: బొడిసింగి రాజు.

పెసలు ఆరోగ్యానికి ఎంత మంచివో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అందుకే ఎక్కువ శాతం వాటిని మొలకలుగా చేసుకొని తింటున్నారు. ఇవి శరీర సమతుల్యతకు దోహదపడతాయి. అయితే ఈ పెసల వల్ల చర్మానికి కూడా ఎన్నో ప్రయోజనాలున్నాయి. చర్మం మృదువుగా, కోమలంగా, కాంతివంతంగా మారాలంటే పెసలుతో ఫేస్‌ప్యాక్ వేసుకోవచ్చు. అది ఎలా చేసుకోవాలో తెలుసుకుందాం.

పెసలతో ఫేస్‌ప్యాక్



తయారీ ఇలా : రెండు చెంచాల పెసలను రాత్రి పూట నానబెట్టాలి. ఉదయం ఆ పెసలును పేస్టులా చేసుకోవాలి. అందులో చెంచా బాదం నూనె, మరో చెంచా తేనె వేసి కలపాలి. ఈ పేస్టును ముఖానికి రాసుకొని... 15 నిమిషాలు ఆరనివ్వాలి. తర్వాత నీటితో కడిగేసుకుంటే కోమలమైన చర్మం మీ సొంతం.

మృదువైన చర్మం కోసం... : పెసలును గ్రైండ్ చేసి... పొడి చేసుకోవాలి. ఇందులో ఓ చెంచా తేనె వేసి కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పావు గంట లేదా పూర్తిగా ఆరిపోయేవరకూ అలా వదిలేయాలి. తర్వాత దూది లేదా నీటితో తుడిచేయాలి. ఇలా కొన్ని రోజులు చేస్తే... చర్మం సాఫ్ట్‌గా ఉంటుంది.


మృతకణాల తొలగింపుకు.. : పెసలతో పేస్టు తయారు చేసి అందులో చెంచా తేనె కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి 15 నిమిషాలు అలా ఉంచేయాలి. తర్వాత నీటితో కడిగెయ్యాలి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే, చర్మంపై మృతకణాలు, క్రిములు తొలగిపోతాయి.

మచ్చలు పోవాలంటే: పెసలు పేస్టులో రెండు చెంచాల యోగర్ట్ వేసి కలపాలి. మచ్చలున్న చర్మంపై ఈ మిశ్రమాన్ని రాయాలి. పది నిమిషాలు అలా వదిలేసి, తర్వాత చల్లటి నీటితో కడిగెయ్యాలి. ఇలా చేస్తూ ఉంటే చర్మంపై ఏర్పడిన మచ్చలు నెమ్మదిగా తొలగిపోతాయి.

బచ్చలికూర తినండి

శరీరం ఆరోగ్యవంతంగా ఉండాలంటే కూరగాయలతో పాటు ఆకుకూరలను తీసుకోవడం కూడా చాలా ముఖ్యం. ప్రతి ఆకుకూరలో ఒక్కో రకమైన పోషకాలుంటాయి. అందులో బచ్చలి కూరలో ఏమేమి పోషకాలుంటాయో తెలుసుకుందాం...

- బచ్చలికూరలో విటమిన్ ఎ అధికంగా ఉంటుంది, ఇది కంటి ఆరోగ్యానికి ముఖ్యమైనది. ఈ విటమిన్ లోపం వల్ల కండ్లు పొడిబారడం, రేచీకటి సమస్యలు ఏర్పడతాయి. ఇందులో విటమిన్ ఎ దాదాపు 63 శాతం వుంటుంది.
- యాంటీఆక్సిడెంట్లు పెరగాలంటే బచ్చలికూర రసం తాగడం గొప్ప మార్గం. యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్‌ను తటస్తం చేస్తాయి. ఫలితంగా దీర్ఘకాలిక వ్యాధుల నుండి రక్షణ కలుగుతుంది.
- బచ్చలికూర రసంలో నైట్రేట్లు ఎక్కువగా ఉంటాయి. ఇది రక్త నాళాలను విడదీయడానికి సహాయపడే ఒక రకమైన సమ్మేళనం. ఇది రక్తపోటును తగ్గించి రక్త ప్రవాహాన్ని పెంచుతుంది. రోజూ బచ్చలికూర సూప్ తినడం వల్ల రక్తపోటు, ధమనుల ధృడత్వం తగ్గుతాయని 27 మందిపై 7 రోజుల అధ్యయనంలో తేలిన అంశం.



- ఒక కప్పు అంటే... 240 ఎంఎల్ బచ్చలికూర రసంలో విటమిన్ సి 38 శాతం ఉంటుంది. ఇది నీటిలో కరిగే విటమిన్. ఇది యాంటీఆక్సిడెంట్‌గా రెట్టింపు అవుతుంది. విటమిన్ సి చర్మాన్ని ఆక్సీకరణ ఒత్తిడి, మంట, చర్మ నష్టం నుండి రక్షిస్తుందని అధ్యయనాలు చెబుతున్నాయి. ఇవన్నీ వృద్ధాప్య సంకేతాలను వేగవంతం చేస్తాయి. బచ్చలికూరను తినేవారిలో వృద్ధాప్య లక్షణాలు నెమ్మదిస్తాయి.



ఐద్వా అదాలత్
సెల్: 9490098024

అష్టమ వ్యసనం

ఏదైనా ఒక దాని మీద మితిమీరిన ఆసక్తి, నియంత్రణ లేని కోరికలతో మనుషులు కొన్నింటికి బానిసగా మారిపోతున్నారు. ఇప్పటికే సమాజంలో ఉన్న సప్త వ్యసనాలతో ప్రజలు అనేక కష్టాలు పడుతుంటారు. ఇప్పుడు వీటికి తోడు అష్టమ వ్యసనంగా కొత్తగా స్మార్ట్ ఫోన్ కూడా వచ్చి చేరింది. ప్రస్తుతం ఫోన్ మన జీవితంలో భాగంగా మారిపోయింది. ఉదయం నుండి సాయంత్రం పడుకునే వరకు చేతిలో ఫోన్ లేకుండా ఉండలేని స్థితి. మనకు తెలియకుండానే ఫోన్‌పై ఆధారపడి పోయాము. ఈ స్మార్ట్ ఫోన్ వ్యసనంతోనే చాలా మంది అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అలాంటి ఓ సమస్యే ఈ వారం ఐద్వా అదాలత్...

దివ్యకు 40 ఏండ్లు. ఓ ప్రయివేటు కంపెనీలో ఉద్యోగం చేస్తుంది. భర్త కార్తిక్‌కు ఆమెకు మధ్య దాదాపుగా 10 ఏండ్లు వయసు తేడా ఉంటుంది. వీరికి ఇద్దరు పిల్లలు. పాప డిగ్రీ చేస్తుంది, బాబు ఇంటర్. భర్తకు కూడా మంచి ఉద్యోగం. ఇంట్లో ఉండేది ఆ నలుగురే. కానీ ఒకరితో ఒకరు మాట్లాడుకోరు. ఇంటికి రాగానే దివ్య ఇంటి పనిలో బిజీగా ఉంటుంది. పిల్లలిద్దరూ చెరో ఫోన్‌లో ఛాటింగ్ చేస్తూ, మాట్లాడుకుంటూ ఉంటారు. చదువు కూడా మొత్తం ఫోన్‌లోనే. 'ఫోన్లు కొద్దిసేపు పక్కన పెట్టి, కొద్దిసేపు సరదాగా మాట్లాడుకోవచ్చు కదా?' అని దివ్య అంటే 'మాకు చదువుకోవల్సింది చాలా ఉంది' అంటూనే సోషల్ మీడియాలో బిజీగా ఉంటారు.

అదే స్కూల్లో ఉన్నప్పుడైతే పాప రోజుమొత్తం స్కూల్లో ఏం జరిగిందో అదే పనిగా చెబుతుండేది. 'నాకెందుకు నీ పాఠాలు' అన్నా వినేది కాదు. అలాంటిది ఇప్పుడు లాప్‌టాప్ ముందు నుండి కదలడం లేదు. తిండి కూడా దాని ముందే. 'అది పక్కన పెట్టి తిను' అన్నా వినదు. ఇక బాబైతే గేమ్స్ ఆడుకుంటూనే ఉంటుంది. ఆ ఫోన్‌లో ఆడే బదులు బయట ఫ్రెండ్స్‌తో ఆడుకోవచ్చు కదా? అన్నా వినడు. బాబుకు ఇంటి దగ్గర ఎవరూ స్నేహితుల్లేరు. కుటుంబ సభ్యులతోనూ కలవడు. ఇంట్లో వాళ్ళు మాట్లాడించినా మాట్లాడడు. ఇలా అయితే పిల్లలకు బయటి సమాజం గురించి ఎలా తెలుస్తుంది? వారి భవిష్యత్ తలచుకుంటేనే దివ్యకు చాలా భయంగా ఉంది.

ఇక భర్త విషమానికి వస్తే ఆయన కూడా ఆఫీస్ నుండి రాగానే ఫోన్ చూస్తూ కూర్చుంటాడు. అంతకు ముందు కార్తిక్ ఇంటికి వచ్చిన తర్వాత అందరితో కాస్త సరదాగా గడిపేవాడు. కలిసి భోజనం చేసి కొద్దిసేపు టివి చూసేవారు. కానీ ఇప్పుడు మొత్తం మారి పోయింది. టివి నడుస్తూనే ఉంటుంది. కానీ దాన్ని దివ్య తప్ప ఎవరూ చూడరు. కనీసం రూమ్‌లోకి వెళ్ళినా తర్వాతైనా భర్త మాట్లాడతాడా? అంటే అదీ లేదు. కార్తీక్



నేను ఈ మధ్య దివ్యతోనే కాదు పిల్లలతో కూడా సరిగ్గా మాట్లాడడం లేదు. పిల్లలు కూడా ఎప్పుడూ ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. ఇవేవీ నేను పట్టించుకోవడం లేదు. దివ్య ఇంత బాధపడుతుందని అస్సలు అనుకోలేదు. నా వైపు నుండి పొరపాటు జరిగింది. మీరు చెప్పినట్టు నా అలవాట్లు మార్చుకుంటాను. పిల్లల్ని కూడా మార్చుకుంటాను.

రూమ్‌లో కూడా ఫోన్ చూస్తూ ఉంటాడు. దివ్య ఏదైనా మాట్లాడాలంటే చెప్పు అంటారు. కానీ ఆమె చెప్పేది మాత్రం పట్టించుకోడు. 'నీకు నిద్ర వస్తే పడుకో, నేను కొద్దిసేపు ఫోన్ చూసి పడుకుంటాను' అంటారు. భార్యతో సంతోషంగా గడపాల్సిన సమయం కూడా ఫోన్‌కే ఇచ్చేస్తాడు. దాంతో వాళ్ళిద్దరి మధ్య గొడవలు మొదలయ్యాయి. 'మీరు ఫోన్ చూస్తూ నా గురించి, పిల్లల గురించి పట్టించుకోవడం లేదు. ఇలా అయితే నేను ఇంట్లో నుండి వెళ్ళిపోతాను' అన్నా కార్తీక్ పట్టించుకోడు.

దివ్య సమస్య తెలుసుకున్న మేము కార్తీక్‌ని పిలిచి మాట్లాడితే 'ఉదయం నుండి సాయంత్రం వరకు ఆఫీస్‌లో బిజీగా వుంటాను. ఇంటికి వచ్చిన తర్వాత కొద్ది సేపు ఫోన్ చూస్తాను. దానికి కూడా నాతో గొడవ పెట్టుకుంటుంది. ఆఫీస్‌లో పని ఒత్తిడి ఉంటుంది. అందుకే ఇంటికి వచ్చిన తర్వాత కాస్త రిలాక్స్ కోసం ఫోన్ చూస్తాను. అంతే తప్ప దివ్యను నిర్లక్ష్యం చేయాలని కాదు. అయినా నన్ను అర్థ చేసుకోకుండా ఈ చిన్న విషయానికే ఇక్కడి వరకు వచ్చింది' అంటూ దివ్యపై కోపగించుకున్నాడు. ఆమె ఎంతగా బాధ పడుతుందో మాత్రం అర్థం చేసుకునే ప్రయత్నం చేయలేదు. "మీకు పెండ్లయి 20 ఏండ్లు అవుతుంది. ఆమె ఎప్పుడూ మీతో గొడవ పెట్టుకోలేదు. అలాంటిది ఇప్పుడు ఆమె ఎందుకు మీతో గొడవ పెట్టుకుంటుంది? అనే విషయం కూడా మీరు పట్టించుకోవడం లేదు. కనీసం ఆలోచించే సమయం కూడా మీకు లేదు. ఇంతకు ముందు ఇంట్లో అందరూ కలిసి సరదాగా మాట్లాడుకునేవారు, తినేవారు, టీవీ చూసేవారు. ఇప్పుడు ఎలా ఉంటున్నారు. ఒకే ఇంట్లో ఉన్నా ఎవరి బిజీలో వారు ఉంటున్నారు. మీతో పాటు దివ్యకూడా ఉద్యోగం చేస్తుంది. ఆమె కూడా ఉదయం వెళ్ళి సాయంత్రం వస్తుంది. ఆమెకూ కాస్త విశ్రాంతి తీసుకోవాలని ఉంటుంది కదా? మీరే ఇలా ఉంటే ఇక పిల్లలకి ఎలా చెబుతారు. వాళ్ళూ అలాగే తయారయ్యారు. దివ్య ఇంటికి రాగానే ఇంటిపని, వంటిపని అంటూ చేసుకుంటుంది. మీరేమే ఫోనుల్లో బిజీగా ఉంటున్నారు. పిల్లల భవిష్యత్ గురించి ఆందోళన చెందుతుంది. మీరు ఇవేమీ అర్థం చేసుకోవడం లేదు. పైగా దీన్ని చిన్న విషయంలా మీకు కనిపిస్తుంది. మీ బాబు ఎవరితో కలవకుండా ఉంటే తర్వాత అతను ఎలా తయారవుతాడు. అందరూ కలిసి సరాగా మాట్లాడుకుంటే పిల్లలు కూడా ఆరోగ్యకరమైన వాతావరణంలో పెరుగుతారు. అందుకే మీ ఫోన్ పక్కన పెట్టి పిల్లలతో కొంత సమయం గడపండి. బాబుకు కాలేజీలో ఏదైనా ఇబ్బంది ఉందేమో తెలుసుకోండి. పిల్లలు ఎలాంటి వారితో స్నేహం చేస్తున్నారో మీరు తెలుసుకోవాలి.

అలాగే దివ్యకు కొంత సమయం కేటాయించాలి. అదే మీ బంధాన్ని బలంగా ముందుకు తీసుకెళుతుంది. అలా కాకుండా మీరు ఫోన్‌తో గడిపితే అది మీ మధ్య దూరం పెంచుతుంది. మీ ఇద్దరి మధ్య దూరం మీ పిల్లల భవిష్యత్తుపై ప్రభావం చూపుతుంది. అందుకని మీరు మారాలి. వాస్తవ పరిస్థితులు అర్థం చేసుకుని కుటుంబాన్ని సరిదిద్దాలి. అప్పుడే మీ ఇద్దరి బంధంతో పాటు పిల్లల భవిష్యత్ కూడా బాగుంటుంది' అని చెప్పారు

అంతా విన్న కార్తిక్ 'మీరు చెప్పిది నిజమే మేడమ్. నేను ఈ మధ్య దివ్యతోనే కాదు పిల్లలతో కూడా సరిగ్గా మాట్లాడడం లేదు. పిల్లలు కూడా ఎప్పుడూ ఫోన్ చూస్తూ గడిపేస్తున్నారు. ఇవేవీ నేను పట్టించుకోవడం లేదు. దివ్య ఇంత బాధపడుతుందని అస్సలు అనుకోలేదు. నా వైపు నుండి పొరపాటు జరిగింది. మీరు చెప్పినట్టు నా అలవాట్లు మార్చుకుంటాను. పిల్లల్ని కూడా మార్చుకుంటాను. మళ్ళీ అందరం సరదాగా ఉండేలా చూస్తాను' అని చెప్పి దివ్యను తీసుకొని వెళ్ళాడు.

వారం తర్వాత దివ్య ఫోన్ చేసి 'మేడమ్ ఇప్పుడు మా వారు చాలా వరకు మారారు. మా పిల్లలే కాస్త మొండిగా ఉన్నారు. వాళ్ళను కూడా మార్చుకోగలను అనే నమ్మకం వచ్చింది' అని చెప్పి సంతోషంగా ఫోన్ పెట్టేసింది.

- వై. వరలక్ష్మి, 9948794051

ఎన్నికల వేళ..కమిటీలు ఖాళీ

(మొదటిపేజీ తరువాయి)

తుది ఎంపిక జాప్యం కావడానికి ఇదీ ఒక కారణమైందనీ, హడావిడిగా షార్ట్ లిస్టు చేయడంతో అనేక పొరపాట్లు జరిగాయని ఆ పార్టీ కీలక నేతలే వ్యాఖ్యానిస్తున్నారు. కిషన్‌రెడ్డి, రాజేందర్, సంజయ్, లక్ష్మణ్ తమకు నచ్చిన వారికి ప్రాధాన్యత ఇచ్చారనే విమర్శా ఉంది. అయితే, ఆ నేతల మధ్యా భేదాభిప్రాయాలున్న సీట్లను మాత్రం పక్కన బెట్టినట్టు తెలిసింది. ఎస్సీ నియోజకవర్గాల కోఆర్డినేషన్ కమిటీ చైర్మెన్‌గా జితేందర్ రెడ్డి ఉన్నారు. తన కొడుకు గెలుపు కోసం ఆయన పాలమూరు నియోజకవర్గానికే పరిమితమయ్యారు. ఎస్సీ నియోజకవర్గాల్లో ఆ పార్టీకి పోటీ చేసే అభ్యర్థులే దొరక్కపోవడాన్ని చూస్తేనే ఆ కమిటీ పనితీరు ఎలా ఉందో అర్థం చేసుకోవచ్చు.

మ్యానిఫెస్టో ఎలా?

ఏ పార్టీ అయినా ఎన్నికల్లో గెలిచి అధికారంలోకి వస్తే ప్రజలకు ఏం చేస్తామనే వివరిస్తూ రూపొందించేదే మ్యానిఫెస్టో. ప్రత్యర్థి పార్టీలకు ఊహకందని..ప్రజల్ని ఆకర్షించే అంశాలని అందులో చేర్చడం పరిపాటి. బీజేపీ మ్యానిఫెస్టో రూపకల్పన చైర్మెన్‌గా వివేక్‌ను నియమించారేగానీ ఆయనకు స్వేచ్ఛ ఇవ్వలేదనే విమర్శ ఉంది. అదే సమయంలో బీజేపీ లోపాయికారిగా బీఆర్‌ఎస్‌కు వంత పాడుతుందనే ప్రచారం జోరందుకోవడం, టికెట్ల కేటాయింపులో జరుగుతున్న పరిణామాలను చూసి వివేక్ జీర్ణించుకోలేకపోయారు. రెండు సార్లు రాజకీయంగా తనను నమ్మించి మోసం చేసిన కేసీఆర్ పార్టీని ఓడగొట్టడమే లక్ష్యంతో ఆయన బీజేపీలో చేరిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఆ పార్టీలో ఉంటే తన లక్ష్యం నెరవేరదని గ్రహించి 'భూమి గుండ్రంగా తిరుగును' అనే రీతిలో ఆరేండ్లలో ఆరుసార్లు పార్టీలు మారి తిరిగి సొంత గూటికే(హస్తం పార్టీకి) చేరారు. ఆయన వెళ్లిపోవడం, ఆయన సహకారిగా ఉన్న కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సైతం సైలెంట్‌గా ఉంటుండటంతో మ్యానిఫెస్టో రూపకల్పన చేయడం బీజేపీ అధిష్టానానికి పెద్ద తలనొప్పిగా మారింది. మీరూ వద్దు..మీ పదవులూ వద్దు అంటూ ఎలక్షన్ ఇష్యూస్ కమిటీ కన్వీనర్ పోస్టుకు కపిలవాయి దిలీప్‌కుమార్ రాంరాం చెప్పేశారు.బీజేపీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిపోయారు.

పనిలో లేని రాష్ట్ర కేంద్రం సమన్వయ కమిటీ

ఎన్నికల వేళ నాయకులందర్నీ సమన్వయ పరిచేందుకు, జాతీయ, రాష్ట్ర నేతల మధ్య కో-ఆర్డినేషన్ ఉండేలా చేసేందుకు బీజేపీ రాష్ట్ర కమిటీ రాష్ట్ర కేంద్రం సమన్వయ కమిటీ చైర్మెన్‌గా నల్లు ఇంద్రసేనారెడ్డిని నియమించింది. కానీ, ఎన్నికల సమయంలో పార్టీకి దూరమవుతున్న రెడ్డి సామాజిక తరగతి వారి ఓట్లను ఆకర్షించే పనిలో భాగంగా కేంద్ర నాయకత్వం ఆయనకు గవర్నర్ పదవిని కట్టబెట్టింది. త్రిపుర రాష్ట్రానికి పంపించింది. దీంతో రాష్ట్ర కేంద్రంలో సమన్వయం కరువైంది. రాష్ట్ర ఆఫీసులో టికెట్లు దక్కని నేతలు ఆందోళన చేస్తున్నా పట్టించుకోని వైనం స్పష్టంగా కనిపిస్తున్నది. వారే నాలుగైదు గంటలు ఆందోళన చేసి ఎంత మొత్తుకున్నా వీరితో ప్రయోజనం ఉండదని గ్రహించి అసంతృప్తితో తిరుగుబాట పడుతున్నారు. సమన్వయ కమిటీ పనిలో లేకపోవడం సమస్యగా మారింది.

పోరాటాల్లేవు.. తీవ్రమవుతున్న నిరసనలు

రాష్ట్ర ప్రభుత్వ విధానాలను ఎత్తిచూపుతూ ఎన్నికల వేళ పోరాటాల ద్వారా ప్రజల్ని ఆకర్షించే పనిని బీజేపీ రాష్ట్ర నాయకత్వం విజయశాంతికి అప్పగించింది. పోరాట కమిటీకి ఆమెను చైర్మెన్‌గా నియమించింది. ఆ పదవి కట్టబెట్టినప్పటి నుంచి ఆమె బీజేపీ ఆఫీసు మొహమే చూడట్లేదు. పైగా, బీజేపీ నేతల తీరుపై విమర్శలు ఎక్కుపెట్టేలా ఎక్స్(ట్విట్టర్)లో పోస్టులు పెడుతున్నది. ఆమె కూడా కాంగ్రెస్ పార్టీలో చేరబోతున్నారనే చర్చ నడుస్తున్నది. బీజేపీ ఆధ్వర్యంలో ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే పోరాటాలు జరగట్లేదు గానీ టికెట్లు దక్కని నేతలు రాష్ట్ర కార్యాలయం వద్ద రోజుకొకరు నిరసనలకు దిగుతున్నారు. ఇలా నేతలు పార్టీ మారడంతో ఖాళీ అయిన స్థానాల్లో కొత్త వారిని నియమిస్తారా? లేక అలాగే ఎన్నికలకు వెళ్తారా? అనేది అంతుచిక్కడంలేదు.

కుల గణనకు ఏపీ క్యాబినెట్ ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

కర్నూలు జిల్లాలో 800 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు ఆమోదం తెలిపింది.రాష్ట్రంలో కుల గణన, సామాజిక, ఆర్థిక అంశాల గణన చేపట్టేందుకు క్యాబినెట్ ఆమోదముద్ర వేసింది. పోలవరం నిర్వాసితుల ఇండ్ల పట్టాలు, స్థలాల రిజిస్ట్రేషన్‌కు స్టాంప్‌డ్యూటీ, రిజిస్ట్రేషన్ ఫీజు, యూజర్ చార్జీల మినహాయింపునకు మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఫెర్రో అల్లాయిస్ పరిశ్రమలకు విద్యుత్‌పై రాయితీ వచ్చేందుకు ఆమోదం తెలిపింది. పెట్టుబడుల ప్రోత్సాహక బోర్డులో పరిశ్రమల ఏర్పాటు నిర్ణయాలకు ఆమోదముద్ర వేసింది.

బీజేపీని గద్దెదించుతాం

- **పాత పెన్షన్ పునరుద్ధరించకుంటే ఉద్యమం ఉధృతం**
- **రాంలీలా ర్యాలీలో కేంద్ర ప్రభుత్వానికి ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘం నేతల హెచ్చరిక**
- **కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలి**
- **కదంతొక్కిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు**
- **మోడీ ప్రభుత్వాన్ని ఓడించటమే తక్షణ కర్తవ్యం : తపన్ సేన్**

నవతెలంగాణ-న్యూఢిల్లీ బ్యూరో

వచ్చే లోక్‌సభ ఎన్నికలలోగా జాతీయ పెన్షన్ పథకాన్ని (ఎన్పీఎస్) రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించకుంటే కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్ల సంఘాల నేతలు హెచ్చరించారు. కాంట్రాక్టు నియామకాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం నాడిక్కడ రాంలీలా మైదానంలో కాన్ఫెడరేషన్ ఆఫ్ సెంట్రల్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ (సీసీజీఈడబ్ల్యూ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (ఎఐఎస్‌జీఈఎఫ్), స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ), ఆల్ ఇండియా స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ ఫెడరేషన్ (ఎఐఎస్ జీపీఎఫ్), నేషనల్ కోఆర్డినేషన్ కమిటీ ఆఫ్ పెన్షనర్ల అసోసియేషన్ (ఎన్సీసీపీఏ) సంఘాలు సంయుక్తంగా నిర్వహించిన చేతావనీ ర్యాలీలో దేశ నలుమూలల నుంచి వేలాది మంది కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు పాల్గొన్నారు. "ఎన్పీఎస్ రద్దు చేయాలి, ఓపీఎస్ పునరుద్ధరించాలి, ఎన్ఈపీని వెనక్కి తీసుకోవాలి" అంటూ డిమాండ్ చేస్తూ ఇంగ్లీష్, హిందీ భాషలతో పాటు ప్రాంతీయ భాషల్లో డిమాండ్లతో కూడిన ప్లకార్డులు, బ్యానర్లు చేబూని దేశ రాజధాని ఢిల్లీలో కదంతొక్కారు. మోడీ సర్కార్ విధానాలకు వ్యతిరేకంగా నినాదాలు హోరెత్తించారు. అనంతరం ఉద్యోగ సంఘ నేత సుభాష్ లాంబ, ఉపాధ్యాయ సంఘం నేత సిఎన్ భార్తి అధ్యక్ష వర్గంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలో సీఐటీయూ ప్రధాన కార్యదర్శి తపన్ సేన్ మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ ప్రయివేటీకరణ విధానాలను తీవ్రంగా ఎండగట్టారు. ప్రభుత్వ రంగ సంస్థల ప్రయివేటీకరణ, పెన్షన్ ప్రయివేటీకరణకు మూలకారణమైన మోడీ ప్రభుత్వాన్ని ఓడించటమే తక్షణ కర్తవ్యం అని అన్నారు. అఖిల భారత రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమాఖ్య జాతీయ ప్రధాన కార్యదర్శి ఏ. శ్రీకుమార్ మాట్లాడుతూ పీఎఫ్‌ఆర్డీఏను రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను మానుకోవాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా ఉన్న ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని, కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతనాలు ఇవ్వాలని, వారిని రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (ఎస్టీఎఫ్ఐ) అధ్యక్షుడు కె ఎస్ హరికృష్ణ మాట్లాడుతూ విద్యలో కేంద్రీకరణ, వ్యాపారీకరణ, కాషాయీకరణలకు దోహదపడుతున్న జాతీయ విద్యా విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల నేతలు ఎస్పి యాదవ్, రూపక్ సర్కార్, సిఎన్ భారతి, అశోక్ తులే, కె రాఘవేంద్రన్ మాట్లాడారు.



తెలుగు రాష్ట్రాల నుంచి వేలాది మంది

తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల నుంచి ఎస్టీఎఫ్ఐ అనుబంధ సంఘం యూటీఎఫ్ ఆధ్వర్యంలో వందలాది మంది ఉపాధ్యాయులు చలో ఢిల్లీలో పాల్గొన్నారు. ఎస్టీఎఫ్ఐ ఉపాధ్యక్షులు, టీఎస్ యూటీఎఫ్ ప్రధాన కార్యదర్శి చావ రవి, మహిళా విభాగం అధ్యక్షురాలు ఎం. సంయుక్త, రాష్ట్ర అధ్యక్షులు కె. జంగయ్య, ఉపాధ్యక్షులు సిహెచ్ దుర్గాభవాని, కోశాధికారి టి. లక్ష్మారెడ్డి, కార్యదర్శులు శాంతికుమారి, నాగమణి, రవికుమార్, మాణిక్ రెడ్డి, వెంకటప్ప, వెంకటేష్, గోపాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీకి ఓట్లడిగే అర్హతెక్కడిది..?

(మొదటిపేజీ తరువాయి)

వారికి ఈ పరిస్థితి ఉండేదా అని ప్రశ్నించారు. పార్టీలు చెప్పే మాయమాటలు నమ్మి మోసపోద్దని, ఆయా పార్టీల చరిత్ర చూసి ఓటేయ్యాలని పిలుపునిచ్చారు. శుక్రవారం ముధోల్, కోరుట్ల, ఆర్మూర్ నియోజకవర్గాల్లో నిర్వహించిన బీఆర్ఎస్ ప్రజా ఆశీర్వాద సభల్లో సీఎం కేసీఆర్ పాల్గొని మాట్లాడారు.

భైంసా అంటేనే అన్ని అబద్ధాలు చెప్పారని, ఇక్కడ హిందూ, ముస్లింలు ఏండ్లుగా కలిసి బతుకుతున్నారని తెలిపారు. దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 75ఏండ్లు గడిచిపోయినా ఎన్నికలు రాగానే అబద్ధాలు, అబండాలు సహజమైపోయాయని, ప్రజాస్వామానికి ఇంకా పరిణతి రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో రైతుబంధు దుబారా అని ఉత్తమ్‌కుమార్‌రెడ్డి చెబుతుండగా.. 3 గంటలు కరెంటు చాలు అని రేవంత్‌రెడ్డి చెబుతున్నారని, ఇది సరైన పద్ధతేనా అని ఆగ్రహం వ్యక్తం చేశారు. పక్కనున్న మహారాష్ట్ర రైతులు ఇక్కడ బోర్లు వేసి అక్కడ పంటలు పండిస్తున్నారు. అక్కడి కంటే ఇక్కడి రోడ్ల పరిస్థితి చాలా మెరుగ్గా ఉందని తెలిపారు. తెలంగాణ రాష్ట్రం గతంలో ఆగమాగం ఉండేదని, వ్యవసాయ స్థిరీకరణ చేయాలని నిర్ణయించామని తెలిపారు. కాంగ్రెస్ వస్తే ధరణి తీసేస్తామని చెబుతున్నారని, ఈ పోర్టల్ లేకపోతే మళ్లీ దళారుల రాజ్యం వస్తుందని చెప్పారు.

గతంలో గడ్డెన్నవాగు ప్రాజెక్టు ద్వారా 4వేల ఎకరాలకు నీరందించేవారని, ఇప్పుడు 12వేల ఎకరాలకు సాగునీరందుతోందని తెలిపారు. రైతుబంధు సాయంతో రైతులు అప్పులు తీర్చుకుంటున్నారని, కాంగ్రెస్ హయాంలో ఎరువులు, విత్తనాలు పోలీస్‌స్టేషన్‌లో లభించేవని, ఇప్పుడా పరిస్థితి లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఎలాంటి కర్ఫ్యూ, కరువు లేకుండా కులం, మతం అన్న భేదం లేకుండా అందరూ సమానంగా బతుకుతున్నారని తెలిపారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమని, మరోసారి ముధోల్ ఎమ్మెల్యేగా విఠల్‌రెడ్డిని గెలిపించాలని అభ్యర్థించారు. సభలో మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి, ఎంపీ దామోదర్‌రావు, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, మాజీ ఎంపీ గోడం నగేష్, మాజీ ఎమ్మెల్సీ పురాణం సతీష్, మాజీ జడ్పీ చైర్మెన్ లోలం శ్యాంసుందర్, డా.రమాదేవి పాల్గొన్నారు.

బీడీ కార్మికుల పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ

బీడీ కార్మికులకు దేశంలో ఏ రాష్ట్రంలో కూడా పెన్షన్ ఇవ్వడం లేదని, తెలంగాణ మాత్రమే పెన్షన్ ఇస్తున్నట్టు తెలిపారు. గత పాలనలో కోరుట్ల, సిరిసిల్ల, పోచంపల్లిలో చేనేత కార్మికుల ఆత్మహత్యలు ఉండేవని, తాము అధికారంలోకి వచ్చిన తరువాత చేనేత కార్మికులకు సబ్సిడీలు ఇస్తూ వారికి భరోసా కల్పించామని గుర్తు చేశారు.

ధరణి ఆధారంగానే రైతుబంధు, రైతుబీమా అందిస్తున్నామని, ధరణి లేకుంటే అవి ఎలా సాధ్యమవుతాయని ప్రశ్నించారు. ధరణి ఉండాలంటే బీఆర్ఎస్‌ను మళ్లీ గెలిపించాలన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి తాము 24 గంటల కరెంట్ అందిస్తుంటే, కాంగ్రెస్ వాళ్ళు 3 గంటలు సరిపోతుందని అంటున్నారని విమర్శించారు. బీఆర్ఎస్ పాలనలో తెలంగాణ అన్ని రంగాల్లో నెంబర్‌వన్ అయిందన్నారు. రాష్ట్రంలో వ్యవసాయానికి సాగునీటి ఇబ్బంది లేకుండా బీఆర్ఎస్ చేసిందని తెలిపారు. గ్రామాలు, వార్డుల్లో జరిగిన అభివృద్ధిని చూసి ఓటు వేయాలని సీఎం అభ్యర్థించారు.

కాంగ్రెస్ ఇవ్వదు.. ఇస్తే కండ్లమంట

దేశాన్ని, రాష్ట్రాన్ని 50 ఏండ్లపాటు పాలించిన కాంగ్రెస్ ప్రజలకు ఏం మేలు చేసిందని సీఎం కేసీఆర్ ప్రశ్నించారు. రైతుబంధు దుబారా అని కాంగ్రెస్ నేతలు అంటున్నారని, రైతులకు 24 గంటల కరెంట్ అవసరం లేదంటున్న ఇలాంటి పార్టీ మనకు అవసరమా అని ప్రశ్నించారు. బీఆర్ఎస్ అధికారంలోకి రాకముందు, వచ్చాక చేసిన అభివృద్ధి ప్రజలకు కండ్లముందే కనబడుతుందని, నా బావ చెప్పిండు.. బంధువు చెప్పిండని కాకుండా.. ఆలోచన చేసి బీఆర్ఎస్ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. రాష్ట్ర ఆదాయం పెరిగేకొద్దీ సంక్షేమ పథకాలు పెంచుతున్నామని చెప్పారు. తెలంగాణ కోసమే బీఆర్ఎస్ పుట్టిందన్న కేసీఆర్.. ఆర్మూర్ నియోజకవర్గ అభ్యర్థి జీవన్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని ప్రజలను కోరారు. ప్రజలకు మేలు చేసేది బి.ఆర్.ఎస్ ప్రభుత్వమే అని వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో ప్రజలంతా బ్రహ్మాస్త్రాన్ని సంధించాలంటూ పిలుపునిచ్చారు.

మోడీ బొమ్మతో కష్టమే

(మొదటిపేజీ తరువాయి)

వారు ఈ ఏడాదిలో ముగిసిన కర్నాటక అసెంబ్లీ ఎన్నికలను ఉదహరిస్తున్నారు. కర్నాటక రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీ తీవ్ర ప్రజా వ్యతిరేకతను ఎదుర్కొన్నది. ఐదేండ్ల బీజేపీ పాలనపై ఎన్నడూ లేని అసంతృప్తి వ్యక్తమైంది. ఈ తరుణంలో బీజేపీ తరపున ప్రచార బాధ్యతను తన భుజాలపై వేసుకొని ప్రధాని మోడీ రంగంలోకి దిగారు. రాష్ట్రమంతా తిరిగి ప్రచారాన్ని నిర్వహించారు. ఇందుకోసం బీజేపీ తన ఆయుధమైన హిందూత్వను భారీ స్థాయిలో సైతం వినియోగించింది. 'బజరంగబలి' అంటూ మోడీ హిందూ, ముస్లిం ఓట్లను చీల్చే ప్రయత్నాన్నీ చేశారు. అయితే, కర్నాటక ఎన్నికల్లో అవేమీ పని చేయలేదు. ఈ ఎన్నికల్లో బీజేపీ దారుణ ఓటమిని చవి చూసింది. ప్రతిపక్ష కాంగ్రెస్ చరిత్రను తిరగరాస్తూ భారీ విజయాన్ని అందుకున్నది. కర్నాటక ఎన్నికలు ఆయా రాష్ట్రాల్లోని బీజేపీ శాఖలకు భయాన్ని పుట్టిస్తున్నాయి. మోడీ బొమ్మను పెట్టుకొని ప్రచారం చేసినా.. సాక్షాత్తూ ఆయనే వచ్చి ప్రచారాం చేసినా ఎలాంటి ప్రయోజనమూ ఉండదనీ, పైగా ఇంకా నష్టమే ఎదరయ్యే ప్రమాదమున్నదని ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. "మోడీ, షా, యోగి.. ఇలా ఎవరు ప్రచారం చేసినా కర్నాటకలో ప్రజలను ఆకర్షించలేకపోయారు. అక్కడ బీజేపీ దారుణ ఓటమిని చూసింది. మోడీ, షా తో పాటు ఇతర కేంద్ర నాయకుల ప్రచారమూ అంత ప్రయోజనాన్ని చేకూర్చకపోవచ్చు. పైగా.. కేంద్రంలోని మోడీ సర్కారుపై ఉన్న వ్యతిరేకత.. వారి ప్రచారంతో తమపై పడే ప్రమాదం ఉన్నదని ఆయా రాష్ట్రాల శాఖలు భయపడుతున్నాయి" అని రాజకీయ విశ్లేషకులు వివరిస్తున్నారు. మోడీ ఎంతో గొప్పగా చెప్పుకునే డబుల్ ఇంజిన్ సర్కారు ప్రచారం ఏ మాత్రమూ పని చేయదని చెప్తున్నారు.



రాజస్థాన్‌లో సీపీఐ (ఎం) అభ్యర్థుల నామినేషన్లు

(మొదటిపేజీ తరువాయి)

జరిగిన బహిరంగ సభలో బృందకరత్, అమ్రా రామ్ ప్రసంగించారు. ఈ సభలో పార్టీ జిల్లా కార్యదర్శి కిషెన్ పారిక్, ఇతర నియోజకవర్గాలకు చెందిన సీపీఐ(ఎం) అభ్యర్థులు ప్రసంగించారు.

శుక్రవారం దూద్ నియోజకవర్గం నుంచి పెమా రామ్, సికార్ నియోజకవర్గం నుంచి ఉస్మాన్ ఖాన్ సీపీఐ(ఎం) అభ్యర్థులుగా నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా సికార్ పట్టణంలో ఈ ఇద్దరు అభ్యర్థులా భారీ ర్యాలీ నిర్వహించారు. ర్యాలీని ఉద్దేశించి అభ్యర్థులు ప్రసంగించారు. దుంగార్‌పూర్ (ఎస్టీ) నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు గౌతమ్‌లాల్ దామోర్ నామినేషన్ వేశారు. రాష్ట్ర నాయకులు దులి చంద్ మీనా, విమల్ భగోరా సమక్షంలో నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా దుంగార్‌పూర్ పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించారు. నోహర్ నియోజకవర్గం నుంచి మంగేజ్ చౌదరి సీపీఐ(ఎం) అభ్యర్థిగా నామినేషన్ వేశారు. ర్యాలీలో వేలాది మంది ప్రజలు పాల్గొన్నారు.

నామినేషన్‌కు ముందే సీపీఐ(ఎం) అభ్యర్థి అరెస్టు

రాష్ట్రంలోని తారానగర్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా ప్రకటించిన నిర్మల్ రాణాను నామినేషన్ వేయడానికి ముందే పోలీసులు అరెస్టు చేశారు. గతంలో ప్రజాసమస్యలపై నిర్వహించిన ఆందోళనకు సంబంధించిన కేసులో నిర్మల్ రాణాను అరెస్టు చేశారు. దీంతో ఆయన నామినేషన్ దాఖలు చేయలేకపోయారు. ఎన్నికల ప్రక్రియను తారుమారు చేసే ఇలాంటి డర్టీ ట్రిక్స్‌ను ఖండించాలని సీపీఐ(ఎం) పిలుపునిచ్చింది. 200 ఎమ్మెల్యే స్థానాలు ఉన్న రాష్ట్రంలో ఈ నెల 25న ఎన్నికలు జరగనున్నాయి. డిసెంబరు 3న ఫలితాలను ప్రకటించనున్నారు.



మ్యానిఫెస్టోల్లో... మాకేదీ చోటు...?

వికలాంగులు ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వారిపై వివక్ష చూపుతున్నాయి. రాష్ట్రంలో 21 రకాల వైకల్యాలతో బాధపడుతున్న వికలాంగుల సంక్షేమానికి మొక్కుబడి కేటాయింపులు తప్ప మేలు చేసింది లేదు. వికలాంగుల చట్టాలు అమలుకు నోచట్లేదు. వివిధ సంక్షేమ పథకాల్లో ఐదు శాతం వాటా దక్కట్లేదు. విద్య, వైద్య సదుపాయాల్లేవు. ఉపాధి, ఉద్యోగ అవకాశాలు సైతం లేకపోవడంతో ఇతరులపై ఆధారపడాల్సి వస్తోంది. ఇతరుల కంటే వికలాంగులకు ఏదో ఒక వైకల్యం ఉండొచ్చు కానీ..! ఓటు విషయంలో మాత్రం అందరితో సమానులే..!! పాలక పార్టీలు తమ ఎన్నికల మ్యానిఫెస్టోల్లో వికలాంగుల సంక్షేమం, అభివృద్ధి కోసం ఎలాంటి ప్రస్తావనా చేయలేదు. అన్ని రాజకీయ పార్టీలు మ్యానిఫెస్టోలో వికలాంగుల సంక్షేమం కోసం ప్రత్యేక డిక్లరేషన్ చేయాలని వికలాంగుల సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

తెలంగాణలో శారీరక, మానసిక వైకల్యం, లాకోమోటో, కుష్టు వ్యాధి, పక్షవాతం, మరుగుజ్జు, కండరాల బలహీనత, యాసిడ్ అటాక్, కనుచూపు లేకపోవడం, అంధత్వం, చెవిటి, వినికిడి లోపం, భాషా వైకల్యం, మానసిక ప్రవర్తనా లోపం వంటి 43.04 లక్షల మంది వికలాంగులున్నారు. రాష్ట్రంలో కేంద్ర ప్రభుత్వం ద్వారా 83 రకాల పథకాలు అమలు చేస్తున్నామని చెబుతున్నా అవి రికార్డుల్లో తప్ప ఆచరణలో వికలాంగులకు అందుతున్నది లేదు. రాష్ట్ర ప్రభుత్వం పింఛన్, వీల్‌చైర్స్ పంపిణీ తప్ప ఆర్థిక స్వావలంబన సాధించేందుకు దోహదపడే పథకాలేవీ అమలు చేయట్లేదు.

అందని ద్రాక్షలా పథకాలు

కేంద్ర ప్రభుత్వం ద్వారా రాష్ట్రంలో 83 రకాల పథకాలు వికలాంగుల కోసం అమలు చేస్తున్నట్టు చెబుతున్నారు. వాస్తవంగా చూస్తే దీన్ దయాళ్ పునరావాస పథకం ద్వారా రాష్ట్రంలో 3291 మంది వికలాంగులు మాత్రమే లబ్ధి పొందుతున్నారు. లక్షలాది మంది వికలాంగులుంటే ఐదు వేల మందికే వీల్ చైర్స్ పంచారు. 10 లక్షల మంది వికలాంగులకు ఫిజియోథెరఫీ, స్పీచ్ థెరఫీ, బిహేవియర్ థెరపీ అవసరముంది. మరో పది లక్షల మందికి వైద్యపరమైన సౌకర్యాలు కావాలి. రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న పింఛన్ పెరుగుతున్న ధరలు, అవసరాలకు సరిపడట్లేదు. కనీసం రూ.10 వేలకు పింఛన్ పెంచాలని పోరాడుతున్నారు. ఆదాయ పరిమితి విధించే జీవో 17ను రద్దు చేయాలని పోరాడుతున్నారు. వికలాంగులకు 250 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ ఇవ్వాలంటున్నారు. వికలాంగుల స్వయం ఉపాధి కోసం దళిత, బీసీ, మైనార్టీ బంధు మాదిరే వికలాంగ బంధు పథకం పెట్టాలని, అంత్యోదయ రేషన్‌కార్డులిచ్చి రేషన్ పాసుల ద్వారా నిత్యావసర సరుకులివ్వాలని, డబుల్ బెడ్‌రూమ్, గృహలక్ష్మి పథకాల్లో ఐదు శాతం వికలాంగులకు కేటాయించాలని కోరుతున్నారు. ఇంటి స్థలమున్న వాళ్లకు ఇల్లు నిర్మించాలని, స్థలాలేనోళ్లకు 120 గజాలివ్వాలని డిమాండ్ చేస్తున్నారు.

ప్రత్యేక డిక్లరేషన్ చేయాలి

ఎన్నికల మ్యానిఫెస్టో అంటే వికలాంగులకు ఆసరా పింఛన్లు తప్ప మరేమీ లేదన్నట్టుగా రాజకీయ పార్టీలు భావిస్తున్నాయి. పింఛన్ అనేది బిక్షలా భావిస్తున్నాయి తప్ప నిస్సహాయులైన వికలాంగుల హక్కు అని పాలక పార్టీలు గుర్తించని దుస్థితి ఉంది. ఆసరా పింఛన్లు మాత్రమే వికలాంగుల జీవితాల్ని మారుస్తాయనే భ్రమల్లో పార్టీలున్నాయి. నిరుద్యోగ వికలాంగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి. స్వయం ఉపాధి కోసం వంద శాతం సబ్సిడీతో రుణ సదుపాయం కల్పించాలి. ఆర్థిక స్వాలంబన సాధించేందుకు వికలాంగులకు అవసరమైన బడ్జెట్‌ను కేటాయించాలి. వికలాంగులం దరికీ విద్యా అవకాశాలు అందేలా ప్రతి నియోజక వర్గానికో వికలాంగుల కోసం ప్రత్యేక స్కూల్, హాస్టల్ ఏర్పాటు చేయాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేసే పథకాల్లో వికలాంగులకు 5 శాతం ప్రత్యేక కోటా ఇచ్చి అందజేయాలి. వికలాంగుల వివాహ ప్రోత్సాహాన్ని రూ.2.50 లక్షలకు పెంచాలి. వికలాంగు లపై జరుగుతున్న వేధిం పులు అరికట్టేందుకు ప్రత్యేక చట్టం చేయాలి. హైదరాబాద్, జిల్లా కేంద్రా ల్లో వికలాంగుల భవనాల కోసం స్థలాలు కేటాయించాలి. ఇలాంటి అవకాశాలు కల్పిస్తామని చెప్పి అన్ని రాజకీయ పార్టీలు ఎన్నికల మ్యానిఫెస్టోలో వికలాంగుల కోసం ప్రత్యేక డిక్లరేషన్ చేయాలని వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పీఆర్‌డీ) రాష్ట్ర కార్యదర్శి అడివయ్య డిమాండ్ చేశారు.



2016 వికలాంగుల హక్కుల పరిరక్షణ చట్టం

వికలాంగ హక్కుల పరిరక్షణ చట్టం 2016 సెక్షన్ 79 ప్రకారం వికలాంగుల కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి. చైర్మెన్, సభ్యుల్ని నియమించాలి. అదే విధంగా వికలాంగులపై జరిగే వివక్షను అరికట్టాలి. దోపిడీకి గురైనా, వేధింపులు, వివక్షపూరితంగా వ్యవహరించినా రక్షణ కల్పించాలి. యాసిడ్ దాడులకు గురవుతున్న మహిళలూ వికలాంగులవుతున్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చట్టాలు చేసే విషయంలో చూపుతున్న శ్రద్ధ వాటిని అమలు చేయడంలో చూపట్లేదని వికలాంగుల హక్కుల సంఘాలు పేర్కొంటున్నాయి.



బీఆర్ఎస్‌లో చేరిన జ్ఞానేశ్వర్

ఈటల కన్నా పెద్ద మనిషి కాసాని

రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు ముదిరాజ్‌లకు..
రాజేందర్ ఎవరినీ ఎదగనివ్వలేదు
బీఆర్ఎస్ అధినేత, సీఎం కేసీఆర్

నవతెలంగాణ-మర్కుక్

"ఈటల రాజేందర్ కన్నా పెద్ద మనిషి కాసాని జ్ఞానేశ్వర్ మన పార్టీలోకి వచ్చారు. ముదిరాజ్‌లకు రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవులు వస్తాయి.. ఈటల ముదిరాజ్‌లలో ఎవరినీ ఎదగనివ్వలేదు.." అని బీఆర్ఎస్ అధినేత, ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గంలోని ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో శుక్రవారం టీటీడీపీ రాష్ట్ర మాజీ అధ్యక్షులు కాసాని జ్ఞానేశ్వర్ ముదిరాజ్ సీఎం కేసీఆర్ సమయంలో బీఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్ మాట్లాడుతూ.. ఈసారి రాజ్యసభ, ఎమ్మెల్సీ, ఇతర నామినేటెడ్, మున్సిపల్ కార్పొరేషన్ మేయర్, జెడ్పీ, మున్సిపల్ చైర్మెన్, స్థానిక సంస్థల పదవుల్లో ముదిరాజ్‌లకు పెద్ద పీట వేస్తామని చెప్పారు. బండ ప్రకాష్‌ని తీసుకొచ్చి ఎంపీ, ఎమ్మెల్సీ, కౌన్సిల్ వైస్ చైర్మెన్ పదవులు ఇచ్చామన్నారు. ఎన్నికల తరువాత కాసాని జ్ఞానేశ్వర్ ఆధ్వర్యంలో ముదిరాజ్ కుల పెద్దలను కూర్చోబెట్టుకొని ప్రధాన సమస్యల పరిష్కారంపై చర్చించి తగు నిర్ణయం తీసుకుంటామని తెలిపారు.

కాసాని జ్ఞానేశ్వర్‌తో పాటు టీడీపీ జాతీయ కార్యదర్శి కాసాని వీరేష్, టీటీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బండారి వెంకటేష్ ముదిరాజ్, రాష్ట్ర అధికార ప్రతినిధి ముప్పిడి గోపాల్, టీటీడీపీ రాష్ట్ర మీడియా కో ఆర్డినేటర్ బియ్యని సురేష్, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు ప్రకాష్ ముదిరాజ్, భిక్షపతి ముదిరాజ్, పుట్టిరాజు ముదిరాజ్, జగదీష్ యాదవ్, మన్నే రాజు, సపన్ దేవ్ ముదిరాజ్, మహేశ్వరం ఇన్‌చార్జి ఎద్ల మల్లేష్ ముదిరాజ్, కరీంనగర్ నియోజకవర్గ ఇన్‌చార్జి కనకయ్య ముదిరాజ్, బాన్సువాడ నియోజకవర్గ ఇన్‌చార్జి కరాటే రాజు ముదిరాజ్, టీడీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు రాఘవేంద్ర ప్రతాప్, సాంస్కృతిక విభాగం రాష్ట్ర అధ్యక్షుడు చంద్రహాస్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ ప్రధాన కార్యదర్శి దూసరి వెంకటేష్ బీఆర్ఎస్‌లో చేరారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్సీ, ప్రభుత్వ విప్ శంబీపూర్ రాజు, కుత్బుల్లాపూర్ ఎమ్మెల్యే కేపీ వివేకానంద గౌడ్, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నేతలు మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి ఉన్నారు.



నామినేషన్ పత్రాలు చూపిస్తున్న యువకులు

సిద్దిపేటలో పోటీకి సిద్ధమవుతున్న యువత

నవతెలంగాణ- సిద్దిపేట

సిద్దిపేట నియోజకవర్గం నుంచి పోటీ చేయడానికి యువకులు సిద్ధపడుతున్నట్టు తెలుస్తుంది. శుక్రవారం నాటికి సుమారుగా 35 నామినేషన్ పత్రాలను తీసుకెళ్లినట్టు సమాచారం. రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగ భృతి ఇవ్వకపోవడం, ఉద్యోగ ప్రకటనలు చేసినప్పటికీ నియామకాలు చేపట్టకపోవడంతోనే యువకులు ఈసారి పోటీలో ఉండటానికి సిద్ధపడుతున్నట్టు తెలుస్తుంది.

'మల్కాజిగిరి'పై స్పెషల్ ఫోకస్

ప్రతిష్టాత్మకంగా తీసుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్
త్వరలో కవిత, రాహుల్‌గాంధీ రోడ్ షోలు
రసవత్తరంగా నియోజకవర్గం రాజకీయం


మల్కాజిగిరి నియోజకవర్గంపై బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలు స్పెషల్ ఫోకస్ పెట్టాయి. రెండు పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. ఇరు పార్టీల అభ్యర్థులూ నిత్యం మాటల తూటాలతో ప్రజల్లో ఉంటున్నారు. ఇరు పార్టీల అగ్రనేతలతో త్వరలో ప్రచారం చేయించనుండటంతో 'మల్కాజిగిరి' రాజకీయం రసవత్తరంగా మారింది. త్వరలో ఎమ్మెల్సీ కవిత, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ రోడ్ షోలు కూడా ఉన్నట్టు సమాచారం.

నవతెలంగాణ-సిటీబ్యూరో

మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా రాజకీయం మొత్తం మల్కాజిగిరి నియోజకవర్గం చుట్టే తిరుగుతోంది. గడిచిన రెండు నెలల కాలంలో ఈ నియోజకవర్గం రాష్ట్ర వ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. సిట్టింగ్ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంత రావు మంత్రి హరీశ్‌రావుపై హాట్ కామెంట్స్ చేయడం, ఆ తర్వాత పార్టీ మారడంతో 'మల్కాజిగిరి' రాజకీయంలో వేగంగా మార్పులు చోటు చేసుకుంటున్నాయి. మరోవైపు నియోజకవర్గం లో పాగా వేసేందుకు మంత్రి మల్లారెడ్డి ఐదేండ్లుగా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు. ఇప్పుడు అవకాశం రావడంతో తన అల్లుడు మర్రి రాజశేఖర్‌రెడ్డిని బీఆర్ఎస్ అభ్యర్థిగా బరిలో నిలిపి పంతం నెగ్గించుకునేందుకు మంత్రి తీవ్ర ప్రయత్నం చేస్తున్నారు. మైనంపల్లి సైతం మరోసారి గెలుపు కోసం కష్టపడుతున్నారు. దీంతో ఇప్పుడు మల్కాజిగిరి రాజకీయం 'మల్లారెడ్డి వర్సెస్ మైనంపల్లి'గా మారింది. ఐదేండ్లుగా మైనంపల్లి, మల్లారెడ్డి మధ్య గ్యాప్ ఉన్నా, పెద్దగా కనిపించలేదు. రాను రాను ఈ గ్యాప్ ముదిరి ఒకరిపై మరొకరు బహిరంగ విమర్శలు చేసుకునే స్థాయికి చేరుకున్నది. ఇదే సమయంలో అసెంబ్లీ ఎన్నికలు రావడంతో ఈ ఇద్దరు నేతల మధ్య పచ్చగడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి ఏర్పడింది. రెండు నెలలుగా ఇద్దరు నేతల మధ్య మాటల తూటాలు పేలుతూనే ఉన్నాయి.

త్వరలో అగ్ర నేతల పర్యటనలు

నియోజకవర్గంలో గెలుపే లక్ష్యంగా పెట్టుకున్న బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల అభ్యర్థులు ఇప్పటికే దాదాపు నియోజకవర్గం మొత్తం ఒక రౌండ్ ప్రచారం పూర్తి చేశారు. అయినా అక్కడక్కడా ప్రతికూల వాతావరణ పరిస్థితులు కనిపిస్తుండటంతో ఇరు పార్టీల అగ్ర నేతలను రంగంలోకి దించి బలాబలాలను నిరూపించుకునేందుకు ఇద్దరు అభ్యర్థులూ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే రెండ్రోజుల కిందట మంత్రి హరీశ్‌రావు బీఆర్ఎస్ నియోజకవర్గ కార్యకర్తల సమావేశంలో 'మల్కాజిగిరి'ని దత్తత తీసుకుంటా అని హామీనివ్వడంతోపాటు మర్రి రాజశేఖర్‌రెడ్డిని గెలిపిస్తే నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుందని వివరించి వెళ్లారు. త్వరలో ఎమ్మెల్సీ కవిత రోడ్ షో నిర్వహించేందుకు బీఆర్ఎస్ నాయకులు ప్రయత్నం చేస్తున్నారు.





నేరేడ్‌మెట్, ఆనంద్‌బాగ్, అనుటెక్స్ లాంటి ప్రధాన కూడళ్లలో రోడ్ షోలో ఎమ్మెల్సీ కవితతో మాట్లాడించేందుకు ప్లాన్ చేస్తున్నారు. కాంగ్రెస్ నేతలు సైతం అగ్రనేత రాహుల్ గాంధీతో నియోజకవర్గంలో రోడ్ షో లేదా భారీ ర్యాలీ నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఆరు గ్యారంటీలపై నియోజకవర్గం ప్రజలకు నమ్మకం కలిగించేలా రాహుల్ గాంధీతో స్పీచ్ ఇప్పించనున్నారు. ఆ తర్వాత టీపీసీసీ అధ్యక్షులు రేవంత్‌రెడ్డితోపాటు మరికొందరు నేతలతో కూడా సభలు, సమావేశాలు నిర్వహించనున్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ అగ్ర నేతల పర్యటనలు ఈ వారం రోజుల్లోపు పూర్తయ్యేలా ఇరు పార్టీల అభ్యర్థులూ ప్లాన్ చేస్తున్నారు. ఇప్పటికే సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా నిలిచిన మల్కాజిగిరి నియోజకవర్గంలో అగ్ర నేతల రాకతో రాజకీయ సమీకరణాలు మరింత మారనున్నాయి.

పంచ్ తంత్రం!



ఏపూట ఎవ్వడు ఏపార్టీలుండునో
ఏమాత్రమును ఎవ్వడెరుగ లేదు
ఎవనిచంకన దూరి ఎవనిపంచనజేరి
ఎవడెట్లు వాగునో ఎరుగలేము
ఎటుటిక్కెటొచ్చునో అటుదూకు గోపీలు
అన్ని గుంపులలోన మిన్న గుంద్రు
కన్నుగీటితెచాలు కదిలిపోయేటట్లు
బుద్ధిజీవులుగూడ సిద్ధమంద్రు

ఇంత జరిగాక ఇంతింత కంతవడగ
ఎవడు పాలించునీనేల తవుడుబుక్కి
గింజలెట్లుంటె చెట్టట్ల గిట్టు గాని
ఓటి విసరేయ మరియోటి ఎటులదక్కు

– ఏనుగు నరసింహారెడ్డి

ఒక్కొక్క సారి మన గురించి క్షణం కూడా
ఆలోచించని వారి కోసం
గంటల తరబడి
ఆలోచించవలసి వస్తుంది..
ఆ విషయం మీకు అర్థమైనా మరుక్షణం
ఆలోచించడం మానేయండి..



ప్రజల మనిషి నర్రా

కమ్యూనిస్టు యోధుడు రాఘవరెడ్డి
ఆరు పర్యాయాలు ఎమ్మెల్యే
డాంబికాలు లేని సాధారణ జీవితం
అసెంబ్లీలో పిట్టకథలతో ప్రజావాణి వినిపించిన ప్రజ్ఞాశాలి

నర్రా రాఘవరెడ్డి ప్రజా జీవితం అత్యంత పారదర్శకం. కమ్యూనిస్టు యోధుడు. ఆయన ఆరుసార్లు ఎమ్మెల్యేగా చేసినా ప్రజల మనిషిగా.. అతి సాధారణ జీవితం గడిపారు. డాంబికాలు, అహంభావాలు లేని శాసనసభ్యునిగా ఆయన పేరొందారు. ప్రజా సమస్యలను పిట్టకథల రూపంలో శాసనసభలో లేవనెత్తి.. పరిష్కారానికి కృషి చేశారు. ఆయన పట్ల మరెవరూ వేలెత్తిచూపేవారు కాదు. ప్రజా ఉద్యమాలే జీవితంగా బతికిన ప్రజల మనిషి. కమ్యూనిస్టు ప్రమాణాలను ప్రాణంగా భావించిన ఆదర్శమూర్తి.

అణిముత్యాలు..

నవతెలంగాణ- నకిరేకల్

నర్రా రాఘవరెడ్డి 1924 సంవత్సరంలో చిట్యాల మండలంలోని వట్టిమర్తి గ్రామానికి చెందిన నర్రా కమలమ్మ, రాంరెడ్డిలకు జన్మించారు. చిన్నవయసులోనే తల్లి కమలమ్మ మృతిచెందడంతో పెదనాన్న నర్రా వెంకటరామిరెడ్డి పెంచుకున్నారు. ఆ తర్వాత నర్రా బతుకుదెరువు వెతుక్కుంటూ బొంబాయికి వలస వెళ్లి బట్టల మిల్లులో కార్మికుడిగా చేరారు. కార్మికుల బాధలు తీర్చడానికి కమ్యూనిస్టు పార్టీకి అనుబంధంగా ఉన్న లాల్ బావుటా కార్మిక సంఘంలో సభ్యుడుగా చేరిన నర్రా చురుకైన పాత్ర పోషించారు. ఎనిమిదేండ్ల తర్వాత నర్రా తిరిగి సొంత ఊరు వచ్చారు. సీపీఐ(ఎం)లో క్రమశిక్షణ, పట్టుదల, కార్యదక్షిత కలిగిన నర్రా అంచలంచెలుగా ఎదిగి ప్రజాఉద్య మాలకు నాయకత్వం వహించారు. రాష్ట్ర అభివృద్ధికి చేపట్టాల్సిన ప్రాజెక్టులు, పథకాల రూపకల్పనలో ప్రభుత్వానికి నర్రా పలు సలహాలు, సూచనలు చేసి ప్రజాసంక్షేమానికి పాటుపడ్డారు.

ప్రజాప్రతినిధిగా..

1950లో సీపీఐ జిల్లా కార్యాలయ కార్యదర్శిగా పనిచేసిన నర్రా 1959 పంచాయతీ ఎన్నికల్లో చిట్యాల మండలం వట్టిమర్తి గ్రామ సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. 1964 ఎన్నికల్లో తిరిగి సర్పంచ్‌గా గెలిచిన నర్రా మరోసారి జిల్లా పరిషత్‌లో ఫైనాన్స్ కమిటీ సభ్యుడిగా పని చేశారు. సీపీఐ(ఎం)పై అప్పటికి కేంద్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం అణచివేత చర్యలకు పూనుకోగా 1964 డిసెంబర్‌లో అరెస్టయిన ఆయన 1966లో విడుదలయ్యారు. 1967 ఎన్నికల్లో తొలిసారిగా నకిరేకల్ నియోజకవర్గం నుంచి సీపీఐ(ఎం) అభ్యర్థిగా నర్రా రాఘవరెడ్డి కాంగ్రెస్ అభ్యర్థి ఎం.కమలమ్మపై గెలిచి శాసనసభలో అడుగుపెట్టారు. 1972లో జరిగిన ఎన్నికల్లో ఉగ్రవాదుల వల్ల ఓడిపోయారు. ఆ తర్వాత వెనుతిరగకుండా 1978, 1983, 1985, 1989, 1994 ఎన్నికల్లో వరుసగా ఐదుసార్లు నకిరేకల్ ఎమ్మెల్యేగా విజయం సాధించారు. ఆరోగ్యం సహకరించకపోవడంతో 1999లో శాసనసభకు పోటీ చేయలేదు కానీ, ఎన్నికల ప్రచారంలో పాల్గొని పార్టీ అభ్యర్థి విజయానికి విశేష కృషి చేశారు.





పల్లె సుద్దులు చెప్తున్న నర్రా

కడవరకు ప్రజానాయకునిగా..

నర్రా రాఘవరెడ్డి తన రాజకీయ పోరాటంలో 1972లో మినహా ఎప్పుడూ అపజయాన్ని చవిచూడలేదు. సీపీఐ(ఎం) శాసనసభాపక్ష నేతగా, ఉపనేతగా పనిచేసిన నర్రారాఘవరెడ్డి నాల్గో తరగతి వరకు చదివినా చిన్ననాటి నుంచే విప్లవ భావజాలాన్ని ఒంటపట్టించుకున్నారు. ప్రపంచ రాజకీయాలను విశ్లేషించగల మేధస్సును సాధించారు. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల పనితీరుపై తనదైన శైలిలో విమర్శనాస్త్రాలు సంధించేవారు. అనారోగ్యంతో బాధపడిన నర్రా ఏప్రిల్ 9, 2017న కన్నుమూశారు. కమ్యూనిస్టు పోరాట యోధునిగా, ప్రజానాయకునిగా నర్రా రాఘవరెడ్డి జీవితం ఎప్పటికీ అందరికీ ఆదర్శప్రాయం.

బహుముఖ సేవలు

నర్రా రాఘవరెడ్డి కళాకారునిగా, పార్టీ నిర్మాణ బాధ్యుడిగా, ప్రజా సమస్యల్ని అధికారుల వద్ద రిప్రజెంటేషన్ చేసేవారు. 1973లో బీబీనగర్ నడికుడి రైలుమార్గం సాధనలో నర్రా ముఖ్యపాత్ర పోషించారు. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టు సాధనకు కృషి చేశారు. గీతకార్మిక సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులుగా నర్రా ఎన్నికై ఎక్సైజ్ విధానానికి, కాంట్రాక్టు పద్ధతికి వ్యతిరేకంగా ఉద్యమాలు చేసి గుర్తింపు తెచ్చారు. గ్రామ సేవకుల సంఘాన్ని జిల్లాలో ఏర్పాటు చేసి రాష్ట్ర ఉద్యమంగా తీర్చిదిద్దడంలో నర్రా పాత్ర ఎంతో ఉంది. చేనేత కార్మిక సంఘాన్ని ముందుకు నడిపారు. గొల్ల సుద్దులు, పిట్టలదొర ఇలా అనేక కళారూపాలు ప్రదర్శించి ప్రజల ఆదరణ పొందారు.

Printed and Published by Nandayala Narsimha Reddy On behalf Of Navatelangna Printers Private Limited, Printed At M.H Bhavan, 1st Floor, Plot No. 21/1, Azamabad Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020,Telangana State,
Published at Navatelangana Printers Private Limited, M.H Bhavan,1st Floor No.21/1, Azamabad, Near Rtc Kalyana Mandapam, Baghlingampally, Hyderabad-500020, Telangana State, Editor : R.Sudha Bhaskar TELTEL/2014/59462.